
'అన్నం పెట్టే రైతన్నను
రుణ విముక్తుణ్ని చేయడమే
నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 282

మంగళవారం 2-1-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జీఎస్‌టీ @ 1.64 లక్షల కోట్లు

2022 డిసెంబర్‌తో పోలిస్తే 10 శాతం అధికం.

-13లో



వన్డేలకు వార్నర్ గుడ్‌బై

రిటైర్మెంట్ ప్రకటించిన ఆసీస్ ఓపెనర్.. ఇక టీ20లకే పరిమితం

-12లో



నోబెల్ గ్రహీతకు 6 నెలల జైలు

బంగ్లాదేశ్ ఆర్థిక వేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ మహ్మద్ యూనస్‌కు కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

- వివరాలు 6లో



మసూద్ అజార్ హతం?

కాందహార్ విమానం హైజాక్ సూత్రధారి మసూద్ అజార్ బాంబు పేలుడులో హతం అయ్యాడనే పోస్టులు వైరల్‌గా మారాయి.

- వివరాలు 6లో



వేగంగా జేఎన్.1 వ్యాప్తి

దేశంలో కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు ఇప్పటి వరకు 197 గుర్తించినట్లు ప్రభుత్వ విభాగం ఇన్సాకాగ్ తెలిపింది.

- వివరాలు 6లో



బడబానల కొండలు!

ఏకంగా 8 అగ్ని పర్వతాలు అంటార్కిటికా మహాసముద్రంలో 4 వేల మీటర్ల లోతున చాలాకాలంగా నిద్రాణంగా ఉన్నాయట.

- వివరాలు 6లో

రద్దు చేయం.. సరిచేస్తాం

మెట్రో మార్గాలు, ఫార్మాసిటీ సహా దేనినీ నిలిపేయడం లేదు • మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

- ఆస్తులు సృష్టిస్తాం.. రాష్ట్రానికి భారమయ్యే పనులు చేయం
- ఒకేచోట ఫార్మాసిటీ కాకుండా.. పది ప్రాంతాల్లో ఫార్మా విలేజీలు
- ఓఆర్ఆర్–ఆర్ఆర్ఆర్ మధ్య పది చోట్లబల్క్‌డ్రగ్ పరిశ్రమలు
- ఒక్కోచోట వెయ్యి నుంచి మూడు వేల ఎకరాల్లో ఏర్పాటు
- ఫార్మాసిటీ ప్రతిపాదిత ప్రాంతంలో కాలుష్యరహిత పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు..

- ఎయిర్‌పోర్టుకు అవతల కోటిన్నర మందితో కొత్త సిటీ వస్తుంది.. ప్రజల అవసరానికి తగ్గట్టు మెట్రో విస్తరణ
- మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు.. మైండ్‌స్పేస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు.. నాగోల్ నుంచి ఒవైసీ ఆసుపత్రి మీదుగా ఫలక్‌నుమా, శంషాబాద్ వరకు నిర్మిస్తాం..
- వైఎస్సార్ వాడిన క్యాంప్ ఆఫీసును రాష్ట్ర అతిథి గృహంగా మారుస్తున్నాం.. మహీంద్రా, సెంచురీ, టాటా వంటి సంస్థల ఆధ్వర్యంలో నైపుణ్య వర్సిటీలు
- ప్రతి వంద పడకల ఆస్పత్రికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని వెల్లడి
- తమ ప్రభుత్వంలో మంత్రులు పూర్తి స్వేచ్ఛగా పనిచేస్తున్నారని వ్యాఖ్య

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: తమ ప్రభుత్వం మెట్రో మార్గం, ఫార్మాసిటీ సహా దేనినీ రద్దు చేయడం లేదని.. ప్రజోపయోగకరంగా మార్పులు మాత్రమే చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. తమ ప్రభుత్వం ఆస్తులు సృష్టిస్తుందే తప్ప.. రాష్ట్రానికి భారమయ్యే ఏ పనీ చేయబోదని వివరించారు. ఫార్మాసిటీ స్థానంలో ఫార్మా విలేజీలు నిర్మిస్తామన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా, తక్కువ ఖర్చుతోనే శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో రైల్‌ను అనుసంధానిస్తామని తెలిపారు. చెన్నై, ముంబై, బెంగళూరు వంటి నగరాలు శాచురేషన్‌కు వచ్చాయని.. రాష్ట్రం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా, ఎయిర్‌పోర్టుకు అవతలివైపు కోటిన్నర ప్రజలతో కొత్త సిటీని నిర్మించబోతున్నామని చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ ఆధ్వర్యంలోనే మెట్రో విస్తరణ చేపడతాం. మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు విస్తరిస్తాం. అవసరమైతే రామచంద్రాపురం వరకు పొడిగిస్తాం. నాగోల్–ఎల్బీనగర్–ఒవైసీ ఆస్పత్రి మీదుగా ఫలక్‌నుమా–శంషాబాద్ వరకు.. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రోరైల్ విస్తరిస్తాం. అలాగే

మిగతా 2వ పేజీలో ▶



రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మంత్రి కొండా సురేఖ సెల్ఫీ

ప్రజాపాలన తర్వాత నామినేటెడ్‌పై ఫోకస్

ఆరో తేదీ తర్వాత కసరత్తు పూర్తి చేయనున్న సీఎం

- ఆ తర్వాత అధిష్టానం వద్దకు జాబితా.. సంక్రాంతిలోపు ప్రకటన
- పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులని స్పష్టీకరణ

2లో

డ్రగ్స్ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ మాదిరిగా పూర్తిస్థాయిలో పనిచేసేలా టీఎస్ నాబ్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2 లో



నింగిలోకి ఎక్స్‌పోశాట్

నూతన సంవత్సరంలో తొలి రోజే ఇస్రో ధమాకా

- పీఎస్ఎల్‌వీ 60వ ప్రయోగం దిగ్విజయం
- ప్యూయల్ సెల్ సహా 10 పరికరాలు భూ కక్ష్యలోకి
- భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటులో కీలకం
- శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు
- ఇది గగన్‌యాన్ ఏడాది: ఇస్రో చైర్మన్

6 లో

ఇక అన్ని స్కూళ్లలో 'ఫేషియల్ రికగ్నిషన్'

- ప్రభుత్వ పాఠశాలల్లో పథకాలన్నిటికీ ఇదే ఆధారం
- ఆదేశాలు జారీ చేసిన విద్యా శాఖ
- క్షేత్రస్థాయిలో సమస్యలున్నాయంటున్న టీచర్లు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇక నుంచి పూర్తి స్థాయిలో ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి తాజాగా అన్ని స్కూళ్లకు పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదును పారదర్శకంగా నిర్వహించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల హాజరు విధానంలో అక్రమాలకు ఆస్కారం లేకుండా చేయాలని భావిస్తున్నారు. దీని కోసం ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించారు. కాగా, ఈ హాజరు విధానం ద్వారానే విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్కూల్ డ్రెస్, పాఠ్యపుస్తకాలు ఇవ్వాలన్నది

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కేరళ నాయర్లూ.. రాజస్తాన్ గుజ్జర్లూ చుట్టాలే!



దక్షిణాది రాష్ట్రమైన కేరళలోని నాయర్లు... వాయవ్య దిశలో ఉన్న రాజస్తాన్, దాని పొరుగునే ఉన్న పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాలకు చెందిన గుజ్జర్లు చుట్టాలేనట! ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) తాజా అధ్యయనంలో వెల్లడించింది.

- వివరాలు 14లో

100% ఆక్యుపెన్సీ దాటిన 'వందేభారత్'



కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన వందేభారత్ రైళ్లు అత్యధిక ఆక్యుపెన్సీతో పరుగులు తీస్తున్నాయి. దక్షిణ మధ్య రైల్వేలో గతేడాది ప్రవేశపెట్టిన నాలుగు రైళ్లలో ఆక్యుపెన్సీ వంద శాతం దాటింది.

- వివరాలు 14లో


విద్యకు 'నూతన' జవసత్వాలు!



కొత్త సంవత్సరంలో విద్యా రంగం వినూత్న జవసత్వాలను సంతరించుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖపై జరిపిన సమీక్ష తర్వాత విద్యాసంస్థల్లో మార్పులపై సంకేతాలు వస్తున్నాయి.

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



నాకెందుకో కూటమి లేనప్పుడే బాగా కలిసి ఉన్నామనిపిస్తోంది!

జపాన్ ఇషిగావాలోని వజిమాలో భూకంపం ధాటికి దెబ్బతిన్న ఇల్లు



జపాన్‌లో సునామీ హెచ్చరికలు

ద్వీప దేశం వాయవ్య తీరంలో తీవ్ర భూకంపం

వివరాలు 6లో

- ఇషిగావా, నిగాటా, టొమయాలో 21 సార్లు భూప్రకంపనలు.. రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదు
- నేలకూలిన పలు ఇళ్లు.. సహాయక చర్యలు ప్రారంభం
- ఉభయ కొరియా, రష్యాలోనూ సునామీ హెచ్చరికలు


కొత్త ఏడాదికి కిక్కేకిక్కు

- డిసెంబర్ 30న రికార్డు స్థాయిలో రూ.312 కోట్ల విలువైన లిక్కర్ విక్రయం
- మూడు రోజుల్లో అమ్మకాలు రూ.620 కోట్ల దాకా..

14 లో

కొత్త ఏడాదికి లిక్కర్ కిక్కు బాగానే ఎక్కింది. కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యే రోజుతోపాటు రెండు రోజుల ముందు నుంచీ ఏకంగా రూ. 620 కోట్ల విలువైన మద్యం డిపోల నుంచి వైన్‌షాపులకు చేరింది.





సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు

6 లో

గుజరాత్‌లోని మెహ్సానా జిల్లా మోదేరాలోని సూర్యుడి ఆలయంలో సూర్య నమస్కారాలు చేస్తున్న యోగా వలంటీర్లు. వేలాదిగా ఏకకాలంలో సూర్య నమస్కారాలు చేయడం ద్వారా గుజరాత్ వాసులు ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

తీర్పులు న్యాయమూర్తుల వ్యక్తిగతం కాదు

రాజ్యాంగం, చట్టం ప్రకారమే కేసులపై తీర్పులిస్తారు.. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడి



న్యాయమూర్తులు తీర్పు వెలువరించిన తర్వాత అది ప్రజల ఆస్తిగా మారుతుంది. ఆ తీర్పుపై అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రజలకు ఉంటుంది. రాజ్యాంగం, చట్టానికి లోబడి తీర్పులిచ్చేందుకు కృషి చేస్తాం. తీర్పుపై వచ్చే విమర్శలను తిప్పికొట్టడం లేదా సమర్థించుకోవడం సరైన పని అని నేను అనుకోవడం లేదు.

- సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

6 లో

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

- 636 మంది పోలీసులకు ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన హోం శాఖ కార్యదర్శి జితేందర్



సాక్షి, హైదరాబాద్: విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సరం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. పోలీస్ శాఖలోని వివిధ విభాగాలతో పాటు అగ్నిమాపక శాఖ, అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో మొత్తం 636 మంది సిబ్బందికి ఈ పతకాల్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖలోని

మిగతా 3వ పేజీలో ▶



సోమవారం హైదరాబాద్‌లో పారిశుధ్య కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పారిశుధ్య కార్మికులతో కేటీఆర్ భేటీ

తెలంగాణ భవన్‌లో సహపంక్తి భోజనం • సెల్ఫీలు, ఫొటోలతో సందడి

వివరాలు 3లో

క్లుప్తంగా...

ఏజీగా సుదర్శన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



ఏజీ చాంబర్‌లో అడ్వొకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎ.సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గా సీనియర్ న్యాయవాది ఎ.సుదర్శన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా హైకోర్టులోని ఏజీ కార్యాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఏజీలు తేరా రజనీ కాంత్‌రెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, ఇతర ప్రభుత్వ న్యాయవాదులు హాజరయ్యారు.

మరో ఏఏజీగా ఇమ్రాన్‌ఖాన్



ఏజీ సుదర్శన్‌రెడ్డిని కలసిన ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్. చిత్రంలో మరో ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ)ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో పెద్ద ఎత్తున పిటిషన్లు పెండింగ్‌లో ఉండటం, వీలైనంత త్వరగా వీటిని పరిష్కరించాలని నిర్ణయించిన సీఎం రేవంత్‌రెడ్డి మరో ఏఏజీ అవసరమని భావించారు. ఇప్పటికే ఏఏజీగా తేరా రజనీకాంత్‌రెడ్డి నియమించిన విషయం తెలిసిందే. మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలన్న ఉద్దేశంతోనే సీఎం ఇమ్రాన్‌ఖాన్ వైపు మొగ్గు చూపినట్టు సమాచారం. 1988లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయిన ఖాన్, 2021లో ఏప్రిల్‌లో సీనియర్‌గా హోదా పొందారు. ప్రభుత్వ వాదనలు సమర్థవంతంగా వినిపించి పిటిషన్లు సత్వరం పరిష్కారం అయ్యేలా చూడాలని ఏజీ, ఏఏజీలకు సీఎం సూచించినట్టు తెలిసింది. ఏఏజీగా ఉత్తర్వులు అందుకున్న ఇమ్రాన్‌ఖాన్ ఏజీ సుదర్శన్‌రెడ్డిని కలిశారు. కాగా, పెండింగ్ కేసులను పరిశీలించిన తర్వాత మరో ఏజీని నియమించాలన్న ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. న్యాయశాఖ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్న రేవంత్‌రెడ్డి, పెండింగ్ భారాన్ని కూడా తగ్గించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

ఇస్రోకు సీఎం రేవంత్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: పీఎస్ఎల్వీ–సీ58 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం ద్వారా ఇస్రో మరో శిఖరం చేరిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగమైన ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా తర్వాత బ్లాక్ హోల్స్‌ను అధ్యయనం చేయడానికి అబ్జర్వేటరీ ఉపగ్రహం కలిగి ఉన్న రెండో దేశంగా భారతదేశం అవతరించిందని పేర్కొన్నారు. కొత్త సంవత్సరం తొలిరోజున ఇస్రో రోదసీలో దేశ పతాకాన్ని ఎగురవేసిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సీఎంతో అంతర్జాతీయ విత్తన పరీక్షల సంఘం అధ్యక్షుడు భేటీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ విత్తన పరీక్షల సంఘం (ఇస్టా) అధ్యక్షుడు, తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయంగా తెలంగాణ విత్తనాల ఎగుమతులకు ఉన్న అవకాశాలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

ఒకే విధులకు ఒకేవిధంగా వేతనం ఇవ్వాలి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఒకే విధులు నిర్వహించేవారికి వేతనం ఒకేలా ఇవ్వాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మాస్టర్స్ డిగ్రీ ఉన్నవారికి ఒకలాగా, లేనివారికి మరోలా వేతనం చెల్లించడం సరికాదని వ్యాఖ్యానించింది. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినవారికి ఒకలా, డిగ్రీ చేసిన వారికి మరోలా వేతనాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏపీ రాష్ట్ర హెచ్‌ఐవీ కౌన్సెలర్స్ అండ్ టెక్నీషియన్స్ యూనియన్ 2012లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఒకే పనిచేస్తున్నా చెల్లింపుల్లో తేడాలు రాజ్యాంగ విరుద్ధమని, వేతనాలు కూడా ఒకేలా చెల్లించేలా ఆదేశాలివ్వాలన్నారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టి తుది ఉత్తర్వులు వెల్లడించారు. ఈ ఉత్తర్వులు ఇచ్చిన 8 వారాల్లో వేతన సమస్యను పరిష్కరించాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డీజీని, ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీని ఆదేశించారు.

సంపూర్ణంగా సహకరిస్తాం

గవర్నర్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- తమిళిసై దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని వినతి!
- రాజ్‌భవన్ వాట్సాప్ చానల్ ఆవిష్కరించిన గవర్నర్



గవర్నర్ తమిళిసైకి పుష్పగుచ్ఛం అందిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి

విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయండి: గవర్నర్

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, వర్సిటీల్లో తక్షణమే బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని గవర్నర్ సూచించినట్టు తెలిసింది. రాజ్‌భవన్ తరఫున కొత్త ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తమిళిసై హామీ ఇచ్చినట్టు సమాచారం.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాజ్‌భవన్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నూతన సంవత్సర ఆరంభం సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన.. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క) ఆయన వెంట ఉన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా రాజ్‌భవన్‌కు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. గవర్నర్ దంపతులకు శాలువ కప్పి సత్కరించారు. అనంతరం గవర్నర్‌తో దాదాపుగా 15 నిమిషాల పాటు విడిగా భేటీ అయ్యారు. ఏమైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని, వెంటనే పరిష్కరిస్తామని గవర్నర్‌ను సీఎం కోరారు. గత ప్రభుత్వ హయాంలో ధ్వంసమైన పాలన వ్యవస్థలను మళ్లీ గాడిలో పెడుతున్నామని వివరించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని, వెంటనే కొత్త చైర్మన్, సభ్యులను నియమిస్తామని తెలియజేసినట్టు సమాచారం. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని అందువల్ల త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరినట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, చర్యలు, ప్రణాళికలను రేవంత్ వివరించినట్టు సమాచారం.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నూతన సంవత్సర ఆరంభం పురస్కరించుకుని గవర్నర్ తమిళిసై రాజ్‌భవన్‌లో కేక్ కట్ చేశారు. ఓపెన్ హౌస్ నిర్వహించి అతిథుల నుంచి శుభాకాంక్షలు అందుకున్నారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇతర సీనియర్ అధికారులు, 2,500 మంది సాధారణ ప్రజలు గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ పిలుపు మేరకు పూలబొకేలకు బదులుగా చాలామంది అతిథులు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను కానుకలుగా ఇచ్చారు. దీంతో 25,000 నోట్‌బుక్స్ రాజ్‌భవన్‌కు అందాయి. ఈ పుస్తకాలను జీహెచ్‌ఎంసీ, గిరిజన ప్రాంత మురికివాడల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నర్ రాజ్‌భవన్‌కు సంబంధించిన వాట్సాప్ చానల్ (https:// whatsapp. com/ channel/0029VaIxdrC4 NVicOQDVvY3 L)ను కూడా ఆవిష్కరించారు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమాల వార్తలు, ఫొటోలను దీనిద్వారా ఎప్పటికప్పుడు విడుదల చేయనున్నారు.

గవర్నర్ తమిళిసైకి అయోధ్య రాముడి అక్షింతలు

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ తమిళిసైకి శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు అయోధ్య రాముల వారి అక్షింతలు అందజేశారు. ఈనెల 1 నుంచి 15 వరకు నిర్వహించే జన సంపర్క అభియాన్ కార్యక్రమాన్ని రాజ్‌భవన్‌లో సోమవారం గవర్నర్ ప్రారంభించారు. ప్రపంచంలోని ప్రతి హిందువుకు రాముల వారి అక్షింతలు అందజేసి, మందిర దర్శనానికి ఆహ్వానం పలుకుతున్నట్లు ఈ సందర్భంగా తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా తొలిరోజు గవర్నర్‌కు సంప్రదాయబద్ధంగా బొట్టుపెట్టి, అక్షింతలు, పసుపు, కుంకుమ, గాజులు అందజేసి రామమందిర దర్శనానికి ఆహ్వానం పలికినట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువును అయోధ్య రామ జన్మభూమి దర్శనానికి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రధాన నగరాలతో పాటు ప్రతి గ్రామం, బస్తీ, పల్లె, తండా, గిరిజన ప్రదేశాలకు కూడా రాముడి అక్షింతలు చేరాయన్నారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ బాధ్యులు సురేందర్‌రెడ్డి, పండరీనాథ్, జగదీశ్వర్, రామ్‌సింగ్, నరసింహమూర్తి, సునీతారామ్మోహన్ రెడ్డి, భాను ప్రసాద్, పగుడాకుల బాలస్వామి, శివరాములు, పద్మశ్రీ, పాల్గొన్నారు.

గవర్నర్, సీఎంలకు యాదాద్రి ఆచార్యుల ఆశీర్వచనం

యాదగిరిగుట్ట: నూతన సంవత్సరం సందర్భంగా గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డిలకు యాదాద్రి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. దేవాదాయ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ఆచార్యులు సోమవారం హైదరాబాద్‌లో గవర్నర్‌ను, సీఎంను కలిశారు. వేద ఆశీర్వచనం చేసిన అనంతరం నూతన సంవత్సర కేలండర్‌తోపాటు యాదాద్రీశుడి లడ్డూప్రసాదం అందజేశారు.

వర్సిటీల్లో ఏం జరుగుతోంది?

సమగ్ర నివేదిక కోరిన సీఎం రేవంత్‌రెడ్డి

- పలువురు వీసీలపై ఫిర్యాదుల పరంపర
- త్వరలోనే భారీమార్పులు జరిగే అవకాశం !

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీల పాలనాపరమైన వ్యవహారాల్లో సమూలమార్పుల దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం అన్ని యూనివర్సిటీల సమగ్ర నివేదికలు తెప్పించుకుంది. ఉన్నతవిద్యలో కీలక పదవులు నిర్వహించినవారు, అధికార పార్టీకి అనుకూలంగా ఉండే కొన్ని అధ్యాపక సంఘాలతో వర్సిటీల్లో చోటుచేసుకున్న ఘటనలపై సీఎంకు నివేదికలు అందాయి. ఇటీవలి విద్యాశాఖ సమీక్షలో సీఎం వీటిని ప్రస్తావించినట్టు తెలిసింది. వర్సిటీల వీసీలు, ఉన్నతవిద్య ఉన్నతాధికారుల మధ్య వైరం, వర్సిటీల్లో కీలకవ్యక్తుల మధ్య వివాదాలు వంటి అంశాలపై సీఎంకు స్పష్టత ఉందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. త్వరలో కీలక మార్పులకు అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆరోపణలపై ఆరా

విశ్వవిద్యాలయాల్లో వైస్ చాన్సలర్ల నియామకంలో రాజకీయ ప్రాధాన్యం అనేక దుష్ఫలితాలకు దారి తీస్తోందని పలువురు ప్రొఫెసర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వీసీని నియమించేటప్పుడు సెర్చ్ కమిటీ అన్ని విషయాలపై నివేదిక ఇస్తుంది. కానీ ఈ కమిటీకి ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదని వారు చెబుతున్నారు. ఓ వర్సిటీ వీసీ నియామకాన్ని సెర్చ్ కమిటీ తీవ్రంగా తప్పుబట్టినా పెద్దగా పట్టించుకోలేదు. ఆయన ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు పీహెచ్‌డీ చేసే విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చిన విషయాన్ని కమిటీ ప్రస్తావించింది. ఇలాంటి వ్యక్తిని వీసీగా పెట్టడం వల్ల పాలనపరమైన పోస్టుల భర్తీలోనూ అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయని సీఎంకు తెలిపారు.

మితిమీరిన ఐఏఎస్‌ల ప్రభావం

విద్యాశాఖ కమిషనర్ల పాత్ర కూడా వర్సిటీల్లో కొత్త సమస్యలకు దారి తీస్తోందని నిపుణులు అంటున్నారు. ఇటీవల ఓ ఐఏఎస్ అధికారి నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఆయనకు నచ్చిన విషయాలను వర్సిటీ పాలక మండలిలో ఆమోదం పొందేందుకు ఒత్తిడి తెచ్చినట్టు విమర్శలున్నాయి. దీంతో ఆయనకు, వీసీకి మధ్య జరిగిన ప్రచ్ఛన్నపోరు వర్సిటీ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించిందని పలువురు సీఎం దృష్టికి తెచ్చారు. అధికారులపై తన మాట నెగ్గించుకునేందుకు చేసిన ఒత్తిడి వల్ల అనేక కొత్త సమస్యలు ఎదురైనట్టు తెలిపారు.

మరో యూనివర్సిటీలో ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తిని రిజిస్ట్రార్‌గా కొనసాగించిన తీరు కూడా అనేక విమర్శలకు కారణమైంది. దీని వెనుక వీసీ ప్రమేయం కూడా ఉందని చెబుతున్నారు. ఈ తరహా పరిణామం గతంలో ఎన్నడూ లేదని నిపుణులు అంటున్నారు.

హైదరాబాద్‌లో అయితే ఇష్టారాజ్యం

హైదరాబాద్‌లోని కొన్ని యూనివర్సిటీల్లో వీసీల ఇష్టారాజ్యం నడుస్తోందని ఓ ప్రొఫెసర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓ వర్సిటీ వీసీ ఇష్టానుసారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం చేపట్టారు. ఇందులో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్టు విమర్శలున్నాయి. అనుబంధ గుర్తింపు ఇచ్చే క్రమంలోనూ ఆయన ప్రైవేటు కాలేజీల నుంచి వసూళ్లు చేపట్టినట్టు ఆరోపణలున్నాయి. రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తున్నారని, విద్యార్థులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారని తరచూ ఫిర్యాదులు వస్తున్న వీసీలపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. నిబంధనల పేరుతో ఒక వీసీ వ్యవహరించిన తీరుపై ఇప్పటికే సీఎం ఆరా తీసినట్టు తెలిసింది.



బాసరపై ప్రత్యేక దృష్టి

బాసర ట్రిపుల్ ఐటీపై వస్తున్న ఆరోపణలపై సీఎం సమగ్ర నివేదిక తెప్పించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా అక్కడ అనేక రకాల ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యార్థుల ఆత్మహత్యలు, ఆందోళనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులను బెదిరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టుల వ్యవహారంలో అవినీతి, వీసీ, డైరెక్టర్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎప్పుడో ఓసారి వెళుతున్న తీరుపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ప్రక్షాళన అనివార్యమని సీఎం భావిస్తున్నట్టు సమాచారం.

రద్దు చేయం.. సరిచేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

మైండ్‌స్పేస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు విస్తరించి పూర్తిస్థాయిలో వినియోగిస్తాం. గత ప్రభుత్వం రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు విస్తరణ కోసం రూ.9వేల కోట్లు వ్యయం చేయడానికి సిద్ధమైంది. అలాగే బీహెచ్‌ఈఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు మరోలైన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు విస్తరించకుండా కొత్తగా చేపట్టడం అనవసర వ్యయమే. అక్కడి నుంచి మెట్రో ఎక్కేవారు ఎవరూ ఉండరు. అది నిర్మించి ఉంటే.. కాళేశ్వరం తరహాలో రాష్ట్రానికి భారంగా మారేది. మేం చేసిన మార్పులతో నగరంపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. దీనికి కేంద్రం పూర్తిగా నిధులు సమకూర్చే అవకాశం ఉంది. ప్రస్తుత మెట్రోకు అనుసంధానం చేయడం వల్ల వ్యయం కూడా తగ్గుతుంది.

ఫార్మాసిటీకి బదులు ఫార్మా విలేజ్‌లు

25వేల ఎకరాల్లో ఒకే చోట ఫార్మాసిటీ నిర్మిస్తే.. చివరికి అంతర్జాతీయ విమానాశ్రయం కూడా పనికిరాకుండా పోతుంది. న్యూయార్క్ ఎయిర్‌పోర్టు మాదిరిగా అవుతుంది. అందుకే ఔటర్ రింగ్‌రోడ్డు– రీజనల్ రింగ్‌రోడ్డు మధ్య పది ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం. నిరుపయోగంగా భూములు తీసుకుని ఒక్కో క్లస్టర్‌లో వెయ్యి నుంచి మూడు వేల ఎకరాల్లో జీరో పొల్యుషన్ ఉండేలా ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తాం. ఒక్కోదానిలో పది పరిశ్రమలు ఉండేలా చూస్తాం. అక్కడ పనిచేసే వారికి అదే క్లస్టర్‌లో గృహాలతోపాటు అన్ని సౌకర్యాలతో పూర్తి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ప్రతిపాదిత ఫార్మాసిటీ ప్రాంతంలో కాలుష్య రహిత పరిశ్రమలు, టౌన్‌షిప్‌లు, విద్యాలయాలు, ఆస్పత్రులు, వాణిజ్య భవన సముదాయాలు, వినోద సంబంధిత మల్టీప్లెక్స్‌లు వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. బీవైడీ వంటి ఎలక్ట్రానిక్ కార్ల కంపెనీలు సహా రాష్ట్రానికి వచ్చే ఎలాంటి పరిశ్రమలనూ వదులుకోబోం. వారికి అవసరమైన రాయితీలు కల్పిస్తాం.

ప్రఖ్యాత కంపెనీల ఆధ్వర్యంలో వర్సిటీలు..

రాష్ట్రంలో ప్రత్యేక నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం అగ్రశ్రేణి కంపెనీలను ఆహ్వానించాం. టాటా, మహీంద్రా, సెంచురీ సంస్థల ఆధ్వర్యంలో అవి ఏర్పాటవుతాయి. ఒక్కో పరిశ్రమ ఐదు యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తుంది. ఇంటర్ పూర్తిచేసిన వారికి ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు ఉంటాయి. విద్యాశాఖ పర్యవేక్షణలోనే ఈ వర్సిటీలు ఉంటాయి. వీటిలో అభ్యసించే వారికి ఆ సంస్థలే ఉపాధి కల్పించడం, క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు వంటి చర్యలు చేపడతాయి. నైపుణ్యంతో కూడిన డిగ్రీ ఉంటే వారికి ఉపాధి గ్యారంటీ అవుతుంది. ఒక్కో యూనివర్సిటీకి ప్రభుత్వం రెండు వందల ఎకరాల వరకు భూమి ఇస్తుంది. ప్రస్తుతం టాటా సంస్థ రూ.1,400 కోట్లు ఐటీఐలపై వెచ్చిస్తే.. మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.400 కోట్లు వెచ్చిస్తుంది.

అతిథి గృహంగా.. వైఎస్సార్ క్యాంప్ ఆఫీసు

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి క్యాంపు కార్యాలయంగా వాడిన భవనాన్ని రాష్ట్ర అతిథి గృహంగా మారుస్తున్నాం. నివాస భవనాన్ని మంత్రి నివాసంగా కేటాయించాం. కేసీఆర్ క్యాంపు కార్యాలయంగా వినియోగించిన భవనాన్ని కొత్తగా ప్రారంభించనున్న 'మహాత్మా జ్యోతిబా పూలే ఇనిస్టిట్యూట్ ఫర్ పాలసీ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఆన్ సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్' కోసం వినియోగిస్తాం.

వంద పడకల ప్రతి ఆస్పత్రికి నర్సింగ్ కళాశాల

రాష్ట్రంలో వంద పడకలున్న ప్రతీ ఆస్పత్రికి అనుబంధంగా ఓ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తాం. నర్సులకు విదేశాల్లోనూ అధిక డిమాండ్ ఉంది. ఇటీవల వృద్ధులను చూసుకునే అవకాశాలు తగ్గుతున్నాయి. వారికి చేదోడువాదోడుగా ఉండే నర్సులకు స్థానికంగానూ ఉపాధి లభిస్తుంది. విదేశాల్లో పని చేసే నైపుణ్యం ఉన్న, లేనివారికి కూడా ఓరియంటేషన్ ఇప్పిస్తాం. విదేశాల్లోని పరిశ్రమలతో ప్రభుత్వమే సంప్రదింపులు జరిపి ఉద్యోగాలు కల్పిస్తాం. వేతనాలను కూడా ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. వారికి ఏ ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది..'' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

ప్రజల ప్రభుత్వం మాది

మాది ప్రజలతో మమేకమయ్యే ప్రభుత్వం. ప్రజావాణి కోసం ప్రజలంతా రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా.. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళుతోంది. మంత్రులందరినీ కూడా ప్రజల దగ్గరకే వెళ్లాలని కోరాను. 80% సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం అవుతాయి. మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండటమే ప్రజా ప్రభుత్వం. మంత్రులు పూర్తి స్వేచ్ఛగా పనిచేస్తున్నారు. గతంలో ఒక్కరే పనిచేసేవారు. ఆయనే ఫొటోలో, ప్రచారంలో ఉండేవారు. ఇప్పుడు మంత్రులంతా ప్రజల్లోనే ఉంటున్నారు. మా పాలనలో పరిపాలన వికేంద్రీకరణ చేశాం. వందరోజులు టార్గెట్‌గా పనిచేస్తున్నాం.



హైకోర్టు సీజేకు సీఎం రేవంత్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

ఎస్‌ఐబీ, గ్రేహౌండ్స్ మాదిరిగా పూర్తిస్థాయిలో పనిచేసేలా టీఎస్ నాబ్

- ఇందుకు 301 మందితో ప్రత్యేక దర్యాప్తు విభాగం
- ఇక్కడ పంట తక్కువ.. వినియోగం ఎక్కువ.. పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక నిఘా
- ఇతర రాష్ట్రాలతోనూ సమన్వయం చేసుకుని పనిచేస్తాం
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు ఉన్న తరహాలోనే ఈ ప్రత్యేక న్యాయస్థానం ఉంటుందని వెల్లడించారు. మత్తు పదార్థాలతో విద్యార్థులు, యువత నిర్వీర్యం అవుతున్నారని, వారిని దీని నుంచి రక్షించడానికి తెలంగాణ రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్‌నాబ్)ను పటిష్టం చేస్తున్నామన్నారు. మత్తుపదార్థాలు ఎవరికీ అందుబాటులో లేకుండా సమూలంగా నిర్మూలిస్తామని చెప్పారు. ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధేతో చర్చిస్తానని తెలిపారు. రాష్ట్రంలో మత్తుపదార్థాలు పండించడం కంటే వినియోగం ఎక్కువగా ఉందని సీఎం వ్యాఖ్యానించారు. గ్రేహౌండ్స్, ఎస్‌ఐబీలు ఏ విధంగా అయితే మావోయిస్టులను అణచివేశాయో, అదేవిధంగా మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ కర్తవ్యమని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. టీఎస్ నాబ్ కోసం అడిషనల్ డీజీపీ సందీప్ శాండిల్యను నియమించామని, మరో 301 మంది అధికారులతో దీనిని బలోపేతం చేస్తామని సీఎం చెప్పారు. వీరికి గ్రేహౌండ్స్, ఎస్‌ఐబీలో పనిచేస్తున్న వారికి ఇస్తున్న మాదిరిగా అలవెన్సు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. డ్రగ్స్ సరఫరాకు సంబంధించి పూర్తిస్థాయిలో ఇన్‌ఫార్మర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి..డ్రగ్స్ అనే పదం వినపడకుండా చేయాలన్నది ప్రభుత్వ కృతనిశ్చయం అని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు ఇతరత్రా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. సినీతారల డ్రగ్స్ కేసు పురోగతిలో ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ మేరకు రెండుఫ్లోర్లు టీఎస్‌నాబ్‌కు కేటాయించామని తెలిపారు. ఏటీబీతోపాటు ఇతర రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపుతామని, ఇందుకు టీఎస్ నాబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విదేశీయుల కోసం డీఅడిక్షన్ కేంద్రం

చర్లపల్లి జైలులో రెండు ఎకరాల స్థలంలో డీఅడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్టు సీఎం చెప్పారు. నైజీరియా, ఇతర ఆఫ్రికా దేశాల నుంచి వచ్చేవారు వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉంటూ, మత్తుపదార్థాలు విక్రయిస్తున్నారని, అలాంటి వారికోసం ఈ డీఅడిక్షన్ కేంద్రం పనిచేస్తుందన్నారు.

విభాగాల అధిపతుల నియామకం వరకే నా పని

ఆయా విభాగాల అధిపతులను నియమించడం వరకే తన పని అని, ఆ తర్వాత వారికి కింద ఎవరు కావాలన్నది వారి నిర్ణయానికి వదిలేస్తున్నట్టు చెప్పారు. తాను అడిగిన ఫలితాలు రాకపోతే, సంబంధిత విభాగ అధిపతి సమాధానం చెప్పాల్సిందేనని సీఎం వ్యాఖ్యానించారు. మూడు కమిషనరేట్లకు కమిషనర్లను నియమించినా వారికీ అవసరమైన మ్యాన్‌పవర్‌ను వారే పిక్ చేసుకుంటారన్నారు.

రాష్ట్ర సలహా మండలి..

రాష్ట్ర సలహా మండలిని ఏర్పాటు చేస్తామని దీనికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు అయ్యే మహాత్మా జ్యోతిబా పూలే ఇనిస్టిట్యూట్ ఫర్ పాలసీ స్టడీస్, రీసెర్చ్ ఆన్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్‌లా ఈ సలహామండలి పనిచేస్తుందన్నారు. ప్రొఫెసర్లు హరగోపాల్, నాగేశ్వర్‌తో పాటు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, ఆకునూరి మురళి లాంటి మేధావులతో ఇది ఉంటుందన్నారు. అన్నిరకాల గురుకుల విద్యాలయాలు, మండలస్థాయిలో ఏర్పాటు చేసే ఇంటర్నేషనల్ స్కూల్స్ కూడా ఈ సంస్థ పర్యవేక్షణలో ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేసినా, మౌలిక సదుపాయాలు కల్పించలేదని, అగ్గిపెట్టెల్లాంటి అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్య 100 రోజుల్లో పరిష్కారం

జర్నలిస్టుల సమస్యలను వందరోజుల్లో పరిష్కరిస్తామని, ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను సంక్రాంతి లోగా నియమిస్తామన్నారు. ఇళ్ల స్థలాల అంశం మరోసారి రాకుండా పూర్తిస్థాయిలో జర్నలిస్టుల సమస్యను ఒక పద్ధతి ప్రకారం పరిష్కరిస్తామని అందరికీ ఇళ్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు.



సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ జర్నలిస్టులు

ప్రజాపాలన తర్వాత నామినేటెడ్‌పై ఫోకస్

ఆరో తేదీ తర్వాత కసరత్తు పూర్తి చేయనున్న సీఎం

- ఆ తర్వాత అధిష్టానం వద్దకు జాబితా.. సంక్రాంతిలోపు ప్రకటన
- పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 6వ తేదీన ప్రజాపాలన కార్యక్రమం ముగిసిన తర్వాత నామినేటెడ్ పోస్టులను ఖరారు చేసే ఆలోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారు. మొదటి నుంచీ చర్చ జరుగుతున్న విధంగా సంక్రాంతి లోపు మొదటి దఫా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసేందుకు తనను కలిసిన విలేకరులతో సీఎం రేవంత్ ఈ మేరకు తన మనసులో మాట చెప్పారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసే క్రమంలో తనతో ఉన్న సాన్నిహిత్యం, పార్టీలో పలుకుబడి పనిచేయవని, పార్టీ కోసం కష్టపడ్డవారికి, కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో భాగంగా త్యాగం చేసిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎవరికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నది పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు.

తీవ్ర పోటీ

పార్టీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల సలహాలు, సూచనలు, సిఫారసులు తీసుకుని ఆరో తేదీ తర్వాత ముఖ్యమంత్రి కసరత్తు పూర్తి చేయనున్నారు. అనంతరం ఆ జాబితాను పార్టీ అధిష్టానానికి పంపి అక్కడ అనుమతి తీసుకున్న తర్వాత సంక్రాంతిలోపు ఈ పదవుల పందేరంపై ప్రకటన చేస్తారని తెలుస్తోంది. కాగా, పదేళ్ల తర్వాత అధికారం దక్కిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. రాజకీయంగా గుర్తింపు ఉండే కీలక కార్పొరేషన్లతో పాటు ఇతర కార్పొరేషన్లకు చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ల కోసం పోటీ పడుతున్న వారి జాబితా చాంతాడంత తయారయింది. ఈ నేపథ్యంలో సామాజిక సమీకరణలు, జిల్లాల వారీ ప్రాతినిధ్యం, పార్టీలో అనుభవం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితా తయారు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుధవారం జరిగే టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో కూడా సీఎం రేవంత్ ఈ పోస్టులపై మరింత స్పష్టత ఇస్తారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌ది శ్వేతపత్రం, బీఆర్‌ఎస్‌ది స్వేదపత్రం, మాది సంపద పత్రం

– బూర నర్సయ్యగౌడ్



సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ సర్కార్‌ది శ్వేతపత్రం, బీఆర్‌ఎస్‌ది స్వేదపత్రమైతే తమది మాత్రం సంపద పత్రమని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ పార్టీ శ్వేత పత్రం ద్వారా కాలయాపన చేస్తుంటే స్వేదపత్రంతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పదేళ్లలో రూ.6.32 లక్షల కోట్లు అప్పులు చేసిందని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు భిన్నంగా వ్యవహరిస్తుంటే తాము మాత్రం సంపద పత్రం విడుదల చేస్తున్నామన్నారు. సోమవారం నర్సయ్యగౌడ్‌ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసేది కొండంత అయితే చెప్పుకునేది గోరంత అన్నారు. పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.9.36 లక్షల కోట్లు ఇచ్చిందని వెల్లడించారు. రహదారుల కోసమే మోదీ ప్రభుత్వం లక్షా ఎనభై వేల కోట్లు ఖర్చు చేస్తోందని నర్సయ్యగౌడ్‌ చెప్పారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలకు రుణాలు ఇప్పించింది కేంద్రమే కాగా.. డబ్బా కొట్టుకుంటున్నది గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్రం ఆస్తులు, వాటి విలువ పెరగడానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని పేర్కొన్నారు. తమ హామీలపై చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు కాంగ్రెస్‌కు వందరోజుల గడువు ఇచ్చామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని 17 సీట్లలో గెలిపించాలని కోరుతున్నామని నర్సయ్యగౌడ్‌ తెలిపారు.

సీఎం రేవంత్‌ అందరికీ న్యాయం చేస్తారు: వీహెచ్‌



సాక్షి, హైదరాబాద్‌: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అందరికీ న్యాయం చేస్తారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రకటించిన పథకాలపై మాజీమంత్రి హరీశ్‌రావు తొందరపడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో బీఆర్‌ఎస్‌ ఇచ్చిన దళితులకు మూడు ఎకరాలు, ఇంటికో ఉద్యోగం హామీల గతి ఏమైందో చెప్పాలని డిమాండ్‌ చేశారు. బీఆర్‌ఎస్‌ ఇచ్చిన హామీలు, ధరణి పేరుతో పేదల భూములు లాక్కున్న విషయాలన్నీ ప్రజలు గమనించారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీల స్కీంలతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, ప్రజలకు తమపై నమ్మకం ఉందని, వాటన్నింటినీ అమలు చేస్తామని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు గెలిచి సోనియాగాంధీకి కానుకగా ఇవ్వాలని కోరారు. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్‌ 20–20 టోర్నమెంట్‌ ఫైనల్‌ మ్యాచ్‌కు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించామని తెలిపారు.

నేడు ఢిల్లీలో బీజేపీ భేటీకి రాష్ట్రనేతలు

సాక్షి, హైదరాబాద్‌: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో ఢిల్లీలో మంగళవారం నిర్వహిస్తున్న సమావేశానికి పలువురు రాష్ట్ర పార్టీ నేతలు హాజరుకానున్నారు. ఈ భేటీలో ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్‌ సూర్యనారాయణగుప్తా, నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, చింతా సాంబమూర్తి, అందెల శ్రీరాములు యాదవ్‌ పాల్గొననున్నారు. 22న అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించి పార్టీపరంగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

▶ మొదటి పేజీ తరువాయి

పలు విభాగాల్లో పనిచేస్తున్న 89 మందికి ఉత్తమ సేవా, 42 మందికి కఠిన సేవా, 435 మందికి సేవా పతకాలు లభించాయి. 9 మందికి మహోన్నత సేవా పతకాలు లభించాయి. ఏసీబీలో ఐదుగురికి ఉత్తమ సేవా, ముగ్గురికి సేవా పతకాలు లభించాయి. విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విభాగంలో ముగ్గురికి ఉత్తమ సేవా, ఏడుగురికి సేవా పతకాలు లభించాయి. అగ్నిమాపక శాఖలో ఆరుగురికి శౌర్య పతకాలు, ముగ్గురు ఉత్తమ సేవా, 13 మంది సేవా పతకాలు పొందారు. ఎస్పీఎఫ్‌లో ఒకరికి మహోన్నత సేవా పతకం, నలుగురికి ఉత్తమ సేవా, 15 మందికి సేవా పతకాలు, గ్రేహౌండ్స్‌ కానిస్టేబుల్‌ ఉపేందర్‌కు శౌర్య పతకం లభించింది.

విద్యకు 'నూతన' జవసత్వాలు!

2024లో విద్యా రంగంలో కీలక మార్పుల దిశగా అడుగులు

- ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ నియామకాలు
- బదిలీలు, పదోన్నతులకూ ఆటంకాలు తొలగుతాయనే ఆశలు
- కాలేజీ విద్యలో సంస్కరణలకు.. విశ్వవిద్యాలయాల్లోనూ మార్పులకు అవకాశం
- జాతీయ స్థాయిలో యూజీసీ, ఏఐసీటీఈ కూడా కొత్త పంథాలోనే..



సాక్షి, హైదరాబాద్‌: కొత్త సంవత్సరంలో విద్యా రంగం వినూత్న జవసత్వాలను సంతరించుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో గణనీయ మార్పులు, కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖపై జరిపిన సమీక్ష తర్వాత రాష్ట్రంలో మార్పులపై సంకేతాలు వస్తున్నాయి. ప్రాథమిక విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ స్థాయి వరకు కొత్త అడుగులు పడవచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు జాతీయ స్థాయిలో యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌ (యూజీసీ), అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) వంటి సంస్థలు కూడా ఈ ఏడాది కీలక సంస్కరణల అమలుకోసం సిద్ధమవుతున్నాయి.

ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై ఆశలు

రాష్ట్రంలో 26 వేలకుపైగా ప్రభుత్వ బడులు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే 12 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్లకు పదోన్నతులు కల్పిస్తే మరో 10 వేల వరకు పోస్టులు అందుబాటులోకి వస్తాయి. మొత్తంగా 22 వేల పోస్టులను భర్తీ చేయాల్సి ఉండనుంది. గత ఏడాది 5 వేల పైచిలుకు పోస్టుల భర్తీకి కార్యాచరణ చేపట్టినా అడుగు ముందుకు పడలేదు. అయితే త్వరలో మెగా డీఎస్సీ చేపడతామని రాష్ట్ర సర్కారు ప్రకటించడం విద్యాశాఖలో ఆశలు రేపుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత కేవలం ఏడు జిల్లాల్లోనే పర్యవేక్షణ అధికారులు ఉన్నారు. దీంతో విద్యలో నాణ్యత తగ్గిందన్న ఆరోపణలున్నాయి. మరోవైపు పదోన్నతులు, బదిలీలు కూడా చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం టీచర్లలో హర్షం వ్యక్తమవుతోంది.

కాలేజీ విద్యకూ మంచి రోజులు

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్‌ కాలేజీల్లో 2,400 బోధన సిబ్బంది పోస్టుల భర్తీ కోసం గత ఏడాది ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. కానీ రోస్టర్‌ పాయింట్‌ విషయంలో న్యాయపరమైన ఇబ్బందితో భర్తీ ప్రక్రియ ముందుకు కదల్లేదు. నిజానికి రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో రెగ్యులర్‌ అధ్యాపకులు 1,200 మందే ఉన్నారు. 4,007 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. జూనియర్‌ కాలేజీల్లో 6,008 పోస్టులుంటే.. 4 వేలకుపైగా ఖాళీలు ఉన్నాయి. వీటన్నింటినీ భర్తీ చేసేందుకు అవసరమైన నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో.. కొత్త ఏడాదిలో కాలేజీ విద్యకు మంచిరోజులు వచ్చినట్టేనని అంటున్నారు. ఇక రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 3 వేల అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. మరోవైపు ఉన్నత విద్యా మండలి, విశ్వవిద్యాలయాల ప్రక్షాళన, సమన్వయ పాలన వ్యవహారాలపై సర్కారు దృష్టి పెట్టిందని.. ఇవన్నీ 2024 ఏడాదిలో కీలక పరిణామాలకు దారి తీయవచ్చని అంటున్నారు.

పరీక్షలకు సన్నద్ధమయ్యేలా..

ఫిబ్రవరిలో ఇంటర్, మార్చిలో టెన్త్‌ పరీక్షలు జరగనున్నాయి. గతంలో పేపర్‌ లీకులు, ఇంటర్‌ ఫలితాలపై విద్యార్థుల ఆందోళన వంటివి చోటుచేసుకున్నాయి. దీంతో ఈసారి ప్రభుత్వం పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం, విద్యార్థులను ముందు నుంచే సన్నద్ధం చేస్తూ భయం పోగొట్టడం వంటి చర్యలు చేపట్టనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

మరిన్ని డీమ్డ్‌ వర్సిటీలు

యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌ (యూజీసీ) ఈ ఏడాది కీలక మార్పులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. డీమ్డ్, ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు నిబంధనలను మరింత సరళతరం చేస్తోంది. ఇప్పటికే సంబంధిత ముసాయిదాపై అన్ని వర్గాల ఆమోదం తీసుకున్నారు. మూడేళ్లు వరుసగా న్యాక్‌ ఏ ప్లస్‌తోపాటు గ్రేడ్‌లో నాలుగు పాయింట్లకుగాను కనీసం 3.4 పాయింట్లు సాధించిన కాలేజీలకు డీమ్డ్‌ హోదా ఇవ్వాలని యూజీసీ నిర్ణయించింది. దీనిని బట్టి తెలంగాణలో పది కాలేజీలకు డీమ్డ్‌ హోదా లభించే వీలుంది. మరోవైపు విదేశీ విద్యాలయాలు మన దేశంలో బ్రాంచీల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయి. వాటికి యూజీసీ, సాంకేతిక విద్యా మండలి సూత్రప్రాయ అంగీకారం తెలిపాయి. విదేశీ యూనివర్సిటీల రాకతో విద్యా బోధనలో మార్పు రావొచ్చని నిపుణులు చెప్తున్నారు.

మారుతున్న సిలబస్‌..

ఈ ఏడాది నుంచి పాలిటెక్నిక్‌ సిలబస్‌ మారనుంది. విదేశాల్లోని డిప్లొమా చదువులకు అమలు చేస్తున్న పాఠ్య ప్రణాళికను ఆధారంగా చేసుకుని కొత్త ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఒక్కో డిప్లొమా బ్రాంచీకి ఒక్కో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సింగపూర్, చైనా దేశాల్లోని సిలబస్‌లను ఈ కమిటీలు పరిశీలిస్తాయి. పాలిటెక్నిక్‌ విద్యలో ఇంటర్న్‌షిప్, ఆన్‌లైన్‌ మూల్యాంకనం, ఓపెన్‌ బుక్‌ విధానం వంటి సంస్కరణలు తీసుకొచ్చే అవకాశం ఉంది.

పారిశుధ్య కార్మికులతో కేటీఆర్‌ భేటీ

తెలంగాణ భవన్‌లో సహపంక్తి భోజనం ● సెల్ఫీలు, ఫొటోలతో సందడి



పారిశుధ్య కార్మికులతో సెల్ఫీ తీసుకుంటున్న బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌

సాక్షి, హైదరాబాద్‌: భారత్‌ రాష్ట్ర సమితి వర్కింగ్‌ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు సోమవారం పారిశుధ్య కార్మికులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో వారికి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. కార్మికులతో ముచ్చటిస్తూ సహపంక్తి భోజనం చేశారు. సెల్ఫీలు దిగారు. కాగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పారిశుధ్య కార్మికులు కేటీఆర్‌ దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి చేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందని చెప్పారు. పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో తమకూ మెడికల్‌ లీవ్‌ సౌకర్యం ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో పారిశుధ్య కార్మికులకు మూడు పర్యాయాలు వేతనం పెంచిన విషయాన్ని కేటీఆర్‌ గుర్తు చేశారు. సమస్యలను మేయర్‌ గద్వాల విజయలక్ష్మి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నేతలు, కార్యకర్తల స్వాగతం

నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్‌కు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫొటోలు, సెల్ఫీలు దిగారు. సుమారు ఐదు గంటల పాటు తెలంగాణ భవన్‌లో గడిపిన కేటీఆర్‌ కార్యకర్తలను కూడా కలిశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులున్నారు. కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రాజీవ్‌ సాగర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, నగేష్, టీఆర్‌ఎస్వీ నాయకులు శ్రీకాంత్‌ గౌడ్, తుంగ బాలు, కాటం శివ తదితరులు కేటీఆర్‌ను కలిశారు.

బీజేపీలో 'ఎమ్మెల్సీ పోరు' షురూ!

- నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ స్థానానికి టికెట్‌ కోరుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌.ప్రకాశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: త్వరలో జరగనున్న నల్లగొండ–వరంగల్‌–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్‌ కోసం బీజేపీలో అప్పుడే పోటీ మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో నల్లగొండ–వరంగల్‌–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. వచ్చే ఏప్రిల్, మే నెలలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత పెరుగుతోందన్న అంచనాల మధ్య ఈ ఎమ్మెల్సీ స్థానం నుంచి జరగనున్న ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ఎమ్మెల్సీ టికెట్‌ను తనకే కేటాయించాలంటూ సీనియర్‌ నేత, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఎస్‌.ప్రకాశ్‌రెడ్డి అధినాయకత్వాన్ని కోరుతున్నారు. దీనికోసం కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని కలవడమే కాకుండా రాష్ట్ర పార్టీలోని ఇతర ముఖ్యనేతలతోనూ చర్చించారు. ఇదిలా ఉంటే 2021 మార్చిలో నల్లగొండ–వరంగల్‌–ఖమ్మం స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీచేసి 40వేల పైచిలుకు ఓట్లు సాధించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తనకు జహీరాబాద్‌ లేదా భువనగిరి ఎంపీ టికెట్‌ను లేదా పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటును కేటాయించాలని ప్రేమేందర్‌రెడ్డి కూడా పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నట్టు తెలిసింది. కాగా, ఈ స్థానం కోసం మరికొందరు కూడా ప్రయత్నాలు ప్రారంభించినట్టు సమాచారం.

ఖర్చు ఎంత? మిగులు ఎంత?

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల లెక్కలపై గందరగోళం

- పనుల పురోగతి, నిధుల వినియోగంపై లెక్కలివ్వని ఆయా శాఖలు
- దీంతో ఏడాదిన్నరగా సమీక్షల ఊసెత్తని నోడల్‌ ఏజెన్సీలు
- ఖర్చుకాని నిధులు ఏడేళ్లుగా క్యారీ ఫార్వర్డ్‌కు నోచుకోని వైనం!

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయించిన ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్సీ ఎస్‌డీఎఫ్‌), గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్టీ ఎస్‌డీఎఫ్‌) లెక్కలపై గందరగోళం నెలకొంది. ఈ నిధి వినియోగానికి సంబంధించి నోడల్‌ ఏజెన్సీలుగా వ్యవహరిస్తున్న ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎస్టీ సంక్షేమ శాఖల వద్ద నిధి పురోగతి సమాచారం జాడ లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్‌డీఎఫ్, ఎస్టీ ఎస్‌డీఎఫ్‌ను ప్రవేశపెడుతూ దాదాపు 42 శాఖల ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ నిధులు కేటాయిస్తోంది. అయితే ఈ శాఖల ద్వారా చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులపై పర్యవేక్షణ, సమీక్ష కోసం ప్రత్యేకంగా నోడల్‌ ఏజెన్సీలను ఏర్పాటు చేసింది. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి పర్యవేక్షణ కోసం ఎస్సీ అభివృద్ధి శాఖకు... ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి పర్యవేక్షణ కోసం గిరిజన సంక్షేమ శాఖలకు బాధ్యతలు అప్పగించింది. ఈ నోడల్‌ ఏజెన్సీ కమిటీలకు సంబంధిత శాఖల మంత్రులు చైర్మన్లుగా... కార్యదర్శులు సభ్యకార్యదర్శులుగా వ్యవహరిస్తారు. ఈ నోడల్‌ ఏజెన్సీలు ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై నిధుల వినియోగం, కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించాలి. కానీ దాదాపు ఏడాదిన్నరగా ఈ సమీక్షలు జరగలేదు.

లెక్కలివ్వని శాఖలు..: ప్రత్యేక అభివృద్ధి నిధి వినియోగంలో 42 శాఖలు క్రియాశీలంగా ఉన్నాయి. నిధి కేటాయింపు సమయంలోనే శాఖలవారీగా పనుల కేటాయింపులు జరపడం... వాటికి సంబంధించి నిధులు కేటాయించడం జరుగుతుంది. కేటాయించిన నిధులు, చేపట్టే పనులకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత శాఖలు ప్రతి మూడు నెలలకోసారి పురోగతి నివేదికను నోడల్‌ ఏజెన్సీలకు సమర్పించాలి. అలా శాఖలవారీగా వచ్చిన నివేదికలను క్రోడీకరిస్తూ నోడల్‌ ఏజెన్సీలు సమీక్షలు నిర్వహిస్తుంటాయి. కానీ ఏళ్లుగా ప్రభుత్వ శాఖలు నోడల్‌ ఏజెన్సీలకు నివేదికలు ఇవ్వడం లేదు. నోడల్‌ ఏజెన్సీలుగా వ్యవహరిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలు ప్రభుత్వ శాఖలకు అప్పుడప్పుడూ నివేదికల కోసం లేఖలు రాస్తున్నాయి. ఆయా శాఖలు స్పందించకపోవడంతో చేసేదేం లేక చేతులెత్తేస్తున్నాయి.

తేలని ఖర్చు... మిగులు..: ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టంలో కీలకాంశాలను ప్రభుత్వం పొందుపర్చింది. కేటాయించిన నిధిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం, ఒకవేళ నిధి ఖర్చు కాకుంటే ఆ మిగులును మరుసటి ఏడాదికి క్యారీ ఫార్వర్డ్‌ చేయాలనేది ప్రధాన నిబంధన. ఎస్‌డీఎఫ్‌ చట్టం అమల్లోకి వచ్చి ఏడేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క పైసా క్యారీ ఫార్వర్డ్‌ కాలేదనేది అధికార వర్గాల సమాచారం. ప్రతి సంవత్సరం బడ్జెట్‌ సమావేశాల సందర్భంలో సమర్పించే బడ్జెట్‌ అంచనాల్లో మిగులు నిధులను ప్రస్తావించాలంటే లెక్కలను ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బాధ్యత నోడల్‌ ఏజెన్సీలదే. కానీ సకాలంలో ప్రభుత్వ శాఖల నుంచి నివేదికలు అందకపోవడంతో క్యారీ ఫార్వర్డ్‌పై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం స్ఫూర్తికి విఘాతం కలుగుతోంది.

పాత కక్షలతో కాంగ్రెస్‌ నాయకుడి హత్య

- కామారెడ్డి జిల్లాలో ఘటన



సాదుల రాములు

నస్రుల్లాబాద్‌ (బాన్సువాడ): పాత కక్షల కారణంగా ఓ కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు హత్యకు గురయ్యాడు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్‌ మండలం నాచుపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గ్రామానికి చెందిన సాయికుమార్, సుధాకర్, భాస్కర్‌ తదితరులు కాంగ్రెస్‌ పార్టీకి చెందిన పాటలకు డ్యాన్స్‌ చేస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చెందిన పాటలే పెట్టాలంటూ అదే గ్రామానికి చెందిన కీసర రవి మరికొంత మంది అడ్డుతగలడంతో గొడవ ప్రారంభమైంది. దీంతో గ్రామ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు సాదుల రాములు ఇరుపక్షాలకు నచ్చజెప్పి పంపించేశారు. గొడవ సద్దుమణిగిన అనంతరం రవి, స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద రాములును అడ్డుకుని ఛాతీపై బలంగా గుద్ది, మందు బాటిల్‌తో కొట్టాడు. అంతటితో ఆగకుండా గోడకేసి బలంగా కొట్టడంతో రాములు అక్కడికక్కడే చనిపోయాడు. కాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన విషయాలను మనసులో ఉంచుకుని చలసాని సుధీర్‌ అనే వ్యక్తి ప్రోద్బలంతో కీసర రవి, కొంగల అనిల్, కొంగల వినోద్, కొంగల గోపాల్‌ తన భర్తను హత్యచేశారని మృతుడు రాములు భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, సోమవారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ప్రాంతాల కాంగ్రెస్‌ నాయకులు గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృత దేహం తీయమని ఆందోళన నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. డీఎస్పీ జగన్నాథరెడ్డి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

కొత్త ఏడాదిలో 'కమలం' కొత్త ఆశలు

- 10 ఎంపీ సీట్లు లక్ష్యంగా కార్యాచరణ
- గెలుపు గుర్రాల కోసం అన్వేషణ
- నలుగురు సిట్టింగ్‌లు మినహా, మిగతా స్థానాల్లో సర్వేల ఆధారంగానే టికెట్లు!



సాక్షి, హైదరాబాద్‌: నూతన సంవత్సరంలో రాజకీయంగా తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర బీజేపీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తోంది. కొత్త ఏడాది ప్రథమార్థంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్న జాతీయ నాయకత్వం అంచనాలతో రాష్ట్ర పార్టీలో ఉత్సాహం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఎదురైన నిరుత్సాహాన్ని అధిగమించి, లోక్‌సభ ఎన్నికల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే దిశలో ముందుకెళ్లాలని సంకల్పించింది. దక్షిణాదిలో కర్ణాటక తర్వాత పార్టీ విస్తరణకు అనువైన రాష్ట్రంగా తెలంగాణపై జాతీయ నాయకత్వం ఎన్నో ఆశలు పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని భావించింది. కానీ ఆశించిన స్థాయిలో సీట్లు గెలవకపోవడంపై పార్టీ శ్రేణులను ఒకింత నైరాశ్యం చుట్టుముట్టింది. దీంతో ప్రస్తుతం దీనిని దూరం చేసే ప్రయత్నాల్లో రాష్ట్ర నాయకత్వం నిమగ్నమైంది. రాష్ట్రంలో 35 శాతం ఓటింగ్‌తో పది ఎంపీ సీట్లలో గెలవాలంటూ అగ్రనేత అమిత్‌ షా నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా ముందడుగు వేస్తోంది.

టికెట్ల కోసం తీవ్రమైన పోటీ

నలుగురు సిట్టింగ్‌ ఎంపీలు జి.కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్‌), బండి సంజయ్‌ (కరీంనగర్‌), అర్వింద్‌ ధర్మపురి (నిజామాబాద్‌), సోయం బాపూరావు (ఆదిలాబాద్‌)లను మళ్లీ బరిలోకి దింపాలని జాతీయ నాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం. కాగా మిగతా 13 స్థానాల్లో టికెట్ల కోసం పార్టీ నాయకులు, తటస్థుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రతి సీటును ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఢిల్లీ పెద్దలు గెలుపు గుర్రాల అన్వేషణలో పకడ్బందీగా వ్యవహరించాలని భావిస్తున్నారు. ఒక్కో సీటుకు ముగ్గురు లేదా నలుగురు ఆశావహులతో జాబితాను పంపించాలని ఆదేశించినట్టు సమాచారం. దీంతో ఆశావహులంతా రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలను, ఢిల్లీ వెళ్లి జాతీయ పార్టీ ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే వివిధ స్థాయిల్లో నిర్వహించే సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఖరారు కసరత్తు జరుగుతుందని రాష్ట్ర నేతలకు అమిత్‌ షా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.



ఇక అన్ని స్కూళ్లలో 'ఫేషియల్‌ రికగ్నిషన్‌'

▶ మొదటి పేజీ తరువాయి

విద్యాశాఖ ఆలోచన. అయితే, ఈ విధానాన్ని దాదాపు ఏడాదికిందటే ప్రవేశపెట్టినప్పటికీ ఇప్పటి వరకూ 40 శాతం స్కూళ్లలో కూడా అమలు కావడం లేదు. ఇంత కాలం ఎన్నికల విధులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఉండటం వల్ల ఈ అంశాన్ని పట్టించుకోలేదు. ఇక నుంచి ఈ ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

తప్పుడు హాజరుకు చెక్‌

ఇప్పటివరకు ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయులు హాజరు తీసుకునే విధానం ఉండేది. ప్రతీ నెల చివరి తేదీలో తరగతుల వారీగా హెచ్‌ఎంలు విద్యార్థుల హాజరును రాష్ట్ర కార్యాలయానికి పంపేవాళ్లు. అయితే ఈ వివరాలకు విద్యార్థులకు అందించే భోజనం, దుస్తులు, పుస్తకాల లెక్కకు సరిపోవడం లేదని ఉన్నతాధికారులు అంటున్నారు. అలాగే పాఠశాల నిర్వహణ నిధులను కూడా కచ్చితంగా లెక్కగట్టలేకపోతున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి 30 లోపు ఉన్న స్కూలుకు రూ. 5 వేలు, 31కి మించి ఉన్న స్కూలుకు రూ. 10 వేల చొప్పున నిర్వహణ నిధులు ఇస్తున్నారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థుల హాజరును తప్పుగా చూపించి, నిధులు ఎక్కువ తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, హైదరాబాద్‌లోని చాలా స్కూళ్లలో ఫేషియల్‌ రికగ్నిషన్‌ హాజరును అసలు అమలు చేయడం లేదు. ఇందుకు పలు సాంకేతిక సమస్యలున్నాయని అంటున్నారు.

ముందు నెట్‌ ఇవ్వాలి

ఫేషియల్‌ రికగ్నిషన్‌ హాజరు అమలు విషయంలో అధికారులు సాంకేతిక ఇబ్బందులను పరిశీలించాలి. చాలా స్కూళ్లలో నెట్‌ సదుపాయం లేదు. ఈ హాజరు విధానం కోసం పక్క వాళ్ల నెట్‌ తీసుకోవడం రోజూ సాధ్యం కాదు. హెచ్‌ఎంల మొబైల్‌ నెట్‌ కొన్ని సార్లు పనిచేయడం లేదు. ఫేషియల్‌తో పాటు స్కూల్‌లో రికార్డు కోసం మాన్యువల్‌గా హాజరు తీసుకోవడం కూడా బోధన సమయానికి ఇబ్బందే. మొదటి పీరియడ్‌లో చాలా సమయం హాజరుకే పోయే అవకాశం ఉంది. దీనిపై క్షేత్రస్థాయి సమస్యలు పరిశీలించాలి. నెట్‌ సదుపాయం అందుబాటులోకి తేవాలి.

–పి.రాజాభాను చంద్రప్రకాశ్‌
(ప్రభుత్వ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)





ప్రతి రోజునూ నీకు నువ్వు ఇలా చెప్పుకొని ప్రారంభించు: నేను ఇవ్వాళ జోక్యం, కృతఘ్నత, అహంకారం, అవిశ్వాసం, దురుద్దేశం, స్వార్థాలను కలవబోతున్నాను – దోషికి మంచి, చెడుల ఎరుక లేకపోవడమే దీనంతటికీ కారణం.

– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 2 జనవరి 2024

సరికొత్త అధ్యాయం?!

మరో అడుగు ముందుకు పడింది. ఈశాన్య భారతంలో దీర్ఘకాలంగా సాగుతున్న సమస్యకు పరిష్కారం కనుక్కొనే ప్రయత్నంలో ఒక అభిలషణీయ పరిణామం గత వారం సంభవించింది. అస్సామ్‌లోని పేరుబడ్డ తీవ్రవాద సంస్థ 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సామ్' (అల్ఫా)లోని ఒక వర్గం హింసామార్గం విడిచిపెట్టి, ప్రజాస్వామ్య పంథాలోకి రానున్నట్టు డిసెంబర్ 29న ప్రకటించింది. అల్ఫా వర్గానికీ, కేంద్ర, అస్సామ్ సర్కార్లకూ మధ్య ఈ తాజా త్రైపాక్షిక పరిష్కార ఒప్పందం (ఎంఓఎస్) స్వాగతించాల్సిన విషయం. ఈశాన్యంలో శాంతి స్థాపన నిమిత్తం కుదుర్చుకుంటూ వచ్చిన ఒప్పందాల వరుసలో ఇది తాజాది. చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజనీ, దీంతో అస్సామ్‌లో హింసాకాండకు పూర్తిగా తెర పడుతుందనీ కేంద్ర హోమ్ మంత్రి అమితమైన ఆశాభావం ప్రకటించారు. అయితే, ఇప్పటి దాకా కుదుర్చుకున్న అనేక ఒప్పందాల ఫలితాలు మిశ్రమంగానే మిగిలాయి. అందుకే, ఈ కొత్త ఒప్పందం కూడా కేవలం మరో పత్రంగా మిగులుతుందా? లేక శాంతిసాధనలో చరిత్రాత్మకం కాగలుగుతుందా అన్నది పలువురి అనుమానం.

'సార్వభౌమాధికార' అస్సామ్‌ను కోరుతూ 1979లో 'అల్ఫా' సాయుధ పోరాటం ప్రారంభించింది. అలా 44 ఏళ్ళుగా రగులుతున్న కుంపటిని తాజా ఒప్పందం చల్లారుస్తుందని ఆశ. 1985లో అస్సామ్ ఒప్పందం తర్వాత కూడా అక్కడి గ్రామీణ ప్రజల్లో అసంతృప్తిని రగిలించడంలో అల్ఫా సఫలమైంది. కిడ్నాపింగ్‌లు, దోపిడీలు, హత్యలు, బాంబు పేలుళ్ళతో ఒక దశలో అల్ఫా అట్టుడికించింది. దాంతో, ప్రభుత్వం 1990లో అల్ఫాను నిషేధించింది. కర్కశమైన 'సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం' (ఏఎఫ్ఎస్‌పీఏ)ను తీసుకురావాల్సి వచ్చింది. 'అల్ఫా' ఉచ్చదశలో వెలిగిపోతున్న రోజుల్లో దాని చేతులు అస్సామ్ మొదలు దక్షిణాసియా దాకా విస్తరించాయి. మయన్మార్, భూటాన్‌లలో అల్ఫా శిబిరాలు, బంగ్లాదేశ్‌లో ఆ సంస్థ నేతలు, శ్రీలంక- పాకిస్తాన్‌లలో శిక్షకులున్న రోజులవి. అయితే, పరిస్థితులు మారాయి. శ్రీలంకలో ఎల్టీటీఈ పతనం, భూటాన్ గడ్డపై శిబిరాల్ని మూయించాల్సిందిగా ఆ దేశంపై ఒత్తిడి రావడం, అలాగే భారత్‌తో మైత్రి పాటించే షేక్ హసీనా ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక శక్తులను సహించక పోవడం, అల్ఫాలోని వర్గపోరు, భారత సర్కార్ ఉక్కుపాదం మోపడం... ఇవన్నీ కొన్నేళ్ళుగా అల్ఫాను బలహీనపరిచాయి.

వలస కార్మికులనూ, సామాన్య నిరుపేదలనూ లక్ష్యంగా చేసుకొని సాగించిన హింస సైతం రైతాంగంలో అల్ఫా పలుకుబడిని పలుచన చేసింది. నిజానికి, గతంలో పలు సందర్భాల్లో అల్ఫాతో శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఆ మాటకొస్తే శాంతిప్రక్రియ 2009లోనే మొదలైంది. చర్చల అనుకూల వర్గంతో 2011లోనే సంప్రతింపులు ఆరంభమయ్యాయి. సంస్థ బలహీనమయ్యేసరికి సార్వభౌమాధికార డిమాండ్‌ను అల్ఫా పక్కనబెట్టక తప్పలేదు. స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణ చాలనే విధంగా వ్యవహరించి, గౌరవప్రదంగా బయటపడేందుకు ప్రయత్నించింది. వెరసి, పుష్కర కాలం తర్వాత చర్చలు ఫలించాయి. పరిష్కార ఒప్పందం కుదిరింది. అయితే, అల్ఫా సంస్థాపకుల్లో ఒకరైన అప్పటి 'కమాండర్-ఇన్-ఛీఫ్' పరేశ్ బారువా శాంతి చర్చలను వ్యతిరేకిస్తూ 2012లోనే 'అల్ఫా ఇండిపెండెంట్' (అల్ఫా-ఐ)గా వేరుకుంపటి పెట్టుకున్నారు. అరబింద రాజ్‌ఖోవా సారథ్యంలోని వర్గమే తప్ప సైద్ధాంతికంగా కరడుగట్టిన ఈ 'అల్ఫా-ఐ' వర్గం ఒప్పందంలో భాగం కాలేదు.

అది ఒక లోటే. అలాగని, కుదిరిన ఒప్పందాన్ని తీసిపారేయలేం. వేర్పాటువాదం ప్రబలడంతో ఒకప్పుడు గణనీయంగా నష్టపోయిన రాష్ట్రం తాజా ఒప్పందంతో మళ్ళీ అభివృద్ధి పథంలో పయనించ గలుగుతుంది. కేంద్ర ఆర్థిక సహాయంతో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతమవుతాయి. ఈ ఒప్పందం పుణ్యమా అని ఈ ఈశాన్య రాష్ట్రంలో సాంఘిక – సాంస్కృతిక అశాంతికి కూడా తెరపడుతుందని మరో ఆశ. ఎందుకంటే, అక్రమ వలసల మొదలు స్థానిక తెగల వారికి భూ హక్కుల వరకు పలు అంశాల పరిష్కారం గురించి తాజా త్రైపాక్షిక ఒప్పందం ప్రస్తావిస్తోంది. ఆ ఆశ నెరవేరితే అంతకన్నా కావాల్సింది లేదు. నిజానికి, అస్సామ్‌లో చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలకై 'ఏఎఫ్ఎస్‌పీఏ' కింద సాయుధ బలగాలకు అపరిమితమైన అధికారాలను ప్రభుత్వం ఎన్నడో కట్టబెట్టింది. అల్ఫా దూకుడు మునుపటితో పోలిస్తే తగ్గడం, అలాగే అనేక విమర్శల అనంతరం గత రెండేళ్ళలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆ చట్టాన్ని ఉపసంహరించారు. ఇప్పుడిక మిగతా ప్రాంతాల్లో సైతం ఈ అమానవీయ చట్టాన్ని ఎత్తివేసే దిశగా అస్సామ్ సర్కార్ అడుగులు వేయాలి.

తాజా ఒప్పందంతో తీవ్రవాదానికి పూర్తిగా తెర పడిందని తొందరపడడానికి లేదు. అతివాద 'అల్ఫా-ఐ' వర్గం నేత బారువా ఇప్పటికీ చైనా-మయన్మార్ సరిహద్దులో గుర్తుతెలియని చోట దాగున్నారు. కొన్నేళ్ళుగా కొత్త చేరికలు లేక ఆయన వర్గం గణనీయంగా బలహీనపడినప్పటికీ, ఆ వర్గపు వ్యవహారం ఇంకా తేలనందున కేంద్ర, అస్సామ్ ప్రభుత్వాలు ఆచితూచి అడుగేయాల్సి ఉంది. కాకపోతే... ఒకపక్క రష్యా – ఉక్రెయిన్‌లు, మరోపక్క గాజాలో ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య యుద్ధాలతో రోజూ వార్తలను వేడెక్కించిన గడచిన 2023 ఎట్టకేలకు ఒక శాంతి ఒప్పందంతో ముగియడం ఒకింత ఊరట. ఒప్పందాన్ని సఫలం చేయడం ప్రభుత్వ, అల్ఫా వర్గాల ముందున్న సవాలు. అల్ఫా మాట అటుంచి, దీర్ఘకాల వేర్పాటువాదం అనంతరం ఈశాన్యంలో సుస్థిరంగా శాంతి వెల్లివిరియాలంటే ప్రభుత్వం ముందుగా అక్కడి ప్రతి పౌరుడూ జనజీవన స్రవంతిలో భాగమయ్యేలా చూడాలి. రైతాంగ జీవనప్రమాణాల్ని మెరుగుపరచాలి. వేర్పాటువాదం వైపు ఆకర్షితులు కాకుండా జాగ్రత్త పడాలి. అందుకీ ఒప్పందం దోహదపడితేనే ఇన్నేళ్ళ సంప్రతింపుల శ్రమకు అర్థం, పరమార్థం!

సైన్సులో మన ఘన విజయాలు

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

చంద్రయాన్–3 విజయవంతం కావడం శాస్త్రరంగంలో భారత్ 2023లో సాధించిన అతిగొప్ప విజయం. ఏళ్లపాటు శ్రమించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల విజయమిది. చంద్రయాన్ సక్సెస్ తరువాత కొంత కాలానికే భారతదేశపు ప్రతిష్ఠాత్మక ఆదిత్య–ఎల్1 ప్రయోగం కూడా విజయవంతంగా ముగియడం హైలైట్లలో మరొకటి. 'లిగో ఇండియా' ప్రాజెక్టుకు మన దేశం అంగీకరించడం ఒక మేలి మలుపు. మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో లిగో ఇండియా నిర్మాణం ప్రారంభమైంది. నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు కూడా 2023లోనే శ్రీకారం పడింది. అయితే, సైన్స్ రంగంలో ఇచ్చే పలు అవార్డులను రద్దు చేయడం, జీవ పరిణామ క్రమాన్ని వివరించే పాఠాలను పుస్తకాల్లోంచి తొలగించడం ఆందోళన రేకెత్తించిన కొన్ని ప్రభుత్వ నిర్ణయాలు.

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్‌లను జాబిల్లి పైకి మోసుకెళ్లిన అపోలో–11 లూనార్ మాడ్యూల్‌లో బ్లాక్ అండ్ వైట్ టీవీ కెమెరా ఉండేది. ఆ ఇద్దరు వ్యోమగాములు చందమామపై మొదటిసారి అడుగుపెట్టిన చారిత్రక ఘట్టపు లైవ్ ప్రసారం ఈ కెమెరా ద్వారానే జరిగింది. అప్పట్లో ఈ ప్రసారాన్ని 53 కోట్ల మంది వీక్షించారు. అంతరిక్ష పరిశోధనల్లో 1969 జూలై 20 నాటి ఈ ఘటన అత్యంత కీలకమైందనడంలో సందేహం లేదు. అలాగే టెలివిజన్ ప్రసారాల్లోనూ ఓ మైలురాయిగా నిలిచింది. యాభై ఏళ్ల తరువాత 2023 ఆగస్టు 23న కూడా దాదాపు ఇలాంటి చారిత్రక ఘటనే భారత్ లోనూ నమోదైంది. చంద్రయాన్–3 జాబిల్లిపై అడుగుపెట్టిన ఘట్టాన్ని యూట్యూబ్‌లోనే 80.9 లక్షల మంది వీక్షించారు. యూట్యూబ్ లైవ్ స్ట్రీమ్‌కు సంబంధించి ఇదో రికార్డు.

చంద్రయాన్–3 విజయవంతం కావడం శాస్త్రరంగంలో భారత్ 2023లో సాధించిన అతిగొప్ప విజయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏళ్లపాటు శ్రమించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల విజయమిది. చంద్రయాన్ ప్రయోగం సక్సెస్ తరువాత కొంత కాలానికే భారతదేశపు ప్రతిష్ఠాత్మక ఆదిత్య–ఎల్1 ప్రయోగం కూడా విజయవంతంగా ముగియడం హైలైట్లలో మరొకటిగా చెప్పుకోవచ్చు. కొత్త సంవత్సరం తొలివారంలో ఈ అంతరిక్ష నౌక సూర్యుడిని పరిశీలించేందుకు అనువైన స్థానానికి చేరుకోనుంది. ఈ రెండు ప్రయోగాలు మాత్రమే కాకుండా 2023లో 'ఇస్రో' ఖాతాలో పలు కీలకమైన ప్రాజెక్టులను అమలు చేసిన ఖ్యాతి చేరింది. రీయూజబుల్ లాంచ్ వెహికల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించడం, రెండోతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో తొలి ప్రయోగం, మానవ సహిత ప్రాజెక్టు 'గగన్‌యాన్'లో క్రూ ఎస్కేప్ మోడల్ పరీక్ష ఈ జాబితాలో కొన్ని మాత్రమే.

అంతరిక్ష ప్రయోగాలకు ఆవల...

దేశం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో అంతరిక్ష ప్రయోగాలకు ఆవల కూడా మన దేశం పలు విజయాలను నమోదు చేసింది. లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ (లిగో ఇండియా)కి ప్రభుత్వం అంగీకరించడం ఒక మేలి మలుపు. మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో లిగో ఇండియా ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైంది. ప్రపంచంలోనే అరుదైన గురుత్వ తరంగాల వేధశాలగా, అతి సున్నితమైన నాలుగు కిలోమీటర్ల పొడవైన ఇంటర్‌ఫెరోమీటర్ సొరంగం ఉన్నదిగా ఇది రికార్డులకు ఎక్కింది. కృష్ణ బిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల వంటివి కలిసిపోయినప్పుడు పుట్టే గురుత్వ తరంగాలను గుర్తించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అమెరికాలో ఇప్పటికే పని చేస్తున్న లిగో వేధశాలలతో కలిసి హింగోలి వేధశాల పనిచేస్తుంది.

నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు కూడా 2023లోనే అడుగు పడింది. సూపర్ కండక్టింగ్, ఫొటోనిక్ ప్లాట్‌ఫామ్‌ల సాయంతో మధ్యమ స్థాయి క్వాంటమ్ కంప్యూటర్లు తయారు చేయడం ఈ ప్రాజెక్టు



ఉద్దేశం. దీంతోపాటే కృత్రిమ మేధ ద్వారా దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను గుర్తించేందుకు కూడా జాతీయ స్థాయి కార్యక్రమం ఒకటి ఈ ఏడాది మొదలైంది. కృత్రిమ మేధను బాధ్యతాయుతమైన టెక్నాలజీగా అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

పరిశోధనల్లోనూ ఉన్నత స్థితిలో...

భారతదేశంలో ప్రచార ఆర్భాటాలకు చిక్కని, అత్యుత్తమ, అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు ఎన్నో నమోదయ్యాయి. వీటిల్లో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి హైదరాబాద్‌లోని లాకోన్స్‌లో ఒక పర్యావరణ వ్యవస్థలో జీవవైవిధ్యతను గుర్తించేందుకు అభివృద్ధి చేసిన పద్ధతి. సీసీఎంబీ అనుబంధ సంస్థ అయిన లాకోన్స్‌లో ఎస్. మను, జి.ఉమాపతి ఈ పరిశోధనకు నేతృత్వం వహించారు. నీరు, మట్టి, గాలుల్లోని డీఎన్ఏ పోగుల ఆధారంగా జీవవైవిధ్యతను కొలవడం ఈ పద్ధతి ప్రత్యేకత.

కర్నాల్(హరియాణా)లోని నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు దేశీ గిర్ జాతి ఆవును క్లోనింగ్ పద్ధతి ద్వారా సృష్టించడం 2023 విశేషాల్లో ఇంకోటి. బనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన జ్ఞానేశ్వర్ చౌబే నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం దక్షిణాసియా జన్యుక్రమాల్లో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. సింహళీయులకు, శ్రీలంకలోని తమిళులకు మధ్య దగ్గరి జన్యు సంబంధాలు ఉన్నట్లు పరిశోధన పూర్వకంగా నిర్ధారించింది. ఆసక్తికరమైన ఇంకో విషయం ఏమిటంటే, ఈ రెండు వర్గాల ప్రజలకూ మరాఠా జనాభాకూ మధ్య సంబంధాలు ఉండటం! కోవిడ్ విషయానికి వస్తే, పుణె కేంద్రంగా పనిచేస్తున్న జెన్నోవా బయో ఫార్మాస్యూటికల్స్ దేశీయంగా తయారు చేసిన ఎంఆర్ఎన్ఏ టీకాను విడుదల చేసింది. ఒమిక్రాన్ వైరస్ నియంత్రణకు పనికొస్తుందీ టీకా.

విధాన నిర్ణయాలను పరిశీలిస్తే...

దేశం మొత్తమ్మీద శాస్త్ర పరిశోధనలకు అవసరమై నిధుల కేటాయింపును పర్యవేక్షించేందుకు 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' ఒకదాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. వివరాలు పూర్తిగా బహిరంగం కాలేదు. ఇదిలా ఉంటే దశాబ్దాలుగా పనిచేస్తున్న విజ్ఞాన్ ప్రసార్‌ను 2023లో మూసివేశారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐఎస్‌సీఏ)కు నిధుల కేటాయింపులు తగ్గించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే ఏటా జాతీయ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరుగుతాయి. సైన్స్ రంగంలో ఇచ్చే పలు అవార్డులను రద్దు చేయడం, జీవ పరిణామ క్రమాన్ని వివరించే పాఠాలను పుస్తకాల్లోంచి తొలగించడం ఆందోళన రేకెత్తించిన కొన్ని ప్రభుత్వ నిర్ణయాలు.

కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ తన మద్దతు ఉపసంహరించుకోవడంతో జనవరిలో సైన్స్ కాంగ్రెస్ జరిగే అవకాశాలు లేవు. డీఎస్‌టీ తమ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా వ్యవహరించిందని ఐఎస్‌సీఏ ఆరోపిస్తోంది. సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను లక్నోలో కాకుండా జలంధర్ సమీపంలోని ఫగ్వారాలో నిర్వహించాలన్న ఐఎస్‌సీఏ నిర్ణయం డీఎస్‌టీకి రుచించలేదు. 2023లో సైన్స్ కాంగ్రెస్‌ను నాగ్‌పూర్‌లో నిర్వహించారు. మరోవైపు పలు శాస్త్ర సంబంధిత విభాగాలు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ విజ్ఞాన్ భారతి ప్రాయోజకత్వం వహిస్తున్న వార్షిక్ సైన్స్ ఫెస్టివల్‌కు పెద్ద ఎత్తున ఆర్థిక సహకారం అందిస్తూండటం గమనార్హం.

దురదృష్టవశాత్తూ చాలా సంస్థలు రాజకీయ పెద్దల అడుగులకు మడుగులొత్తే స్థితికి చేరిపోయాయి. లక్నోలోని నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 108 రేకులున్న కమలాన్ని అభివృద్ధి చేసి దానికి 'నమో 108' అని నామకరణం చేసింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖల మంత్రి జితేంద్ర సింగ్ 'నమో 108'ను ఆవిష్కరిస్తూ 'మతపరంగా కమలానికి, 108 సంఖ్యకు ఉన్న ప్రాముఖ్యతలను దృష్టిలో ఉంచుకుంటే ఈ కొత్త రకం కమలం చాలా ప్రత్యేకమైన గుర్తింపుని ఇస్తుంది' అని వ్యాఖ్యానించారు. 'నిరంతర కృషీవలుడు నరేంద్ర మోదీ అంతః సౌందర్యానికి ఈ కమలం ఓ గొప్ప బహుమానం' అని కూడా అన్నారు.

ఇంకో సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థ నికోటిన్ మోతాదు తక్కువగా ఉన్న పొగాకు వంగడాన్ని అభివృద్ధి చేసింది. ఈ వంగడం అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తి అని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ ఎన్.కళైసెల్వి వ్యాఖ్యానించారు. ఇంకో పక్క ఎన్సీఈఆర్టీ చంద్రయాన్ ప్రయోగ కీర్తి ప్రధానికి దక్కుతుందని పొగడటం ప్రస్తావనార్హం.

ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ వంటి స్వతంత్ర సంస్థలు ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనూ నిశ్శబ్దంగా ఉండటం ఆశ్చర్య పరుస్తోంది. 2023లో భారతదేశం సాధించిన అతి గొప్ప విజయం చంద్రయాన్ అనుకుంటే... సైన్స్ సంస్థల రాజకీయాకరణ అత్యంత దురదృష్టకరమైనదిగా చెప్పాలి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రారంభ ప్రార్థన



ఎక్కుపెట్టిన ఆయుధాలు దించాలి. ద్వేషం నశించాలి. ఏ చిన్నారీ ఆకలితో నిద్రపోవద్దు. జ్ఞానాన్ని సంకెళ్లలో బంధించొద్దు. జైళ్లు ఖాళీగా ఉండాలి. చీకటి లోంచి న్యాయం, శాంతి, ఆశ, దయ, ప్రేమ దిశగా పయనించే తోవను ప్రపంచం ఈ కొత్త సంవత్సరం కనుక్కోవాలి.

– హర్ష్ మందర్, యాక్టివిస్ట్

కొత్త ప్రపంచం



వాహనాన్ని ఢీకొట్టి పారిపోతే (హిట్ అండ్ రన్) పదేళ్ల జైలుశిక్ష, ఏడు లక్షల జరిమానా విధించే ఏర్పాటు కొత్త నేర న్యాయ చట్టంలో ఉండటం కమర్షియల్ డ్రైవర్లను భయపెడుతోంది. ఇలాగైతే ఎవరూ రిస్క్ తీసుకోరు. ఇంకోలా చూస్తే, కొన్నేళ్లలో డ్రైవర్‌లెస్ వాహనాలు ఈ ఖాళీని పూరించవచ్చు.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

అలాంటి రోజులు...

35 ఏళ్ల క్రితం, ఈ రోజున (1989 జనవరి 1) తన 'హల్లా బోల్' నాటక (గొంతు ఎత్తండి) ప్రదర్శన జరుగుతూ ఉండగా కమ్యూనిస్టు రచయిత, 34 ఏళ్ల సఫ్దర్ హష్మీ మీద కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు (హష్మీ తెల్లారి చనిపోయారు). నిందితుడు, కాంగ్రెస్ నేత హెచ్‌కెఎల్ భగత్ తొలి వరుసలో కూర్చున్నప్పుడు 'ఐఎఫ్ఎఫ్ఐ' (అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం) వేదిక మీద షబానా ఆజ్మీ తన నిరసన తెలియజేశారు. అప్పట్లో బాలీవుడ్‌కు వెన్నె ముక ఉండేది.

– సిద్ధార్థ్, వ్యాఖ్యాత

అంతా పాతే!



పోయినేడాది కొత్త సంవత్సరం కూడా అంతకు ముందు ఏడాదిలాగే ఉందని మీకు గుర్తుంటే, ఈ కొత్త సంవత్సరం కూడా పోయినేడాదిలాగే ఉంటుందని మీకు అర్థమవుతుంది. హేపీ ఓల్డ్ ఇయర్.

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

తొలి గర్వం



1804లో ఈ రోజున (జనవరి 1) ఫ్రాన్స్ నుంచి హైతీ స్వాతంత్ర్యాన్ని పొంది, ప్రపంచంలో మొదటి ఆఫ్రికన్ రిపబ్లిక్‌గా అవతరించింది.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

ఇన్ బాక్స్

ఆదర్శ విప్లవ చైతన్య మూర్తి

తాడిత పీడిత ప్రజల సంక్షేమం కోసం, సమాజ మార్పు కోసం వారిని చైతన్య పరచడానికి జీవితాంతం కృషిచేసిన ఆదర్శ విప్లవ చైతన్యమూర్తి, సావిత్రీబాయి పూలే. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి భారతదేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా స్త్రీ విద్యను ప్రవేశపెట్టిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు. సావిత్రీబాయి పూలే దక్షిణ మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని 'నయాగావ్' అనే ఓ చిన్న పల్లెటూరులో 1831 జనవరి 3న జన్మించారు. తొమ్మిదేళ్ల సావిత్రీబాయికీ, పదమూడేళ్ల జ్యోతిబా పూలేతో 1840లో వివాహం జరిగింది.

విద్యను అభ్యసించడానికి, తద్వారా నూతన జీవితాన్ని నిర్మించుకోవడానికి ప్రతి స్త్రీ పురుషులకు బాలలందరికీ హక్కు ఉన్నదనీ, ఆ హక్కు సహజమైనదనీ విశ్వసించిన తన భర్త జ్యోతిబాపూలేతో ఏకీభవించి ముందు భర్త దగ్గరే చదువుకొంది. ఆ తర్వాత ఆయనతో కలిసి స్త్రీవిద్యా వ్యాప్తి కోసం, ఇతర సాంఘిక సంస్కరణల కోసం తీవ్రంగా కృషి చేశారు. మొదటి బాలికా పాఠశాలను 1848 లో పూణేలో ఒక భవంతిలో ప్రారంభించారు ఈ దంపతులు. 1851 సెప్టెంబర్ 18న పూణేలోని రాస్తాపేటలో అమ్మాయిల కోసం మరొక పాఠశాలను ప్రారంభించారు. సావిత్రీబాయి పాఠాలు చెప్పేందుకు స్కూల్‌కి వెళుతున్న దారిలో సంప్ర దాయవాదులు ఆమెపై పేడ, రాళ్లు విసరడం వంటి అవమానాలకు గురి చేయగా, 'ఇవి నాకు పూలతో సమానం, ఇలా ప్రోత్సాహం ఇస్తున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంద'ని ప్రతిస్పందించారు. ఇలా అవమానాలు ఎదుర్కొంటున్న తరుణంలోనే పూలే దంపతులు ఇంటినుంచి బహిష్కృతులయ్యారు. అయినా తమ మార్గాన్ని వదులుకోలేదు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడం, స్త్రీలకోసం ఆశ్రమాలను స్థాపించడం, విద్యాలయాలు స్థాపించడం మానలేదు. ఓ వితంతు కుమారుని దత్తత తీసుకొని పెంచుకొన్నారు.

1876–77లో మహారాష్ట్రలో అతి భయంకరమైన కరువు వచ్చినప్పుడు తమ 'సత్యశోధక్ సమాజ్' ద్వారా అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేసి అన్నార్తులను ఆదుకున్నారు. సావిత్రీబాయి సమకాలీన సమస్యలు, విద్య, సాంఘిక సంస్కరణ వంటి వాటిపై ఆరు పుస్తకాలు రాశారు. వందలాది ఉపన్యాసాలు ఇచ్చారు. ప్లేగు వ్యాధి గ్రస్తులకు సేవ చేస్తూ అదే వ్యాధి సోకి 1897 మార్చి పదో తేదీన 66 సంవత్సరాల వయసులో తుది శ్వాస విడిచారామె. ఆమె సేవలు చిరస్మరణీయం.

– తండ సదానందం, ఉపాధ్యాయుడు

సాంకేతిక పటిష్ఠతే శాశ్వత పరిష్కారం

అభిప్రాయం



డా॥ దబ్బ్యూ. రామపుల్లా రెడ్డి

భూ పరిపాలన, భూ దస్త్రాల నిర్వహణ ప్రక్రియలో అక్రమాలకి ఆస్కారంలేని పారదర్శక వ్యవస్థ అంటూ మూడేళ్ల క్రితం నాటి సర్కార్ తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ సమస్యలకు నిలయంగా మారింది. అరగంటలో భూముల రిజిస్ట్రేషన్ మ్యుటేషన్, వారం రోజుల్లో పాసుపుస్తకం పంపిణీ అన్న ప్రకటనలు... కార్యరూపం దాల్చకపోవడంతో పౌరులకు కష్టాలు తప్పడం లేదు. 'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందం'గా ధరణి పోర్టల్ తయారైంది. పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. పోర్టల్ తెరుచుకోక, అన్ని రకాల ఆప్షన్లు అందుబాటులోకి రాక, పేర్లు మారక, రికార్డుల మార్పులు చేర్పులు జరగక బాధితులు... 'మీసేవ', తహశీల్దార్, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సి వస్తోంది. మరోవైపు వెబ్‌సైట్ నిర్వహణ బాధ్యత ప్రైవేటు సంస్థలకి అప్పగించడం వల్ల ప్రభుత్వ, పౌరుల సమాచార భద్రతకి భరోసా లేకుండా పోయింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్... తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ధరణి పోర్టల్‌ను సంస్కరించి సంక్షేమ పథకాల లబ్ధిదారుల వెతలు తీర్చేలా చర్యలు చేపట్టాలి.

రెవెన్యూ పరిపాలన, భూ రికార్డుల నిర్వహణ సేవలను పారదర్శకంగా, శీఘ్రంగా అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 'భూ హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టం -2020' అమల్లోకి తెచ్చింది. భూ సంస్కరణల చరిత్రలో విప్లవాత్మక సాంకేతిక సేవల కోసం ధరణి పోర్టల్‌ను ప్రారంభించింది. దేశంలోనే ప్రప్రథమంగా... ప్రతి భూమిని పోర్టల్‌లో పొందుపరిచి, దస్తావేజుల రాతకోతలతో పనిలేని సేవలను అందుబాటులోకి తెచ్చింది.

పూర్తి పారదర్శకత, స్పష్టత, సరళత్వంతో ప్రజలు తమంతట తామే భూముల రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చంటూ ఆనాడు ధరణి ప్రారంభవేళ నాటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. అనుకున్నరీతిలో ధరణి పని చేసి ఉంటే ప్రజలకి ఇప్పుడు ఇన్ని తిప్పలు ఉండేవి కావు. చిన్నపనులకు సైతం రైతులు, ప్రజలు కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పేవి. ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పోర్టల్‌లోని సమాచార భద్రతను గాలిలో దీపం చేయడమే కాకుండా మూడేళ్లుగా సాంకేతిక సమస్యల పరిష్కారంలో నిమ్మకునీరెత్తిన తీరుతో రెవెన్యూ సేవల విషయంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. పాసుపుస్తకం ఒకరి పేరుమీద ఉంటే పోర్టల్‌లో మరో పేరు ఉండటం, వాస్తవ భూమికంటే ఎక్కువ – తక్కువలు ఉండటం, కుటుంబ పెద్ద చనిపోతే వారసుల పేరుమీద మారకపోవడం, యజమానుల పేర్లు, సర్వే నంబర్లలో తప్పులు నమోదు కావడం లాంటి అనేక తప్పులతో ధరణి... సమస్యల వలయంగా మారింది.



గత ప్రభుత్వం రెవెన్యూ సంస్కరణల పేరిట... వీఆర్ఓ వ్యవస్థను రద్దు చేసింది. వీఆర్ఏలను ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసింది. ఆర్డీఓలని నామమాత్రం చేసి తహశీల్దార్లకు రిజిస్ట్రార్ బాధ్యతలను కట్టబెట్టింది. భూ వ్యవహారాలపై అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించింది. అయితే ఈ మొత్తం ప్రక్రియలో పారదర్శకత లోపించి... అవకతవకలకు మార్గం ఏర్పడింది. ప్రజా ప్రతినిధులు–అధికారులు కుమ్మక్కై... భూ రికార్డులు, యాజమాన్య హక్కులు ఇష్టారీతిలో మార్చారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో వేలకోట్ల ప్రభుత్వ, దేవాదాయ భూముల్ని అప్పనంగా కట్టబెట్టారన్న విమర్శలు ఉన్నాయి. సమాచార ప్రసార సాంకేతికత- ఐటీ సహకారంతో... భూరికార్డులను లోపాలకి తావు లేకుండా శక్తిమంతంగా అనేక రాష్ట్రాలు నిర్వహిస్తున్నాయి. ఈ విషయంలో జాతీయ విజ్ఞాన సంస్థ ఎన్ఐసీ... పలు రాష్ట్రాలకు సాంకేతిక సహకారం అందిస్తోంది. ఇలాంటి సంస్థలను కాదని సమాచారం ఎక్కడ నిక్షిప్తం చేస్తారో తెలియని, సర్వర్లు విఫలమైతే సమాచార భద్రత ఎలా అన్న ప్రశ్నలకు సమాధానాలు లేకుండా ప్రైవేటు ఏజెన్సీలకు పోర్టల్ బాధ్యత ఇచ్చేశారు.

ధరణి ద్వారా భూ రికార్డులను దాదాపుగా ప్రక్షాళన చేశామని గత ప్రభుత్వం చెప్పినా... వాస్తవంగా చూస్తే 50 శాతం కూడా పరిష్కారం కాలేదు. పహణీల ఆధారంగా కొనుగోలు చేసినా మ్యుటేషన్ కావడం లేదు. దశాబ్దాలుగా భూమి అనుభవంలో ఉన్నా... పట్టాదారు పాసుపుస్తకాలు రాక కొందరు, డబుల్ సర్వే నంబర్లతో మరి కొందరు, ఏజెన్సీ ప్రాంతాల్లో రికార్డుల సవరణ ఇబ్బందులతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, భాగ పంపకాల పరిష్కారాలు, విరాసత్ చేసుకున్న రైతులకి పాసు పుస్తకాలు రావడం లేదు. గుర్తింపు పత్రాలు, పాసు బుక్‌లు లేక ఎంతోమంది లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలకి నోచుకోవడం లేదు. ఈ సమస్యలన్నింటికీ మూలం దస్త్రాల్లో ఉన్న వివరాలను కంప్యూటర్లకు ఎక్కించేటప్పుడు పొరపాట్లు జరగడమే.

ధరణి లోపాలను సవరించి దాని స్థానంలో 'భూమాత' అందుబాటులోకి తెస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్ ఆదిశగా చర్యలు వేగిరం చేయాలి. అస్తవ్యస్తంగా మారిన రెవెన్యూ శాఖను ప్రక్షాళించి... ధరణిని దుర్భిణిగా మార్చడానికి గ్రామస్థాయి నుంచి పై వరకు సమర్థంగా పాలించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ధరణిలో ఇప్పటివరకు జరిపిన లావాదేవీలు అన్నింటిపై నిపుణుల కమిటీతో సమీక్ష చేయించాలి. ధరణి అన్ని విధాలుగా దుర్భేద్యమని చాటడానికి ఆడిటింగ్ చేయించాలి. పోర్టల్ నిర్వహణ, వినియోగంపై రెవెన్యూ సిబ్బందికి... విస్తృతమైన శిక్షణ అందించి ఫిర్యాదుల పరిష్కారానికి సమయం నిర్దేశించాలి. ఇవన్నీ అమలు చేసిన నాడు భూ రికార్డుల పాలన సమర్థవంతంగా, పారదర్శకంగా మారి రాష్ట్ర ప్రగతికి దోహదపడుతుంది.

వ్యాసరకర్త విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఎన్ఐఆర్‌డీపీఆర్ పూర్వ డీజీ

యశోధర తత్త్వం

జ్ఞానం పొందిన తర్వాత ఒక రోజు బుద్ధుడు తన ఇంటికి వెళ్లాడు. బుద్ధుడిని చూడగానే ఆయన భార్య యశోధర 'నన్ను విడిచిపెట్టి వెళ్ళారు. నేనేమీ అనుకోవడం లేదు. కానీ నాతో ఒక్క మాట చెప్పి వెళ్ళి ఉండొచ్చు కదా. నేను మిమ్మల్ని అడ్డుకునే దాన్ని కాదు. మీ ఇష్టం మీది. కానీ మీరు నన్ను నమ్మలేదు. అది తలచుకుంటుంటేనే నాకు బాధగా ఉంది. ఇంత కాలమూ ఆ తలంపే నన్ను ఇబ్బందిపెడుతోంది. నన్ను నమ్మక ఎందుకు గాయపరిచారో బోధ పడటం లేదని ఆమె వాపోయింది.



జ్యోతిర్మయం

భార్య చెప్పిన మాటలన్నీ విన్న బుద్ధుడు తనను క్షమించమని అడిగి ఇలా అన్నాడు... 'నేను నీకోసం భయ పడలేదు. నాకు నేనే భయ పడ్డాను. భయమంతా నన్ను నేను చూసుకొనే! భార్య, కొడుకు ముఖాలు చూసి నేను నా నిర్ణయాన్ని మార్చుకుని ఇక్కడే ఉండిపోతానేమోనని భయపడ్డాను. ఏమీ చేయలేని స్థితికొస్తానేమోనని అనుకున్నాను' అన్నాడు బుద్ధుడు. అనంతరం ఆయన భార్య 'మీరు ఈ భవంతిని విడిచిపెట్టి వెళ్ళకుండా ఇక్కడే ఉండి ఉంటే మీరు జ్ఞానం పొంది ఉండే వారు కాదా?' అని ప్రశ్నించింది.

'ఇక్కడున్నా నాకు జ్ఞానోదయమయ్యేదే. కానీ ఇక్కడి నుంచి చడీచప్పుడు చేయకుండా పోతున్నప్పుడు అలా ఆలోచించలేదు. నిజానికి నేను ఎక్కడ ఉండి ఉన్నా జ్ఞానోదయం కలిగేదే. అందులో అనుమానం లేదు. చోటు అనేది ఒక ముఖ్యమైన అంశమే కాదు' అన్నాడు.

సిద్ధార్థుడు (బుద్ధుడు) ఇంటిని వదిలి వెళ్లిపోయిన తర్వాత యశోధర సర్వ సంపదలూ ఉన్నా సాధారణ జీవి తమే గడిపేది. సాదాసీదా బట్టలు ధరించేది. ఒక్కగానొక్క బిడ్డ 'నాన్న ఎక్కడ' అని అడిగినప్పుడల్లా ఆమె ఆలోచనలో పడేది. తండ్రి లేడన్న విషయాన్ని పక్కన పెట్టి ఎంతో జాగ్రత్తగా పెంచుకుంటూ వచ్చింది. అన్నింటినీ విడిచిపెట్టి సాధువయ్యాడు బుద్ధుడు. కానీ యశోధర అన్ని భోగ భాగ్యాలు తన చుట్టూ ఊరిస్తున్నా ఓ సన్యాసిలా బతికింది. అందుకే యశోధర జీవితమే ఆదర్శవంతం అని కొందరంటారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.షష్ఠి ప.2.31 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: పుబ్బ ఉ.9.56 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: సా.5.56 నుండి 7.40 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.32 వరకు తదుపరి రా.10.47 నుండి 11.35 వరకు, అమృతఘడియలు: తె.4.31 నుండి 6.18 వరకు (తెల్లవారితే బుధవారం): రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.33.

బైరి నరేశ్‌ను అరెస్ట్ చేయాలి

- అయ్యప్ప భక్తుల డిమాండ్.. రాస్తారోకో
- అంతకుముందు నరేశ్‌తో వాగ్వాదం
- నరేశ్ వాహనం ఢీకొనడంతో విరిగిన ఓ భక్తుడి కాలు



బైరి నరేశ్ ప్రసంగాన్ని అడ్డుకుంటున్న భక్తులు

ఏటూరునాగారం: గతంలో అయ్యప్పస్వామి జన్మర హస్యంపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న బైరి నరేశ్‌కు, అయ్యప్ప భక్తులకు మధ్య తాజాగా వాగ్వాదం చోటు చేసుకుంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం బీఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు బైరి నరేశ్ హాజరయ్యాడన్న విషయం తెలుసుకున్న అయ్యప్ప భక్తులు అక్కడికి చేరుకుని నరేశ్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించగా ఇరు పక్షాలమధ్య వాగ్వాదం జరిగింది. నరేశ్.. అయ్యప్ప భక్తులపై విరుచుకుపడటంతో పాటు అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ హెచ్చరించాడు. ఈ క్రమంలో బైరి నరేశ్ తన బొలెరో వాహనాన్ని అతివేగంగా భక్తులపైకి తీసుకెళ్లడంతో పోగు నర్సింగరావు అనే వ్యక్తి కాలు విరిగింది. దీంతో ఆగ్రహం చెందిన భక్తులు వాహనాన్ని వెంబడించగా అతను పారిపోయాడు. నరేశ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప స్వాములు రాస్తారోకో చేపట్టారు. బాధితుడు నర్సింగరావుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ కార్పొరేషన్ల ఎండీల మార్పు!

- ఆయా పోస్టుల్లో ఐఏఎస్‌లను నియమిస్తామన్న సీఎం
- ముఖ్యమంత్రి ప్రకటనతో అధికారుల్లో చర్చ
- గతంలో కార్పొరేషన్లకు ఐఏఎస్‌లే అధిపతులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు ఐఏఎస్‌లను ఎండీలుగా నియమిస్తామంటూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో వ్యవసాయ కార్పొరేషన్ల ఎండీల్లో గుబులు నెలకొంది. మరోవైపు కొత్తగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వ్యవసాయ శాఖలో కొందరు అధికారులు మారతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. సంక్రాంతికి ముందుగానే లేదా ఆ వెంటనే కార్పొరేషన్ల ఎండీలు, జనరల్ మేనేజర్లు మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తనకు గతంలో తెలిసిన, సమర్థులైన అధికారులను ఆయా పోస్టుల్లో నియమించవచ్చని చెబుతున్నారు. వ్యవసాయ శాఖలో మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్, ఆగ్రోస్, సీడ్, హాకా, వేర్ హౌసింగ్ లాంటి కార్పొరేషన్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత కూడా వీటిల్లో కొన్నింటికి ఐఏఎస్‌లు ఎండీలుగా ఉన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాత్రం ఐఏఎస్‌లు కానివారు ఎండీలుగా కొనసాగుతున్నారు.

గత సర్కారుతో సంబంధాలపై ఆరా

ప్రస్తుతం కార్పొరేషన్ల ఎండీలుగా ఉన్నవారి గురించిన సమాచారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సేకరిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత ప్రభుత్వంతో వారెలా ఉన్నారు? వృత్తిపరంగా వ్యవహరించారా? లేక అప్పటి అధికార పార్టీ నేతల్లా పనిచేశారా? అన్నది ఆరా తీస్తున్నట్లు సమాచారం. కొన్ని కార్పొరేషన్లలో ఎండీలు, చైర్మన్లు కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. కొందరు ఎండీ స్థాయి లేకున్నా పైరవీలతో ఆయా సీట్లలో కూర్చున్నారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఆయా పోస్టుల్లో కొనసాగేందుకు కొందరు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

ఉండేదెవరు? ఊడేదెవరు?: మార్క్‌ఫెడ్‌కు సత్యనారాయణరెడ్డి ఎండీగా ఉన్నారు. సరిగ్గా ఎన్నికల షెడ్యూల్ కంటే ముందు ఆయన ఈ బాధ్యతల్లోకి వచ్చారు. అంతకుముందు ఆయన గత ప్రభుత్వంలోని మంత్రి దయాకర్‌రావు వద్ద పీఏస్‌గా పనిచేశారు. ఇలా గతంలో పీఏస్‌లుగా పనిచేసిన వారిని ఇప్పుడు తీసుకోబోమని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో సత్యనారాయణరెడ్డి కొనసాగింపుపై చర్చ జరుగుతోంది. వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఎండీగా ఉన్న జితేందర్‌రెడ్డి ఒక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధికి దగ్గరి బంధువు. కాబట్టి ఈయన కొనసాగింపుపైనా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న చర్చ జరుగుతోంది. ఇక ఆయిల్‌ఫెడ్, ఆగ్రోస్, సీడ్, హాకా సంస్థలకు ఎండీలుగా సీనియర్ అధికారులు ఉన్నారు. వీరికి గతంలో బీఆర్ఎస్‌తో రాజకీయపరమైన సంబంధాలు లేవంటున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ కేశవులు అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ సంస్థ (ఇష్టా)కు అధ్యక్షుడిగా ఉన్నారు. అంతర్జాతీయంగా రాష్ట్ర ఖ్యాతిని చాటుతున్నారు. కాబట్టి ఈయన మార్పు ఉండబోదన్న వాదన వినిపిస్తోంది. ఇక ఆయిల్ ఫెడ్, హాకాలకు ఎండీగా ఉన్న సురేందర్, ఆగ్రోస్ ఎండీ రాములు ఇద్దరూ సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందినవారు. కాబట్టి వారిని కూడా మార్చక పోవచ్చని చెబుతున్నారు. వారికి సీఎంతో ఉన్న అనుబంధం కూడా కలిసి వస్తుందని అంటున్నారు.

రఘునందన్‌రావు కొనసాగుతారా?

వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు కొనసాగుతారా లేదా అన్న చర్చ కూడా జరుగుతోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన సన్నిహితుడన్న ప్రచారముంది. మరోవైపు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ, అలాగే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోనూ రఘునందన్‌రావుకు మంచి సంబంధాలే ఉన్నాయంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కొనసాగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఒక వేళ మార్చినా మంచి పోస్టులోకే వెళ్తారని అంటున్నారు.



సీఎం రేవంత్‌ను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి తదితరులు

'రెవెన్యూ' సమస్యలు పరిష్కరించండి

- సీఎం రేవంత్‌కు తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘాల వినతి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరాయి. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం సీఎం రేవంత్‌ను రెవెన్యూ సంఘాల నేతలు సచివాలయంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, వీఆర్వోల సంఘం నేత సతీశ్ సీఎంను కలిశారు.

యాదాద్రిలో దర్శనానికి 4 గంటలు

- కొత్తేడాది మొదటి రోజు యాదాద్రీశుడి సన్నిధి కిటకిట



ప్రధానాలయం వీధుల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: నూతన సంవత్సరం మొదటి రోజు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కొత్త సంవత్సరం శ్రీస్వామి వారిని దర్శించుకుంటే ఏడాదంతా అంతా మంచి జరుగుతుందనే భావనతో తెలంగాణలోని ఆయా జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి నాలుగు గంటలు, వీఐపీ దర్శనాలకు 2 గంటలు, బ్రేక్ దర్శనానికి 30 నిమిషాలు పట్టిందని భక్తులు తెలిపారు. ఎక్కువ మంది భక్తులు కొండ కింద గల లక్ష్మీ పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేశారు. ఇక కొండపైకి, కొండ కిందకు ఉచిత బస్సుల్లో భక్తులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు కిక్కిరిసి పోయాయి.

మూడు విప్లవ సంస్థల విలీనం

- సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీగా ఏర్పాటు

లక్డీకాపూల్(హైదరాబాద్): మూడు విప్లవ సంస్థలు ఏకమయ్యాయి. సీపీఐ(ఎంఎల్) రాంచంద్రన్ వర్గం, సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటన, సీపీఐ(ఎంఎల్) క్రాంతి వర్గం కలిసి సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీగా ఏర్పడినట్లు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతనెల 30, 31 తేదీల్లో నిర్వహించిన జాతీయ ప్లీనరీ సమావేశాల్లో పార్టీ కేంద్ర కమి టీ కార్యదర్శిగా మల్లెపల్లి ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. నకిరేకంటి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో పలు రాజకీయ, నిర్మాణపరమైన అంశాలను సమీక్షించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తు కార్యాచరణతో పా టు పార్టీ రాజకీయ, సాహిత్య, పీడితజన గొంతు అయిన ప్రతిఘటన పత్రిక సంపాదకులుగా షేక్ షావలిని కొనసాగిస్తూ తీర్మానించినట్లు తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

- డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ
- ఇద్దరు జేఎన్‌టీయూ విద్యార్థులు మృతి



నితిన్



భరత్ చందర్

పటాన్‌చెరు టౌన్: న్యూఇయర్ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ దుర్గం చెరువు వద్ద జరిగిన ఈవెంట్‌కి హాజరై తిరిగి హాస్టల్‌కు వెళ్తుండగా స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు బీటెక్ విద్యార్థులు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పటాన్‌చెరు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు... సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సుల్తాన్‌పూర్ పరిధిలోని జేఎన్‌టీయూ యూనివర్సిటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులు హాస్టల్‌లో పర్మిషన్ తీసుకుని ఆదివారం సాయంత్రం మూడు బైక్‌లపై దుర్గం చెరువు ఈవెంట్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా పటాన్‌చెరు శివారు వాల్యూమాట్ సమీపంలోకి రాగానే భరత్ చందర్ (19) నడుపుతున్న స్కూటీ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో భరత్ చందర్‌తో పాటు వెనుక కూర్చున్న స్నేహితుడు నితిన్ (18) అక్కడికక్కడే మృతి చెందగా, మరో స్నేహితుడు వర్షిత్ (19)కు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భరత్ చందర్ స్వస్థలం జనగామ జిల్లా పాలకుర్తి మండలం రాఘవపురం గ్రామం. నితిన్‌ది అదే జిల్లా బచ్చన్నపేట మండలంలోని ఆలింపురం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల ఫిర్యాదుల్లో తెలంగాణకు 4వ స్థానం

- తెలంగాణ నుంచి సీ–విజిల్ యాప్‌కు 10 వేల ఫిర్యాదులు
- 21 వేల ఫిర్యాదులతో రాజస్థాన్ టాప్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గడిచిన ఏడాది కాలంలో ఎన్నికలు జరిగిన రాష్ట్రాలను పరిశీలిస్తే ప్రజా ఫిర్యాదులు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచింది. నవంబర్ 2022 నుంచి నవంబర్ 2023 మధ్య ఎన్నికల కమిషన్ తన సీ–విజిల్ యాప్‌లో అందుకున్న అన్ని ఫిర్యాదుల్లో అత్యధికంగా రాజస్థాన్ నుంచి రాగా, రెండో స్థానంలో కర్ణాటక ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ ఏడాది కాలంలో ఎన్నికల కమిషన్ నిర్వహించిన 11 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తంగా సీ–విజిల్ యాప్‌కు 77,623 ఫిర్యాదులు వచ్చాయని తెలిపింది. ఇందులో 21,152 ఫిర్యాదులు రాజస్థాన్ నుంచి రాగా తెలంగాణ నుంచి 10,132 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొంది. ఇటీవల ఎన్నికలు జరిగిన తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలకు సంబంధించి మొత్తంగా 48,337 ఫిర్యాదులు అందగా, ఇందులో అనుమతి లేకుండా పోస్టర్లు, బ్యానర్లు వేసినందుకు 21,509, ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించి 1,105 ఫిర్యాదులు, ఎన్నికల ప్రచారంపై 2,220, డబ్బు, మద్యం, కూపన్ల అక్రమ పంపిణీకి సంబంధించి 5,819 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించింది. 83 శాతం ఫిర్యాదులను 100 గంటల్లో పరిష్కరించినట్లు కమిషన్ తెలిపింది.


ఎన్నికల ఫిర్యాదులు ఇలా..

రాష్ట్రం	వచ్చిన ఫిర్యాదులు
రాజస్థాన్	21,152
కర్ణాటక	18,748
మధ్యప్రదేశ్	11,356
తెలంగాణ	10,132
గుజరాత్	6,192
ఛత్తీస్‌గఢ్	5,680

బడబానల కొండలు!

సముద్ర గర్భంలో అగ్నిపర్వతాలు

అవున్నిజమే. అది కూడా ఒకటి కాదు, రెండు కాదు. ఏకంగా 8 అగ్ని పర్వతాలు! అంటార్కిటికా మహాసముద్రంలో 4 వేల మీటర్ల లోతున చాలాకాలంగా నిద్రాణంగా ఉన్నాయట. ఇవి ఒక్కోటీ సగటున కిలోమీటరు పై చిలుకు ఎత్తులో ఉన్నాయి. వీటిలో అతి పెద్ద అగ్నిపర్వత శ్రేణి 1.5 కిలోమీటర్ల ఎత్తుంది! టాస్మేనియా నుంచి అంటార్కిటికా మధ్య 20 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పరిశోధనలు చేపట్టిన సీఎస్ఐఆర్‌ఓ వోయేజ్ నౌకలోని పరిశోధక బృందం వీటి ఉనికిని తాజాగా గుర్తించింది. 3డి ఇమేజింగ్ ద్వారా ఈ పర్వతాలను అత్యంత స్పష్టంగా మ్యాపింగ్ కూడా చేసింది. సముద్ర గర్భంలో అగ్నిపర్వతాల ఉనికి ఇంత స్పష్టంగా చిక్కడం నిజంగా అద్భుతమని సీఎస్ఐఆర్‌ఓ జియో ఫిజిసిస్ట్ డాక్టర్ క్రిస్ యూల్ చెప్పారు. సముద్ర ప్రవాహాల వేగం అత్యంత ఎక్కువగా ఉండే ధ్రువ ప్రాంతంలో ఇవి ఉండటం ఆశ్చర్యమేనని ఆయనన్నారు. వీటిలో నాలుగు పర్వతాల ఉనికిని కొన్నేళ్లుగా అనుమానిస్తూనే ఉన్నారు. ఇప్పుడది ధ్రువపడటంతో పాటు వాటి పక్కనే మరో నాలుగు అగ్నిపర్వతాలు కూడా ఉన్నట్టు తేలింది. ఇవి మకారీ ద్వీపానికి దాదాపు 200 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నాయి. భూ అయస్కాంత శక్తి చాలని ఫలితంగా బహుశా 20 లక్షల ఏళ్ల కింద ఇవి ఏర్పడి ఉంటాయని భావిస్తున్నారు. సీఎస్ఐఆర్‌ఓ వోయేజ్ ప్రాజెక్టును అమెరికా, ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థలు ఉమ్మడిగా తలపెట్టాయి. సముద్ర అంతర్భాగపు రహస్యాలను అన్వేషించడంతో పాటు వాటిని స్పష్టంగా మ్యాపింగ్ చేయడం దీని ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ''అంటార్కిటికా మహాసముద్రపు ధ్రువ ప్రవాహ గతి సముద్ర అడుగు భాగాన్ని ఢీకొనడం వల్ల ఏర్పడే భారీ సుడిగుండాలు వేడిమితో పాటు కర్బనాన్ని సముద్రంలో అన్నివైపులకూ చెదరగొడతాయి. అలా గ్లోబల్ వార్మింగ్ కట్టడిలో కీలకపాత్ర పోషిస్తాయి'' అని వోయేజ్ మిషన్ చీఫ్ కో సైంటిస్టు డాక్టర్ హెలెన్ ఫిలిప్స్ వివరించారు.



- సాక్షి, నేషనల్ డెస్క్



నింగిలోకి ఎక్స్‌పోశాట్

2024లో తొలి రోజే ఇస్రో ధమాకా ● పీఎస్ఎల్‌వీ 60వ ప్రయోగం దిగ్విజయం ● ఫ్యూయల్ సెల్ సహా 10 పరికరాలు భూ కక్ష్యలోకి

- భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటులో కీలకం
- శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు
- ఇది గగన్‌యాన్ ఏడాది: ఇస్రో చైర్మన్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన సంవత్సరాన్ని దిగ్విజయంగా ఆరంభించింది. సోమవారం చేపట్టిన పీఎస్ఎల్‌వీ సీ58 60వ ప్రయోగం విజయవంతమైంది. పీఎస్ఎల్‌వీ రాకెట్ తొలుత కృష్ణబిలాల పరిశోధనకు ఉద్దేశించిన ఎక్స్‌రే పొలారిమీటర్ శాటిలైట్ (ఎక్స్‌పోశాట్)తో పాటు కేరళ యూనివర్సిటీకి చెందిన బుల్లి ఉపగ్రహం వియ్‌శాట్‌నూ రోదసిలోకి ప్రవేశపెట్టింది. అనంతరం చివరిదైన నాలుగో దశలో ఫ్యూయల్ సెల్ పవర్ సిస్టం (ఎఫ్‌సీపీఎస్)తో పాటు మొత్తం పది పరికరాలను దిగువ భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భారత్ నిర్మించబోయే సొంత అంతరిక్ష కేంద్రానికి ఇంధన లభ్యత కోణంలో ఎఫ్‌సీపీఎస్ ఎంతో కీలకం కానుంది. ప్రయోగం దిగ్విజయం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. 2024కు అద్భుత ఆరంభాన్నిచ్చినందుకు శాస్త్రవేత్తలకు అభినందనలన్నారు.

నిప్పులు చిమ్ముతూ...

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ58 ప్రయోగం జరిగింది. ఆదివారం మొదలైన 25 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే సోమవారం ఉదయం 9.10 గంటలకు ముగిసింది. ఆ వెంటనే 44.4 మీటర్లు పొడవున్న పీఎస్ఎల్‌వీ రాకెట్ 260 టన్నుల బరువుతో మంచు తెరలను చీల్చుకుంటూ, నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. మొత్తం ప్రయోగం నాలుగు దశల్లో 21.55 నిమిషాల్లో పూర్తయింది. ముందుగా ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని భూమికి 650 కిలోమీటర్లు ఎత్తులోని సన్‌సింక్రనస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. అనంతరం కిలో బరువున్న వియ్‌శాట్‌ను కూడా కక్ష్యలోకి నిర్దేశిత సమయంలో ప్రవేశపెట్టారు. ఏడాది తొలి రోజే చేపట్టిన కీలక ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకున్నారు. ఇస్రో ప్రయోగాల పరంపరకు శ్రీకారం చుట్టి ఈ ఏడాదితో 60 ఏళ్లు పూర్తయ్యాయి. పీఎస్ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లోనూ ఇది 60వ ప్రయోగం కావడం విశేషం! మొత్తమ్మీద షార్ నుంచి ఇది 92వ ప్రయోగం.

ఫ్యూయల్ సెల్ ప్రయోగం...

ఎక్స్‌పోశాట్, వియ్‌శాట్లను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ప్రయోగ చివరి దశలో పీఎస్ఎల్‌వీ వ్యోమ నౌకను రెండుసార్లు మండించి దాని ఎత్తును 650 కి.మీ. నుంచి 350 కి.మీ.కి తగ్గించారు. 10 కీలక పరికరాలను ఆ భూ దిగువ కక్ష్యలోకి విజయవతంగా చేర్చారు. ఫ్యూయల్ సెల్ పవర్ సిస్టం (ఎఫ్‌సీపీఎస్)తో పాటు బెలిఫ్‌శాట్, గ్రీన్ ఇంపల్స్ ట్రాన్స్‌మిటర్ బెలాట్రిక్స్ వంటివి వీటిలో ఉన్నాయి. పీఎస్ఎల్‌వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్-3 (పోయెం) ప్రయోగంలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టారు. 2023 ఏప్రిల్లో పీఎస్ఎల్‌వీ-సీ55 ప్రయోగం సందర్భంగా కూడా పోయెం-2 ద్వారా ఇలాంటి ప్రయోగాన్నే ఇస్రో చేపట్టింది.

- ఇస్రో నిర్మించనున్న భారత అంతరిక్ష కేంద్రానికి ఎఫ్‌సీపీఎస్ కీలకం కానుంది.
- రోదసిలో సుస్థిర శక్తి వనరును సమకూర్చుకోవడం దీని లక్ష్యం.
- ఇందులోని టెక్నాలజీ ఎలక్ట్రో కెమికల్ రియాక్షన్ సాయంతో రసాయన శక్తిని నేరుగా విద్యుచ్ఛక్తిగా మారుస్తుంది.
- తద్వారా మన అంతరిక్ష కేంద్రానికి కావాల్సిన ఇంధనాన్ని ఇది సుదీర్ఘ కాలం పాటు అందించగలదు.

ఎక్స్‌పోశాట్‌తో ఉపయోగాలివీ...

- ఉపగ్రహం బరువు 469 కిలోలు.
- ఇది ఐదేళ్ల పాటు సేవలందిస్తుంది.
- గతంలో ప్రయోగించిన ఆస్ట్రోశాట్‌తో కలిసి ఖగోళ పరిశోధన చేపట్టనుంది.
- ఇవి రెండూ విశ్వంతారాల్లో పరిణామాలపై, ముఖ్యంగా కృష్ణ బిలాలపై పరిశోధనలు చేస్తాయి.
- ఎక్స్‌పోశాట్‌లోని ప్రాథమిక పేలోడ్ పోలిక్స్ (ఎక్స్-పోలారిమీటర్ పరికరం)ను 8.3 కిలోవాట్ల ఫోటాన్ల మధ్య వ్యవస్థ ఎక్స్‌రే శక్తి శ్రేణిలో ధ్రువణ పరామితులను, ప్రత్యేకంగా వాటి డిగ్రీ, ధ్రువణ కోణాలను కొలిచేందుకు రూపొందించారు. రామన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఆర్ఆర్ఐ) బెంగళూరు ఇస్రో కేంద్రం దీన్ని రూపొందించింది.
- ఇందులోని మరో పేలోడ్ ఎక్స్‌పెక్ట్ (ఎక్స్ రే స్పెక్ట్రోస్కోపీ, టైమింగ్) 0.8-15 కిలోవాట్స్ శక్తి పరిధిలో స్పెక్ట్రోస్కోపిక్ సమాచారాన్ని అందిస్తుంది. దీన్ని ప్రొఫెసర్ యూఆర్ రావు స్పేస్ సెంటర్ రూపొందించింది.
- ఈ రెండు పేలోడ్లు విశ్వాంతరాల్లో కృష్ణ బిలాలపై లోతుగా అధ్యయనం చేసి విలువైన సమాచారం అందిస్తాయి.
- ఇక కేరళ వర్సిటీ విద్యార్థినులు తయారు చేసిన వియ్‌శాట్ కేజీ బరువున్న సూక్ష్మ ఉపగ్రహం.
- కేరళలో మారిన వాతావరణ పరిస్థితుల అధ్యయనం దీని ముఖ్యోద్దేశం.

ఈ ఏడాది 12 ప్రయోగాలు: సోమనాథ్

ఈ ఏడాది 12 ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. ''2024ను గగన్‌యాన్ ఏడాదిగా నిర్దేశించుకున్నాం. ఆ ప్రాజెక్టులో భాగంగా ఈ ఏడాది నాలుగు మానవరహిత ప్రయోగాలు చేయనున్నాం. అనంతరం 2025లో మానవసహిత ప్రయోగం ఉంటుంది. నాసాతో సంయుక్తంగా రూపొందించిన ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని త్వరలో ప్రయోగిస్తాం. ఈ నెల 26న, లేదా ఫిబ్రవరి తొలి వారంలో నావిక్-02 ఉపగ్రహ ప్రయోగం ఉటుంది'' అని ఆయన వివరించారు.



ప్రయోగానంతరం ఇస్రో శాస్త్రవేత్తలతో సోమనాథ్

మసూద్ అజార్ హతం?

సోషల్ మీడియాలో పోస్టులు వైరల్



ఇస్లామాబాద్: కాందహార్ విమానం హైజాక్ సూత్రధారి మసూద్ అజార్ బాంబు పేలుడులో హతయ్యాడంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్‌గా మారాయి. సోమవారం ఉదయం 5 గంటల సమయంలో పాకిస్తాన్‌లోని భావల్పూర్ మసీదు నుంచి వస్తుండగా బాంబు పేలిన ఘటనలో అతడు హతమైనట్లు ధ్రువీకరించని ట్వీట్ల ద్వారా తెలుస్తోంది. పేలుడుకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అనంతరం పాక్ ఆర్మీ దావూద్ ఇబ్రహీం సహా పలువురు ఉగ్రవాదులపై దాడులు చేపట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తోంది. భారత్‌లో మోస్ట్ వాంటెడ్‌గా ఉండి పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం తదితర రెండు డజన్ల మంది వరకు ఉగ్రవాదులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 2001 పార్లమెంట్‌పై దాడి ఘటనకు సంబంధించిన కేసుల్లో అజార్‌ను భారత్ వాంటెడ్‌గా ప్రకటించింది. 2008లో నేపాల్ నుంచి భారత్‌కు బయలుదేరిన ఇండియన్‌ఎయిర్ లైన్స్ విమానాన్ని ఉగ్రవాదులు హైజాక్ చేసి, అఫ్గానిస్తాన్‌లోని కాందహార్‌కు తీసుకెళ్లారు. హైజాకర్ల డిమాండ్ మేరకు జైళ్లలో ఉన్న అజార్ సహా ముగ్గురు కరడుగట్టిన ఉగ్రవాదులను భారత్ ప్రభుత్వం విడిచిపెట్టింది. విమాన ప్రయాణికుల్లో ఒకరిని పొడిచి చంపిన ఉగ్రవాదులు, మరికొందరిని గాయపరిచారు. వారంపాటు కొనసాగిన తీవ్ర ఉత్కంఠ అనంతరం అందులోని 176 మందిని ఉగ్రవాదులు సురక్షితంగా విడిచిపెట్టారు.

గోల్డీని ఉగ్రవాదిగా ప్రకటించిన కేంద్రం



న్యూఢిల్లీ: కెనడాకు చెందిన గ్యాంగ్‌స్టర్ సతీందర్‌జిత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్‌ను కేంద్రం ఉగ్రవాదిగా ప్రకటించింది. ఉగ్రవాద వ్యతిరేక ఉపా చట్టం కింద అతడిని ఉగ్రవాది ప్రకటిస్తున్నట్లు హోం శాఖ సోమవారం తెలిపింది. పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ఇతడు మాస్టర్ మైండ్‌గా ఉన్నాడు. పాకిస్తాన్ దన్నుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఇతడికి పలు హత్య కేసులతో సంబంధం ఉందని హోం శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. పంజాబ్‌లోని శ్రీముక్త్‌సర్ సాహిబ్‌కు చెందిన బ్రార్ ప్రస్తుతం కెనడాలోని బ్రాంప్టన్‌లో ఉంటున్నాడు. ఇతడిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది.

బంగ్లాదేశ్ నోబెల్ గ్రహీతకు 6 నెలల జైలు



ఢాకా: బంగ్లాదేశ్ ఆర్థిక వేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ మహ్మద్ యూనస్(83)కు కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. మరో ముగ్గురితో కలిసి ఆయన స్థాపించిన గ్రామీణ్ టెలికం సంస్థలో కార్మికుల సంక్షేమ నిధిని నెలకొల్పడంలో విఫలమైనట్లు మూడో కార్మిక న్యాయస్థానం జడ్జి షేక్ మరీనా సుల్తానా సోమవారం యూనస్‌కు ఆరు నెలల జైలు శిక్ష విస్తూ తీర్పు వెలువరించారు. అంతేకాదు, తలా రూ.19 వేల జరిమానా విధించారు. అనంతరం వారు పెట్టుకున్న పిటిషన్ల మేరకు నలుగురికీ బెయిల్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పును వీరు హైకోర్టులో సవాల్ చేసుకునే వీలుంటుంది. ఈ నెల 7న బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

పదేళ్ల ప్రగతిపై మీరేమంటారు?

ప్రజాభిప్రాయం కోరిన ప్రధాని మోదీ


న్యూఢిల్లీ: దేశం గత పదేళ్లలో తమ ప్రభుత్వ హయాంలో సాధించిన అభివృద్ధిపై ప్రజలు అభిప్రాయాలను వెల్లడించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రధాని మోదీ డిసెంబర్‌లో నమో యాప్‌లో 'జన్ మన్ సర్వే' ప్రారంభించారు. ప్రభుత్వంతోపాటు, ఎంపీల పనితీరు సహా వివిధ అంశాలను గురించి తాము ఏమనుకుంటున్నదీ నేరుగా తనకు తెలపాలని అందులో కోరారు. సర్వేలో ఎలా పాల్గొనాల్సిందీ తెలిపే లింక్‌ను కూడా ఆయన సోమవారం 'ఎక్స్'లో షేర్ చేశారు. పరిపాలన, నాయకత్వానికి సంబంధించిన వేర్వేరు అంశాలతోపాటు కేంద్ర స్థాయి అభివృద్ధి, కొన్ని ప్రత్యేక నియోజక వర్గాల గురించి కూడా అందులో ప్రశ్నలు న్నాయి.

మూడు క్రిమినల్ చట్టాలపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన మూడు క్రిమినల్ చట్టాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ చట్టాల్లో ఎన్నో లోపాలున్నాయని న్యాయవాది విశాల్ తివారీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మూడు చట్టాలపై పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ జరగలేదని చెప్పారు. వాటిని ప్రవేశపెట్టిన సమయంలో చాలా మంది ప్రతిపక్ష సభ్యులు సభలో లేరని తెలిపారు. మూడు క్రిమినల్ చట్టాలపై కూలంకషంగా అధ్యయనం చేసేందుకు నిపుణులతో కూడిన కమిటీ వేసేలా ప్రభుత్వానికి మార్గదర్శకాలివ్వాలన్నారు. చట్టాలు అమలు కాకుండా అడ్డుకోవాలని కోరారు. నూతన చట్టాలు అమలైతే పోలీసులకు మరిన్ని తిరుగులేని అధికారాలు సంక్రమించడంతోపాటు ప్రజల హక్కులకు భంగం కలుగుతుందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షాత సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులకు డిసెంబర్ 21వ తేదీన లోక్‌సభ ఆమోదం తెలపడం, అదే నెల 25న వాటిపై రాష్ట్రపతి ముర్ము ఆమోద ముద్ర వేయడం తెలిసిందే.

సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు

అహ్మదాబాద్: వేలాదిగా ఏకకాలంలో సూర్య నమస్కారాలు చేయడం ద్వారా గుజరాత్ వాసులు ప్రపంచ రికార్డు నెల కొల్పారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 108 ప్రాంతాల్లో చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమంలో 50 వేల మందికి పైగా పాలుపంచుకున్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.



తీర్పులు న్యాయమూర్తుల వ్యక్తిగతం కాదు

రాజ్యాంగం, చట్టం ప్రకారమే కేసులపై తీర్పులిస్తారు ● సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడి

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల వెలువరించిన ఏకగ్రీవ తీర్పు పట్ల వ్యక్తమవుతున్న విమర్శలపై స్పందించడానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నిరాకరించారు. రాజ్యాంగం, చట్టం ప్రకారమే న్యాయమూర్తులు కేసులపై తీర్పులిస్తారని చెప్పారు. ఏదైనా కేసుపై చట్టానికి లోబడే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. సోమవారం పీటీఐ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో జస్టిస్ చంద్రచూడ్ పలు అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించలేమంటూ ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై మాట్లాడారు. ఏ న్యాయమూర్తి కూడా వారి వ్యక్తిగత అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని తీర్పులు ఇవ్వరని స్పష్టం చేశారు. ఈ కేసులో ఇచ్చిన తీర్పు కూడా జడ్జిల వ్యక్తిగతం కాదని అన్నారు. చాలా రకాల కేసుల విచారణ, తీర్పుల్లో తాను కూడా భాగస్వామిగా ఉన్నానని గుర్తుచేశారు. ఒక జడ్జిగా ఏ కేసును, తీర్పునూ వ్యక్తిగతంగా తీసుకోలేదని చెప్పారు. అందుకు తనకు ఎలాంటి విచారం గానీ, ఫిర్యాదు గానీ లేదన్నారు. న్యాయమూర్తులు తీర్పు వెలువరించిన తర్వాత అది ప్రజల ఆస్తిగా మారుతుందని స్పష్టం చేశారు. దానిపై అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రజలకుంటుందని పేర్కొన్నారు. తీర్పుపై విమర్శలను తిప్పికొట్టడం, సమర్థించుకోవడం సరికాదన్నారు. తీర్పు ఇచ్చిన తర్వాత ఇక ఆ సంగతి పక్కన పెట్టాలన్నది తన ఉద్దేశమని వివరించారు.

తీర్పుపై ఏ జడ్జికీ ఆధిక్యముండదు

అయోధ్యలో వివాదాస్పద స్థలంలో రామ మందిర నిర్మాణానికి అనుకూలంగా సుప్రీంకోర్టు దేళ్ల క్రితం ఇచ్చిన తీర్పుపై జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ.. అప్పటి సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. ఈ తీర్పు రావడానికి కారణాన్ని ధర్మాసనంలోని ఏ ఒక్క సభ్యుడికో ఆపాదించలేమని పేర్కొన్నారు. ధర్మాసనంలోని సభ్యులంతా ఏకగ్రీవంగా అయోధ్య తీర్పు ఇచ్చారని వెల్లడించారు. ఏ కేసులో అయినా ఇవ్వాల్సిన తీర్పును సంబంధిత జడ్జిలంతా కలిసి కూర్చొని, చర్చించుకొని నిర్ణయిస్తారని పేర్కొన్నారు. చివరకు అది కోర్టు తీర్పుగా మారుతుందని స్పష్టం చేశారు. తీర్పును నిర్ణయించే విషయంలో ఆధిక్యం ఏ ఒక్క జడ్జికో కట్టబెట్టలేమని తేల్చిచెప్పారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం కోసం పేర్లను ప్రతిపాదించే కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేదు అని విమర్శించడం సరైంది కాదని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థలో పారదర్శకతను మరింత పెంచడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొలీజియంలో అంతర్గతంగా జరిగే సంప్రదింపులను కొన్న కారణాలతో ప్రజలకు తెలియపర్చలేమని సీజేఐ స్పష్టం చేశారు.

జపాన్‌లో సునామీ హెచ్చరికలు

- జపాన్ వాయవ్య తీరంలో తీవ్ర భూకంపం
- రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదు, వేలాది ఇళ్లు ధ్వంసం
- ఇషిగావా, నిగాటా, టొమయాలో 21 ప్రకంపనలు
- ఉభయ కొరియా, రష్యాలోనూ సునామీ హెచ్చరికలు



జపాన్‌లో భూకంప తీవ్రతకు పగుళ్లిచ్చిన రోడ్లను చూస్తున్న జనం

టోక్యో: ద్వీప దేశమైన జపాన్‌లో నూతన సంవత్సరం తొలిరోజే శక్తివంతమైన భూకంపం సంభవించింది. వాయవ్య జపాన్ తీరంలో సోమవారం సాయంత్రం 4 గంటల తరువాత పలుమార్లు భూప్రకంపనలు నమోదయ్యాయి. కనీసం 21 సార్లు భూమి కంపించినట్లు స్థానిక మీడియా తెలియజేసింది. ఇషిగావా రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతాల్లో వరుసగా భూప్రకంపనలు సంభవించాయి. తొలుత సాయంత్రం 4.06 గంటల ప్రాంతంలో మొదలైన ప్రకంపనలు 4.32 గంటల వరకు కొనసాగాయి. ఈ భూకంప తీవ్రత సాయంత్రం 4.10 గంటలకు రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైనట్లు జపాన్ వాతావరణ సంస్థ ప్రకటించింది. భూకంపం దాటికి సముద్రంలో ఐదు అడుగుల మేర అలలు ఎగిసిపడ్డాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. పశ్చిమ కోస్తా తీరంలోని ఇషిగావా, నిగాటా, టొమయా జిల్లాలకు జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఇషిగావాకు మేజర్ సునామీ హెచ్చరిక, మిగిలిన పశ్చిమ తీర ప్రాంతానికి తక్కువ తీవ్రత కలిగిన సునామీ హెచ్చరిక జారీ చేసింది. కొన్ని గంటల తర్వాత సముద్రంలో అలల తీవ్రత తగ్గుముఖం పట్టడంతో సాధారణ సునామీ హెచ్చరికలను జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. తీర ప్రాంతాల్లోని జనం తక్షణమే సురక్షిత ప్రదేశాలకు చేరుకోవాలని సూచించింది. నిగాటా, టొమయాలో 3 మీటర్ల మేర అలలు ఎగిసిపడుతున్నాయి. ఫోన్, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని సమీక్షిస్తున్నామని ప్రధాని కిషిదా చెప్పారు.

శిథిలాల కింద బాధితులు!

ఇషిగావా జిల్లాతోపాటు సమీప ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయని వాతావరణ సంస్థ ప్రకటించింది. ఇషిగావాలోని నోటో ప్రాంతం నుంచి 300 కిలోమీటర్ల మేర సునామీ అలలు విస్తరించే అవకాశం ఉందని స్థానిక వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. భూకంపం వల్ల ఇళ్లు కంపిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. భూప్రకంపనలతో భయాందోళనకు గురైన జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు కుర్చీలు, టేబుళ్ల కింద దాక్కున్నారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఇళ్లు నేలకూలాయి. మరికొన్ని ఇళ్లకు పగుళ్లు కనిపించాయి. ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు. రాజధాని టోక్యోతోపాటు కాంటో ఏరియాలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. అధికారులతో పాటు సైన్యమూ సహాయక చర్యల్లో నిమగ్నమైంది. ఉభయ కొరియాలతో పాటు రష్యాలోనూ సునామీ హెచ్చరికలు జారీ చేశాయి. టోక్యోలోని భారత రాయబార కార్యాలయం బాధితులకు సమాచారం, సహాయం అందించేందుకు ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

మణిపూర్‌లో కాల్పులు.. ముగ్గురు మృతి

ఐదు జిల్లాల్లో కర్ఫ్యూ

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. తౌబల్ జిల్లా లిలాంగ్ చింగ్‌జావో ప్రాంతంలో సోమవారం సాయంత్రం పోలీసు దుస్తుల్లో వచ్చిన దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దాంతో తౌబల్‌తోపాటు ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. దాంతో ఆగ్రహించిన ఒక వర్గం వారు నాలుగు కార్లకు నిప్పుపెట్టారు. కార్లు ఎవరివనే విషయం తెలియాల్సి ఉంది. కాల్పుల ఘటనను సీఎం బీరేన్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదన్నారు. పోలీసులు దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. దోషులను పట్టుకుని, చట్టం ముందు నిలబెడతామని ఆయన స్పష్టం చేశారు. మణిపూర్‌లో గత ఏడాది మే 3వ తేదీన ట్రైబల్ సాలిడారిటీ మార్చ్ అనంతరం కొనసాగుతున్న జాతుల మధ్య వైరంతో 180 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మణిపూర్ జనాభాలో 53 శాతం మంది మొయితీలున్నారు. కొండ ప్రాంత జిల్లాల్లో నివసించే నాగాలు, కుకీలు కలిపి 40 శాతం వరకు ఉంటారు.

దక్షిణ ధ్రువంలో పోలార్ ప్రీత్ విజయ యాత్ర

ఒంటరిగా అత్యంగా వేగంగా చేరుకున్న మహిళగా రికార్డు




లండన్: అంటార్కిటికా అన్వేషణలతో పోలార్ ప్రీత్‌గా పేరు తెచ్చుకున్న బ్రిటిష్ సిక్కు ఆర్మీ అధికారి, ఫిజియోథెరపిస్ట్ కెప్టెన్ హర్‌ప్రీత్ చాంది(33) మరో ప్రపంచ రికార్డు నెలకొల్పారు. దక్షిణ ధ్రువంపై ఒంటరిగా వేగవంతంగా అన్వేషణ పూర్తి చేసుకున్న మహిళగా తాజాగా చరిత్ర సృష్టించారు. రోన్నె ఐస్ షెల్ఫ్ నుంచి నవంబర్ 26న ప్రారంభించిన యాత్ర దక్షిణ ధ్రువానికి చేరుకోవడంతో గురువారంతో ముగిసినట్లు ఆమె స్వయంగా ప్రకటించారు. రోజుకు 12 ,13 గంటల చొప్పున ముందుకు సాగుతూ మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద మొత్తం 1,130 కిలోమీటర్ల దూరాన్ని ఎవరి సాయం లేకుండానే 31 రోజుల 13 గంటల 19 నిమిషాల్లో పూర్తి చేశానన్నారు. ఈ ఫీట్‌ను గురించి గిన్నిస్ వరల్డ్ బుక్ నిర్వాహకులకు వివరాలందించానని, ధ్రువీకరణ కోసం వేచి చూస్తున్నానని చెప్పారు. అంటార్కిటికా అన్వేషణలకు సంబంధించి కెప్టెన్ హర్‌ప్రీత్ చాంది పేరిట ఇప్పటికే రెండు వేర్వేరు రికార్డులు నమోదై ఉన్నాయి.

రామాలయం అక్షతల పంపిణీ ప్రారంభం



అయోధ్య: అయోధ్యలోని భవ్య రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఈనెల 22వ తేదీన మధ్యాహ్నం 12.20 గంటలకు జరిగే విగ్రహ ప్రతిష్ఠకు గాను నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి అక్షతల పంపిణీని ప్రారంభించినట్లు ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు. బియ్యంతో పసుపు, నెయ్యి కలగలిపిన పవిత్ర అక్షతల పంపిణీ కార్యక్రమం మకర సంక్రాంతి వరకు, ఈ నెల 15 వరకు కొనసాగుతుందన్నారు. ప్రజలకు పంపిణీ చేసే అక్షతల ప్యాకెట్‌పై రామాలయం చిత్రంతోపాటు ఆలయ నిర్మాణం గురించిన వివరాలతో కూడిన కరపత్రం ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 5 లక్షల ఆలయాల పరిధిలోని 5 కోట్ల కుటుంబాల ప్రజలకు అక్షతలు అందుతాయని చెప్పారు.

వేగంగా వ్యాపిస్తున్న జేఎన్.1 వేరియంట్



న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్-19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు ఇప్పటి వరకు 197 గుర్తించినట్లు ప్రభుత్వ విభాగం ఇన్సాకాగ్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ కేసులు బయపడిన 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల జాబితాలో తాజాగా ఒడిశా చేరినట్లు పేర్కొంది. ఇందులో కేరళలో 83, గోవాలో 51, గుజరాత్‌లో 34, కర్ణాటక, మహారాష్ట్రల్లో 8 చొప్పున, రాజస్తాన్‌లో 5, తమిళనాడులో 4, తెలంగాణలో 2, ఒడిశాలో 1 కేసు ఉన్నట్లు వివరించింది. ఈ సబ్ వేరియంట్‌కు చెందిన కేసులు డిసెంబర్‌లో 180, నవంబర్‌లో 17 కేసులు బయటపడ్డాయని వెల్లడించింది. జేఎన్.1 సబ్ వేరియంట్ కేసులు వేగంగా వ్యాప్తి చెందుతున్నప్పటికీ వీటితో ప్రమాదం తక్కువని వివరించింది. ఇలా ఉండగా, దేశంలో కొత్తగా 636 కోవిడ్ కేసులు బయటపడ్డాయని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం 4,394 యాక్టివ్ కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించింది.

సాక్షి
హైదరాబాద్

మంగళవారం, 2, జనవరి, 2024



సీఎం, గవర్నర్లను కలిసిన కొత్వాల్

నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి సోమవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛం అందించిన సీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను కూడా కలిసి నగర, రాచకొండ సీపీలు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, సిటీబ్యూరో





గవర్నర్ తమిళిసైకి శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీలు శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌బాబు



బిర్లా టెంపుల్‌లో భారీ క్యూ

కొత్త సందడి

ఆదివారం అర్ధరాత్రి న్యూఇయర్‌కు ఘనంగా స్వాగతం పలికిన నగరవాసులు...సోమవారం కూడా సందడి కొనసాగించారు. సెలవుదినం కావడంతో ఆలయాలు, పార్కులు. ఇతర సందర్శనీయ స్థలాలు జనంతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరం మొదటి రోజు కావడంతో పలువురు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించారు. బిర్లా టెంపుల్, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి, వెంకటేశ్వర ఆలయాల్లో ఉదయం నుంచే రద్దీ కన్పించింది. ఇక ఎన్టీఆర్, లుంబినీ పార్కులు, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు తదితర ప్రాంతాలు కూడా కిక్కిరిశాయి.

– సాక్షి, సిటీబ్యూరో



రాజ్‌భవన్‌లో న్యూ ఇయర్ వేడుకల్లో చిన్నారులతో గవర్నర్ తమిళిసై



బంజారాహిల్స్‌లోని జగన్నాథ టెంపుల్‌లో భక్తుల రద్దీ

ఆరంభం అదిరింది!

ప్రశాంతంగా ప్రారంభమైన కొత్త ఏడాది

- 'డిసెంబర్ 31' బందోబస్తు విజయవంతం
- తనిఖీల్లో చిక్కిన 3001 మంది డ్రంక్ డ్రైవర్లు
- పట్టుబడిన వారిలో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు



కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్న సీపీ శ్రీనివాస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ... ఈ 'ముగ్గురు పోలీసులు' ఏర్పాటు చేసిన బందోబస్తు..విధించిన ఆంక్షలు ఫలితాలనిచ్చాయి. కొత్త సంవత్సర స్వాగత వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరిగాయి. మొత్తమ్మీద ఒక్క ప్రమాదం కూడా నమోదు కాకుండా జీరో యాక్సిడెంట్ నైట్‌గా చేయడంలో సిటీ పోలీసులు సఫలీకృతులయ్యారు. నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిస్థితిని పర్యవేక్షించారు. స్థానిక పోలీసులతో పాటు అదనపు బలగాలూ ఆదివారం రాత్రంతా విధుల్లోనే ఉన్నాయి. నగరంలోని కీలక ప్రాంతాలతో పాటు ఇన్నర్/ఔటర్ రింగ్ రోడ్‌ల్లోనూ నిరంతరం ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు. వేడుకలు నిర్వహించే, జరుపుకునే వారు సైతం ఇతరులకు ఇబ్బందులు కలుగజేయకుండా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ విభాగాల అధికారులు మద్యం తాగి వాహనాలు నడపడం, దురుసుగా డ్రైవింగ్ చేయడం, మితిమీరిన వేగం, పరిమితికి మించి వాహనాలపై ప్రయాణించడం తదితర ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించారు. మొత్తమ్మీద మూడు కమిషనరేట్లలోనూ కలిపి 3001 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. గతంలో జరిగిన ప్రమాదాలు, ఘటనల్ని దృష్టిలో పెట్టుకున్న పోలీసులు ముందు జాగ్రత్త దాదాపు అన్ని ఫ్లైఓవర్లను బంద్ చేశారు. ప్రత్యామ్నాయ మార్గం లేని కారణంగా బేగంపేట, డబీర్‌పుర వంటి కొన్ని ఫ్లైఓవర్‌కు మాత్రమే మినహాయింపునిచ్చారు. నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్ మార్గ్‌లతో పాటు హుస్సేన్‌సాగర్ చుట్టుపక్కన వాహనాలు అనుమతించలేదు. పీవీ నర్సింహ్మరావు ఎక్స్‌ప్రెస్ వేలోనూ కొన్ని ఆంక్షలు కొనసాగాయి. కమిషనరేట్లలోని ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు వాహనచోదకుల వేగాన్ని నియంత్రించారు. పోలీసులు, ట్రాఫిక్ విభాగం అధికారులు తీసుకున్న చర్యల ఫలితంగా డిసెంబర్ 31 ప్రశాంతంగా పూర్తయింది. సోమవారం తెల్లవారుజాము 2 గంటల తరవాత ఫ్లైఓవర్లు, 3 గంటలకు ట్యాంక్‌బండ్, 5 గంటలకు నెక్లెస్‌రోడ్‌ల్లో సాధారణ ట్రాఫిక్‌ను అనుమతించారు. నూతన సంవత్సర వేడుకలతో ఐటీ కారిడార్ హోరెత్తింది. పదుల సంఖ్యలో ఈవెంట్లు నిర్వహించడంతో వేల సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు.

తాగేశారు... తోలేశారు!

పోలీసు విభాగం ఎన్ని సూచనలు చేసినా..ఎంతగా హెచ్చరించినా... మందుబాబులు మాత్రం మారలేదు. డిసెంబర్ 31 నేపథ్యంలో ఆదివారం రాత్రి మద్యం తాగి అనేక మంది వాహనాలు నడిపేశారు. ఈ నేపథ్యంలో మూడు కమిషనరేట్లలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 3001 కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా హైదరాబాద్ కమిషరేట్ పరిధిలోనే 1243 మంది చిక్కారు. సైబరాబాద్‌లో 1241 మంది, రాచకొండలో 517 మంది పట్టుబడ్డారు. వీరిలో ద్విచక్ర వాహనచోదకులే ఎక్కువ మంది ఉన్నారు. ఆదివారం రాత్రి 9 నుంచి సోమవారం తెల్లవారుజాము 4 గంటల వరకు చెకింగ్స్ నడిచాయి. చిక్కిన మందుబాబుల నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరికి కుటుంబం సభ్యుడు లేదా సంరక్షకుడి సమక్షంలో మంగళ–బుధవారాల్లో ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఆపై వీరిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. పట్టుబడిన మొత్తం 3001 మందిలో నలుగురు మహిళలు ఉండగా వీరు హైదరాబాద్, సైబరాబాద్‌ల్లో ఇద్దరు చొప్పున చిక్కారు. నగరంలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు (నల్లకుంట, మలక్‌పేటల్లో), 13 మంది మైనర్లు సైతం చిక్కారు.



డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ చిక్కిన మందుబాబుల గణాంకాలు ఇలా... వాహనాల వారీగా...

ద్విచక్ర వాహనచోదకులు	త్రిచక్ర వాహనదారులు	తేలికపాటి వాహనాలు	భారీ వాహన చోదకులు
2435	73	486	7

పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు
2995	4	2

18 ఏళ్లలోపు వారు	60 ఏళ్లు పైబడినవారు	మిగిలిన వయస్కులు
13	19	2969

కిక్కెక్కించారు..

- 4.5 లక్షల కేసుల లిక్కర్...
- 1.17 లక్షల కేసుల బీర్ల విక్రయాలు



సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సరం సందర్భంగా గ్రేటర్‌లో మద్యం ఏరులై పారింది. పబ్బులు, క్లబ్బులు, బార్‌లు, న్యూఈయర్ ఈవెంట్‌లలో లిక్కర్ భారీ కిక్కునిచ్చింది. మందేసి, చిందేస్తూ కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. ఎక్సైజ్‌శాఖ లెక్కల ప్రకారం డిసెంబర్ 29 నుంచి 31 వరకు తెలంగాణ అంతటా సుమారు రూ.650 కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే ఒక్క గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లోనే రూ.450 కోట్లకు మద్యం విక్రయించినట్లు అంచనా. మరోవైపు గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో రంగారెడ్డి మొదటి స్థానంలో ఉంది. 70 శాతానికి పైగా మద్యం అమ్మకాలు ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నట్లు అంచనా.సుమారు 4.5 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడైంది. మరో 1.17 లక్షల కేసులకు పైగా బీర్ల విక్రయాలు జరిగాయి. 31వ తేదీ కంటే డిసెంబర్ 30న మద్యం ఎక్కువ అమ్ముడైనట్లు అధికారులు అంచనా వేశారు.



ఎన్టీఆర్ గార్డెన్స్‌లో కిక్కిరిసిన సందర్శకులు



చిలుకూరు బాలాజీ టెంపుల్ వద్ద రద్దీ..

'కొత్త' బాటలో బల్దియా!

ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనులు ● నిధులొస్తే ఎస్సార్‌డీపీ రెండో దశ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో కొత్త సంవత్సరంలో జీహెచ్‌ఎంసీలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. గత సంవత్సరం నవంబర్ వరకు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ స్థానే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటో ఇంకా వెల్లడికాలేదు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన మునిసిపల్ పరిపాలన శాఖను స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుండటంతో ఆయన అంచనాలు, ప్రాధాన్యతల కనుగుణంగా పనులు చేయనున్నారు.ముఖ్యంగా ప్రజలకు ఇబ్బందుల్లేకుండా వివిధ సేవలందాలని భావిస్తున్న సీఎం..పౌరసేవలు మెరుగుపరచడం, ఫిర్యాదుల పరిష్కారం వంటివాటికి ప్రాధాన్యం ఇస్తారని చెబుతున్నారు. అందుకనుగుణంగా సిటిజెన్ చార్టర్‌ను అమలు చేసే పరిస్థితులొస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాజెక్టులిలా..

ఇక వివిధ ప్రాజెక్టుల పనులు కొనసాగిస్తారా..లేక కొత్తవి తెరపైకి వస్తాయా అనే చర్చ జరుగుతున్నప్పటికీ, ఇప్పటికే పనులు మొదలై పురోగతిలో ఉన్న వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. కొత్తవాటిపైనే వేచి చూస్తున్నారు. అంతేకాదు..టెండర్లు పూర్తయిన పనుల్నీ చేపట్టనున్నారు. వరదముంపు నివారణలో భాగంగా మూసీపై బ్రిడ్జి పనుల్ని వర్షాకాలంలోగా పూర్తి చేయాల్సి ఉండటంతో ఆ పనులు చేయనున్నారు. ఇప్పటికే మూసారాంబాగ్ వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. అత్తాపూర్, ఫతుల్లాగూడ, సన్‌సిటీ వద్ద కూడా పనులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఫలానా పనులొద్దనే ఆదేశాలు వస్తే తప్ప..పనులు యధావిధిగా చేస్తామని అధికారులు చెబుతున్నారు.

నిధుల కోసం 'రెండో దశ' నిరీక్షణ

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం(ఎస్సార్‌డీపీ) కింద వివిధ ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఆర్‌యూబీలు తదితరమైన వాటి కోసం రూ.4,305 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే అనుమతుల కోసం పంపించారు. వాటికి నిధులు మాత్రం జీహెచ్‌ఎంసీ వద్ద లేవు. ఎస్సార్‌డీపీ మొదటి దశ పథకానికి తీసుకున్న అప్పులతోనే జీహెచ్‌ఎంసీ ఖజానా ఖాళీగా ఉంటోంది. అప్పుల చెల్లింపుల వల్ల నెలనెలా జీతాలకే నానా తిప్పలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులిస్తే తప్ప ఆ పనులు చేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి..జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తే కానీ ఈ పనుల భవిష్యత్ వెల్లడి కాదు.

రెండో దశ పనుల్లో..

ఎస్సార్‌డీపీ రెండో దశ పనుల్లో విప్రో జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ (రూ.106 కోట్లు), కూకట్‌పల్లి వై జంక్షన్‌వద్ద అమీర్‌పేట, మియాపూర్‌లవైపు వెళ్లే ఫ్లై ఓవర్లు (రూ.180కోట్లు) నిర్మించాలి. అలాగే రేతిబౌలి, నానల్‌నగర్‌ల వద్ద మల్టీ లెవెల్ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ (రూ.250 కోట్లు), ఈసీఐఎల్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్(రూ.165 కోట్లు), రాధికా జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్(రూ.150 కోట్లు), పాతబస్తీలో ఒమర్ హోటల్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్(రూ.170 కోట్లు), బండ్లగూడ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్(రూ.105 కోట్లు), బెంగళూర్ హైవే–శాస్త్రిపురం జంక్షన్, శాస్త్రిపురం జంక్షన్– ఇంజ్‌బౌలి రహదారుల విస్తరణలు(రూ.400 కోట్లు) తదితరమైనవి ఉన్నాయి.



మూసారంబాగ్ వద్ద వంతెన పనులు (ఫైల్)

140 మందికి పోలీసు సేవా పతకాలు



సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో రాష్ట్ర పోలీసు విభాగంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి పతకాలను ప్రకటిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు చెందిన 140 మందికి ఇవి లభించాయి. రాచకొండలో ఇద్దరు, సిటీలో ఒకరు, సైబరాబాద్‌లో ఒకరికి మహోన్నత సేవా పతకాలు, రాచకొండలో ఆరుగురు, హైదరాబాద్‌లో ఏడుగురు, సైబరాబాద్‌లో 19 మందికి ఉత్తమ సేవా పతకాలు, రాచకొండలో 32, హైదరాబాద్‌లో 30, సైబరాబాద్‌లో 55 మందికి కఠిన సేవా పతకాలు లభించాయి.

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దేశంలోని పోలీస్‌స్టేషన్లను పలు అంశాల్లో ప్రామాణికంగా తీసుకొని జాతీయ స్థాయిలో ర్యాంకింగ్‌ను అందిస్తుంది. ఇప్పటికే రెండు దఫాలుగా కేంద్ర బృందం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి వివరాలను సేకరించింది. ఈ నెల 5వ తేదీన జైపూర్‌లో నిర్వహించనున్న డీజీపీల సదస్సులో ర్యాంకింగ్‌ను కేంద్రం ప్రకటించనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదివారం ఆహ్వానం అందింది. జాతీయ స్థాయిలో 1–10 ర్యాంకులను ప్రతి సంవత్సరం పోలీస్‌స్టేషన్లకు అందిస్తుంటారు. ఇందులో కేసులను త్వరితగతిన పరిష్కరించడం, స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, స్టేషన్‌కు వచ్చే వారి పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు, కౌన్సిలింగ్, మిస్సింగ్, గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహార తీరు తదితర అన్ని ఈ ప్రామాణికంలో తీసుకొని ర్యాంకింగ్ ఇస్తారని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు. 1–10 ర్యాంకుల్లో స్టేషన్‌కు అవార్డు రానుందని వెల్లడించారు. 5వ తేదీన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ అవార్డును అందిస్తారన్నారు.



'జిమ్'దాబాద్...జనవరి!

అరకొరగా ఆరోగ్యసాధకులతో మాత్రమే కనిపించే సిటీ జిమ్‌లు/ఫిట్నెస్ సెంటర్లు కూడా జనవరి నెలలో నిండిపోతాయి. దీనికి కారణం న్యూ ఇయర్ తీర్మానాలు. వాటి పుణ్యమా అని.. ఈ ఏడాది ఆ ట్రెండ్ మరింత బాగా కనిపిస్తోందని, కరోనా దెబ్బకు కుదేలైన జిమ్స్ యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –సాక్షి, సిటీబ్యూరో

- కొత్త ఏడాది తీర్మానాలతో జన(వరి)ంలో జోష్
- జిమ్‌లు, యోగా సెంటర్లలో మెంబర్‌షిప్స్ రష్...

'జనవరి మొదటి 2–3 రోజులలో చాలా మంది కొత్త క్లయింట్లు సభ్యత్వం తీసుకోవడం ఎప్పుడూ ఉండేదే అయితే ఈ సారి మరింత ఎక్కువగా ఉంది. మా నెలవారీ సభ్యత్వ లక్ష్యాలలో ఇప్పటికే సగం పూర్తి అయిపోయింది కూడా' అంటూ ఆనందం వ్యక్తం చేశారు నగరంలోని ఫిట్నెస్ ఫన్ జిమ్ యజమాని వర్షవ్.

ఆఫర్లు, ప్యాకేజీల జోరు...

సిటిజనుల నూతన సంవత్సర రిజల్యూషన్‌లో ఫిట్‌నెస్‌ను పొందడం అనేది తప్పకుండా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఈ సమయంలో జిమ్‌లు అందించే అనేక ఆఫర్‌లు మెంబర్‌షిప్‌లను విరివిగా ఆకర్షిస్తాయి. 'గత డిసెంబర్ కంటే 47 శాతం ఎక్కువ సభ్యత్వాన్ని ఇప్పటికే అందుకున్నాం' అంటూ మాదాపూర్‌లోని రైడ్ జిమ్ యజమాని తెలిపారు. అయితే కొత్త సంవత్సరం ప్రారంభంలో మాత్రమే కాకుండా జిమ్‌కి కొత్త సంవత్సరపు రద్దీ ఒక నెల కంటే ఎక్కువగా అవకాశం ఉంటుంది 'సంవత్సరంలో తొలి త్రైమాసికం మొత్తం హెల్త్ క్లబ్‌లకు చాలా బిజీగా ఉంటుంది' అని నగరానికి చెందిన ట్రైనర్ అమరేష్ చెప్పారు. సాధారణంగా జిమ్‌లకు జనవరి అత్యంత పీక్ నెల తర్వాత స్థాయిలో వెడ్డింగ్ సీజన్‌కు సిద్ధంగా ఉండాలని అనేకమంది కోరుకుంటుండడంతో సెప్టెంబరు నెలలో రద్దీ కనిపిస్తుంటుంది...



వ్యక్తిగత శిక్షకుల సేవలు, ఆవిరి స్నానం వంటి సౌకర్యాలను జత చేస్తూ అనేక జిమ్‌లు ఆకర్షణీయమైన ప్యాకేజీలను అందిస్తున్నాయి. 'తమ ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించే వారికి క్యాష్‌బ్యాక్ ఆఫర్‌తో కూడిన ప్యాకేజీని అందిస్తున్నాం. ఇది కేవలం జిమ్‌లో ఆరంభ శూరత్వానికి పరిమితం కాకుండా లక్ష్యాలను సాధించేలా చేసేలా ఇది ప్రోత్సహిస్తుంది' అని ఫిట్ అండ్ ఫన్ జిమ్ యజమాని అర్నవ్ చెప్పారు. గోల్డ్ జిమ్ యజమాని సందేశ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జనవరి నెలలో కొత్త సభ్యత్వాల సంఖ్య 35 నుండి 40 శాతం పెరుగుతుంది అని చెప్పారు. 'కొత్త సంవత్సర తీర్మానాలలో హైఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్, జుంబా, యోగా, ఫంక్షనల్ ట్రైనింగ్ వంటి కొత్త వర్కవుట్ విధానాలను కూడా నగరవాసులు ఎంచుకుంటారు' అని సందేశ్ చెప్పారు.

కొత్త ప్ర'యోగా'లకూ సై...

కొత్త సంవత్సరంలో మేలుకునే ఆరోగ్య స్పృహ తాలూకు ప్రభావం కేవలం జిమ్స్‌కు మాత్రమే పరిమితం కావడం లేదు. 'ఫిట్‌గా ఉండాలనే తమ తీర్మానాన్ని నెరవేర్చుకోవాలని చాలా మంది కొత్త సభ్యులు వస్తున్నారు, మధ్యలో మానేసిన వారు కూడా తిరిగి వారు కొత్తగా ప్రారంభించాలని కోరుకుంటున్నారు' అంటూ అష్మయు యోగాకి చెందిన శిక్షకులు నవీన్ శర్మ చెబుతున్నారు.

పట్టు సడలొద్దు..

అయితే సిటిజనుల్లో అత్యధికులు తీర్మానాల అమలులో తడబడుతున్నారు. వారిలో కొత్తలో ఉన్న ఉత్సాహం నీరుగారుతోంది. జనవరిలో చేరిన వారిలో 50 శాతం మంది, ఫిబ్రవరి నాటికి తగ్గుతారు, మరో 20 శాతం మంది మార్చిలో తగ్గిపోతారు. కేవలం 30 శాతం మంది మాత్రమే ఏడాది పొడవునా కొనసాగుతార్షు అని జింపిక్ ఫిట్‌నెస్ కంపెనీ వ్యవస్థాపకుడు అమరేష్ ఓజా చెప్పారు. ఈ పరిస్థితి రాకుండా ఉండడానికి జిమ్ ట్రైనర్లు చేస్తున్న సూచనలు...

- చాలా మంది కొత్త జోష్‌తో వార్షిక ప్యాకేజీల్ని లేదా ఎక్కువ వ్యవధి మెంబర్‌షిప్‌లను ఎంచుకుంటారు. కానీ దాని కన్నా తొలిసారి త్రైమాసిక సభ్యత్వాలకు పరిమితమై తమను తాము అంచనా వేసుకోవడం మంచిది
- కొత్తగా జిమ్‌లో జేరడం వ్యాయామాలకు తగినట్టుగా మన శరీరాన్ని సిద్ధం చేయడం అవసరం. ఆరోగ్య పరిస్థితిని గమనించకుండా చేసుకుంటూ పోతే లక్ష్యాలు సాధించలేరు.
- ఒంటరిగా కన్నా కనీసం మరొకరితో కలిసి వర్కవుట్ చేయడం అలవరచుకుంటూ డుమ్మాలు కొట్టడం తగ్గుతుంది.
- వీలైనంత వరకూ ఇంటికి, పనిచేసే ప్రాంతానికో దగ్గరగా ఉండే వ్యాయామ కేంద్రాలను ఎంచుకుంటే క్రమం తప్పకుండా వెళ్లడానికి వీలవుతుంది.
- తొలినాళ్లలో ట్రైనర్స్, వైద్యులు చెప్పే సూచనలను తూచా తప్పకుండా పాటించడం అవసరం. తొందర పడితే ఒళ్లునొప్పులు, ఇతరత్రా సమస్యలు తీర్మానాన్ని అటకెక్కించే పరిస్థితి తేవచ్చు.



పక్కా ప్రణాళిక ఉండాలి

కొత్త సంవత్సరంలో ఎలాంటి తీర్మానం తీసుకున్నా అది దీర్ఘకాలం కొనసాగించడంలో చాలా మంది విఫలం అవుతారు. అయితే వ్యాయామం ప్రారంభించే ముందే పక్కా ప్రణాళికతో సిద్ధమైతే మధ్యలో వదిలేసే పరిస్థితి రాకపోవచ్చు. ఆరోగ్యానికి సంబంధించిన విషయం కాబట్టి దీనిపై సీరియస్‌గా ఉండడం బెటర్.

– విజయ్ గంధం, ఫిట్‌నెస్ ట్రైనర్



నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఎంజీబీఎస్‌లో ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

- ప్రయాణికులతో కలిసి కేక్ కట్ చేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్
- విజయవంతంగా మహాలక్ష్మి పథకం
- ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు
- ఆర్టీసీ ఎండీ వెల్లడి

సాక్షి,సిటీబ్యూరో: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో కొత్త సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రయాణికులు, సిబ్బందితో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. బస్‌స్టేషన్‌లో ప్రయాణికులతో ముచ్చటించారు. బెంగళూరు, కోదాడకు వెళ్లే బస్సుల్లో ప్రయాణికులను కలిసి గులాబీలు అందజేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది ప్రయాణికుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభించిందన్నారు. కొత్త ఏడాదిలో కూడా సంస్థకు మంచి ఫలితాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 6.60 కోట్లకు పైగా మహిళలు ప్రయాణం చేసినట్లు తెలిపారు.మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో ఆర్టీసీ సిబ్బంది నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ ఉన్నాయన్నారు. ఈ పథకం అమలు తీరుపైన ఇటీవల రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీకి ప్రయాణికులు, సిబ్బంది రెండు కళ్ల వంటివారన్నారు. ఒకవైపు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూనే.. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పెండింగ్ లో ఉన్న 9 డీఏలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే మిగతా బకాయిలను చెల్లిస్తామని, వాటి విషయంలో సిబ్బంది ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. విడతల వారీగా ప్రయాణికులకు కొత్త బస్సులను అందుబాటులోకి వస్తాయన్నారు.



మాట్లాడుతున్న ఎండీ సజ్జనార్

ప్రయాణికులకు సన్మానం

ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ.. సంస్థను ఆదరిస్తున్న వారిని ఎండీ సన్మానించారు. స్వాతి, నారాయణ, మల్లేష్, గోపాల్ రెడ్డి, షాబుద్దీన్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీవోవో డా.రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ముని శేఖర్, కృష్ణకాంత్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప, సీఎంఈ రఘునాథ రావు, సీఈఐటీ రాజశేఖర్, రంగారెడ్డి ఆర్ఎం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

'91 వసంతాల తెలుగు సినిమాకు జేజేలు' వీసీడీ ఆవిష్కరణ



వీసీడీని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

కాచిగూడ: అంతర్జాతీయ తెలుగు సంఘం అధ్యక్షుడు, సంస్కృతి రత్న కె.ధర్మారావు నేతృత్వంలో ఇట్మా ఫిలిం సంస్థ రూపొందించిన '91 వసంతాల తెలుగు సినిమాకు జేజేలు' వీసీడీని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకటయ్య నాయుడు సోమవారం ఆవిష్కరించారు. నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు గేయ రూపక తొలి వీసీడీని అందజేశారు. కార్యక్రమంలో పీవీఎస్ ప్రసాదరావు, పి.కమల ప్రసాదరావు, డాక్టర్ కె.భాస్కరరెడ్డి, డాక్టర్ పి.విజయ్‌కుమార్, ప్రసాద్ సూరపనేని, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క కాల్‌తో స్పందించిన కొత్వాల్!

- గుజరాత్‌లో చిక్కుకున్న నలుగురు తెలుగు వాళ్లు
- మతిస్థిమితం లేక వివరాలు చెప్పలేకపోయిన వైనం
- వెబ్‌సైట్‌లో చూసి కమిషనర్‌కు కాల్ చేసిన ఎన్‌జీఓ
- శ్రీనివాసరెడ్డి చొరవతో క్షేమంగా హైదరాబాద్‌కు





సాక్షి, సిటీబ్యూరో: 2023 డిసెంబర్ 21... ఉదయం 12.30 గంటలు... ఐసీసీసీలోని తన కార్యాలయంలో బిజీగా ఉన్న నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డికి గుజరాత్ నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. తక్షణం స్పందించి ఆయన నగర మహిళ భద్రత విభాగాన్ని రంగంలోకి దింపారు. పది రోజులు శ్రమించిన అధికారులు డిసెంబర్ 31 న అక్కడి ఓ ఆశ్రమంలో దిక్కుతోచని స్థితిలో ఉన్న నలుగురు అభాగ్యులను నగరానికి తీసుకువచ్చారు.

వివరాలు చెప్పలేక, ఆహారం తినలేక...

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐశ్వర్య (55), గోపు లక్ష్మి (48), స్వీటీ (41), నూరాలకు (45) మతిస్థిమితం సరిగా లేదు. వీరు కొన్నాళ్లు అక్కడక్కడ రోడ్లపై సంచరిస్తూ చివరకు గుజరాత్ చేరారు. అక్కడ కచర్‌భుజ్ ప్రాంతంలో దిక్కుతోచని స్థితిలో సంచరిస్తున్న వీరిని గుర్తించిన మానవ్ జ్యోత్ అనే స్వచ్ఛంద సంస్థ చేరదీసింది. తమ ఆశ్రమంలో ఉంచి ప్రాథమిక చికిత్స చేయించింది. తమ పేర్లు మినహా ఇతర వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్న వారు అక్కడి ఆహారాన్నీ సరిగ్గా తీసుకోలేకపోయారు. ఫలితంగా నానాటికీ నీరసించిపోవడంతో పాటు అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో వీరిని ఎలాగైనా తమ వారి దగ్గరకు చేర్చాలని మానవ్ జ్యోత్ సంస్థ ప్రతినిధులు భావించారు. ఏమాత్రం ఆలస్యమైనా వారు నీరసించి, మరింత అనారోగ్యం పాలవుతాయని అప్రమత్తమయ్యారు.

భాషను గుర్తించి, వెబ్‌సైట్‌లో చూసి...

ఈ నలుగురూ ఎలాంటి వివరాలు చెప్పలేకపోయినప్పటికీ వీరు మాట్లాడుతున్నది తెలుగు భాషగా సదరు సంస్థ నిర్వాహకులు గుర్తించారు. హైదరాబాద్ పోలీసులను సంప్రదిస్తే వీరికి సహాయం లభిస్తుందని భావించారు. వెంటనే సిటీ పోలీసు అధికారిక వెబ్‌సైట్ నుంచి కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఫోన్ నెంబర్ సేకరించారు. గత నెల 21 ఉదయం ఆయనకు కాల్ చేసిన ఎన్‌జీఓ ప్రతినిధులు విషయం చెప్పారు. తన దైనందిన విధుల్లో బిజీగా ఉన్నప్పటికీ శ్రీనివాసరెడ్డి దీనిని తేలిగ్గా తీసుకోలేదు. ఎన్‌జీఓ ప్రతినిధి చెప్పిన ప్రతి అంశాన్నీ విని అక్కడ ఉన్న నలుగురి స్థితిని అర్థం చేసుకున్నారు. ఆ స్వచ్ఛంద సంస్థతో సంప్రదింపులు జరిపి, ఆ అభాగ్యులను సురక్షితంగా నగరానికి చేర్చే బాధ్యతల్ని సిటీ ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు.

అక్కడికి వెళ్లి తీసుకొచ్చిన స్పెషల్ టీమ్...

మానవత్వంతో స్పందించి కొత్వాల్ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడానికి అదనపు సీపీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో డీసీపీ డి.కవిత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గుజరాత్‌లోని మానవ్ జ్యోత్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. నగరం నుంచి ఓ ప్రత్యేక బృందాన్ని గుజరాత్ పంపారు. వీరు ఆదివారం ఆ నలుగురినీ తీసుకుని హైదరాబాద్ తిరిగి వచ్చారు. వీరి ఆలనా పాలన చూడటంతో పాటు వైద్యం చేయించడానికి ముందుకు వచ్చిన సయోధ్యా హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ అనే స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. వీరిలో ఐశ్వర్య తెలంగాణకు చెందిన మహిళ కాగా, మిగిలిన ముగ్గురూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారని నగర మహిళ భద్రత విభాగం ప్రాథమికంగా గుర్తించింది. వీరి సంబంధీకులను గుర్తిస్తామని, వీలైనంత త్వరలో వారి చెంతకు చేరుస్తామని కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

మహిళా డ్రగ్ పెడ్లర్ అరెస్ట్

- పోలీసుల అదుపులో మరో నలుగురు విద్యార్థులు
- 8 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

చాదర్‌ఘాట్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని డ్రగ్స్ విక్రయిస్తున్న మహిళా పెడ్లర్ సహా ఐదుగురు వ్యక్తులను సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్. చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెడ్లర్ నుంచి 8 గ్రాముల ఎండీఎంఏ (అంఫెటమిన్) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చాదర్‌ఘాట్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ వివరాలు వెల్లడించారు. సంతోష్‌నగర్ కాలనీకి చెందిన అయేషా ఫిర్దోస్ ముంబైలో డ్రగ్స్ కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చి అవసరమైన వారికి సరఫరా చేసేది. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ముంబై వెళ్లిన ఆమె 8 గ్రాముల ఎండీఎంఏ (అంఫెటమిన్) డ్రగ్‌ను తీసుకు వచ్చింది. సైదాబాద్‌కు చెందిన నలుగురు విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయించేందుకు సోమవారం నల్గొండ చౌరస్తా వద్ద తచ్చాడుతుంది. దీనిపై సమాచారం అందడంతో సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 8 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో సైదాబాద్‌కు చెందిన విద్యార్థులు కిజారుద్దీన్ అనాస్, మహ్మద్ అర్బాన్, అయాజ్‌ఖాన్, షాబాజ్ షరీఫ్‌లను సైతం అరెస్ట్ చేశారు. సమావేశంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ వై.ప్రకాష్‌రెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నాగోలు: రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత సంవత్సరం లో ప్రజలకు మెరుగైన సేవలు అందించామని, 2024లోనూ మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఆదివారం రాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నాగోల్ చౌరస్తాలో పోలీస్ సిబ్బందితో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్న రాచకొండ పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ భీమ్‌రెడ్డి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారురు. ఈ సందర్భంగా సీపీ పలు ప్రాంతాల్లో పర్యటించి తనిఖీలను పరిశీలించారు.



న్యూ ఇయర్ వేడుకలు

నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు చార్మినార్ వద్ద ఆదివారం అర్ధరాత్రి కేక్ కట్ చేసి నూతన సంవత్సర సంబరాల్లో పాల్గొన్నారు. – చార్మినార్


ఆరు పబ్‌లపై కేసులు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరు పబ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. లైసెన్స్ అనుమతులు లేకుండా నడుపుతున్న రోడ్ నెంబర్ 45లోని హాలో, రోడ్ నెంబర్–10లోని తారో సబ్‌లతో పాటు శబ్ద కాలుష్యానికి పాల్పడినందుకు గాను రోడ్డునెంబర్–37లోని మాకో, రోడ్ నెంబర్–36లోని క్సేనా పబ్‌లపై కేసులు నమోదు చేశారు. వీటిలో నిర్ణీత సమయం దాటినప్పటికీ పబ్ నిర్వహిస్తున్న గ్రీన్‌మంకీ, లుఫ్ట్ పబ్‌లపై కూడా కేసులు నమోదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

భాగ్యనగర్‌కాలనీ: మద్యం మత్తులో కారు నడుపుతున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేములవాడ మాల్యాల గ్రామానికి చెందిన నేదూరి అరుణ్‌కుమార్ (33) మోతీనగర్‌లో నివాసం ఉంటూ పాలు విక్రయించే ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం మియాపూర్ వెళుతుండగా మియాపూర్ లింక్ రోడ్డులో మద్యం మత్తులో కారు నడుపుతున్న మిత్రహిల్స్‌కు చెందిన ముత్యాల దినేష్ డివైడర్‌ను కొట్టడంతో కారు అదుపుతప్పి అరుణ్‌కుమార్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన దినేష్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం తాగినట్లుగా గుర్తించి అతడిపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.



అరుణ్‌కుమార్(ఫైల్)

బైక్ ఢీకొని మరొకరు...

బాలానగర్: బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయినగర్‌కు చెందిన కె. దుర్గయ్య (58) అమీర్‌పేటలో హౌస్ కీపింగ్ పనిచేసేవాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా మెజెస్టిక్ గార్డెన్ ముందు వేగంగా వచ్చిన బైక్ అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దుర్గయ్య ను హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు ప్రమాదానికి కారణమైన మల్లికార్జున్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతను ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు. దుర్గయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని మరొకరు..

ఉప్పల్: రెండు బైక్‌లు ఎదురుఎదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాసబ్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన కుమార స్వామి (45) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి రామంతాపూర్‌లోని స్నేహితుడు వద్దకు వచ్చిన అతను అర్ధరాత్రి ఇంటికి తిరిగి వెళ్లేందుకు బయలుదేరాడు. అదే సమయంలో రామంతాపూర్ డీమార్ట్ వద్ద బైక్‌పై ఎదురుగా వచ్చిన జగిత్యాలకు చెందిన రోహన్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కుమారస్వామి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బిర్యానీ విషయంలో గొడవ

- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- అబిడ్స్ గ్రాండ్ హోటల్ వెయిటర్లు, యజమానిపై కేసు నమోదు
- పోలీసుల అదుపులో 10 మంది నిందితులు

అబిడ్స్: బిర్యానీ విషయంలో చోటు చేసుకున్న వాగ్వాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అబిడ్స్ గ్రాండ్ హోటల్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..నూతన సంవత్సరం సందర్భంగా ధూల్‌పేట్ గంగాబౌలికి చెందిన ఎనిమిది మంది ఆదివారం రాత్రి అబిడ్స్ గ్రాండ్ హోటల్‌కు వచ్చారు. మటన్ బిర్యానీతో పాటు పలు రకాల వంటకాలను ఆర్డర్ చేశారు. వెయిటర్స్ మటన్ బిర్యానీ తీసుకురాగా అది సరిగ్గా ఉడకలేదని, చల్లగా ఉందని వారు వాపస్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వెయిటర్లు అదే బిర్యానీని వేడి చేసుకుని తీసుకువచ్చారు. దీంతో వారు బిర్యానీతో ఇతర వంటకాలను తిన్నారు. అయితే మటన్ బిర్యానీ మాత్రం తాము డబ్బులు చెల్లించమని, మటన్ ఉడకనప్పుడు ఎందుకు చెల్లించాలని వెయిటర్స్‌ను నిలదీశారు. మిగతా పైసలు చెల్లిస్తామని, మటన్ బిర్యానీ డబ్బులు మాత్రం చెల్లించేది లేదని భీష్మించారు. దీంతో వెయిటర్స్, ధూల్‌పేట్ వాసుల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీయడంతో వెయిటర్స్ కర్రలు, కుర్చీలతో వారిపై దాడి చేశారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రాండ్ హోటల్ వెయిటర్స్ దాడి చేస్తున్న సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: రాజాసింగ్

ఈ విషయమై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ హోటల్ యాజమాన్యంపై, వెయిటర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు వెంటనే హోటల్ యజమానితో పాటు వెయిటర్స్‌ను అరెస్టు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. హోటల్‌కు వచ్చిన కస్టమర్లపై దాడులు చేయడం దారుణమన్నారు. పోలీసులు వెంటనే హోటల్‌ను మూసివేయని పక్షంలో తానే రంగంలోకి దిగాల్సి వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరికలు జారీ చేశారు. హోటల్‌కు వచ్చిన వారిలో మహిళలు కూడా ఉన్నారని వారిపై కూడా వెయిటర్స్ దాడి చేయడం దారుణమన్నారు.

పోలీసుల అదుపులో 10 మంది వెయిటర్స్.

ధూల్‌పేట వాసులపై దాడులకు దిగిన 10 మంది వెయిటర్స్‌ను అబిడ్స్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజును వివరణ కోరగా హోటల్ యజమానితో పాటు వెయిటర్స్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుడు సుమిత్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హోటల్ యజమానితో పాటు వెయిటర్స్‌పై కూడా కేసులు నమోదు చేశామన్నారు. ముందు జాగ్రత చర్యగా హోటల్‌ను మూసివేశామన్నారు. దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు.

నిలిచిపోయిన ఆయిల్ ట్యాంకర్లు..

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ట్యాంకర్ డ్రైవర్ల నిరసన
- వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్
- కేంద్రం దిగివచ్చే వరకు ఆందోళన విరమించం



చర్లపల్లిలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ట్యాంకర్లు

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు రూ. 10 లక్షల జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధించాలంటూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాన్ని నిరసిస్తూ సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఆయిల్ కంపెనీల ఎదుట ట్యాంకర్ డ్రైవర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ ట్యాంకర్ల డ్రైవర్లు ట్యాంకర్లను నిలిపివేసి ఆందోళన బాట పట్టడంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలు పూర్తిగా నిలిచిపోయాయి. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2016లో పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టింది. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో డ్రైవర్లు బాధితులను ఆసుపత్రిలో చేర్పి, స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే సాధారణ శిక్ష ఉంటుందని, ప్రమాదం జరిగినప్పుడు ఎవరైనా మరణిస్తే బాధితులను, వాహనాన్ని వదిలి పారిపోయే డ్రైవర్లకు రూ. 10 లక్షల జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధించాలంటూ బిల్లు ప్రవేశపెట్టింది. ఇటీవల అమలులోకి వచ్చిన ఈ చట్టాన్ని నిరసిస్తూ భారీ వాహనాల డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా పలు యూనియన్ల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రమాదాలు ఆకస్మాత్తుగా చోటు చేసుకునేవని, ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా ఉంటాయని, ఆ సమయంలో తమ ప్రాణాలకు కూడా రక్షణ ఉండదని, గత్యంతరం లేని పరిస్థితుల్లోనే డ్రైవర్లు పరారవుతారన్నారు. చాలీ చాలని జీతాలతో కుటుంబ పోషణే బారమైన డ్రైవర్లు రూ. 10 లక్షల జరిమానా చెల్లించడం ఎలా సాధ్యమో పాలకులే చెప్పాలన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే డ్రైవర్లు వాహనాలు నడపలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం డ్రైవర్ల పాలిట శాపంగా మారిన ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ల ప్రతినిధులు నవీన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, శ్రీను, చెన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, డి. మల్లేష్, మహేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి బీపీసీఎల్ ఎదుట ఆందోళన చేస్తున్న ట్యాంకర్ల డ్రైవర్లు

సంస్థ అభివృద్ధికి సమష్టిగా పని చేద్దాం

తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకీ

లక్డీకాపూల్ : నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అందరూ కలిసి కట్టుగా పని చేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూకీ అన్నారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలువురు అధికారులు, యూనియన్, అసోసియేషన్ సంఘాల నాయకులు సీఎండీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ పంపిణీపై అధికారులు, ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. సీఎండీని కలిసిన వారిలో సంస్థ డైరెక్టర్లు టి. శ్రీనివాస్, కె. రాములు, సీహెచ్. మదన్ మోహన్ రావు, జి పర్వతం, ఎస్. స్వామి రెడ్డిలతో పాటు సీజీఎంలు, ఎస్.ఈలు, పలువురు యూనియన్, అసోసియేషన్ సంఘాల నాయకులు ఉన్నారు.



విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సంస్థ డైరెక్టర్లు, యూనియన్ నేతలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో...



పారిశుధ్య కార్మికులతో రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: నూతన సంవత్సర వేడుకలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్ నగర్, బోరబండ తదితర ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తన కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజహరుద్దీన్‌ను తన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మశంకర్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆలయ కమిటీ రూపొందించిన కేలండర్‌ను ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓర్సు అడవయ్య, బస్తీ అధ్యక్షుడు వసంత్‌కుమార్ బస్తీవాసులతో కలిసి ఆవిష్కరించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని పెనుయేలు గాస్పెల్ మినిస్ట్రీస్, రహమత్‌నగర్ సీఎస్ఐ, బాప్టిస్ట్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేలండర్లను ఆవిష్కరించారు.

కేబీఆర్ పార్కు వద్ద కొత్వాల్...



బంజారాహిల్స్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేబీఆర్ పార్కు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి పోలీసు అధికారులకు, సిబ్బందికి, నగర పౌరులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరి ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.

బంజారాహిల్స్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో దర్శనాల కోసం భక్తులు బారులుదీరారు. పెద్ద సంఖ్యలో వచ్చేసిన భక్తజన సందోహంతో ఆలయ ప్రాంగణాలతో పాటు పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భారీగా భక్తులు విచ్చేయడంతో ఆలయ వర్గాలు లఘు దర్శనం ఏర్పాటు చేశాయి. అమ్మవారిని నూతన సంవత్సరం సందర్భంగా సుమారు 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.



టీటీడీ దేవాలయంలో...

జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్వామివారిని సుమారుగా 60 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. టీటీడీ టెంపుల్ భక్త జనసందోహంతో కిటకిటలాడాయి. పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మికతతో వెల్లివిరిశాయి.

జగన్నాథ టెంపుల్‌లో...

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని జగన్నాథ టెంపుల్‌కు ఒరిస్సా వాసులతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఎటుచూసినా భక్తజనసందోహమే కనిపించింది. ఇదిలా ఉండగా శ్రీనగర్‌కాలనీ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు విచ్చేశారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులుదీరారు. వేలాదిగా విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.
- పంజగుట్ట ద్వారకాపురి కాలనీలో కొలువుదీరిన శ్రీ సాయిబాబా దర్శనానికి భక్తులు భారీగా విచ్చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 1/12 చౌరస్తాలో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి దర్శనం కోసం భక్తులు భారీగా విచ్చేసి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.
- ఫిలింనగర్ దైవ సన్నిధానంలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ అయ్యప్ప స్వామి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–17లోని శ్రీసీతారామస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

బంజారాహిల్స్: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు ఏసు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. బంజారాహిల్స్‌లోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్లు ప్రభుదాస్, ఏసుదాస్, డేవిడ్, కమిటీ సభ్యులు ప్రమీల, జయ, గంధం లక్ష్మీ, సరళ, నీలిమ, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు వారు న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేశారు.



జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తుల రద్దీ



టీటీడీ శ్రీవారి ఆలయంలో..



జగన్నాథ స్వామి ఆలయంలో...



షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో..

సీఎంకు శుభాకాంక్షలు



శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత కిరణ్‌యాదవ్ సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ మంత్రి జానారెడ్డికి శుభాకాంక్షలు



బంజారాహిల్స్: మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కుందూరు జానారెడ్డిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఐదేళ్లల్లో సుపరిపాలన దిశగా అమలు చేయాల్సిన అంశాలపై ఈ సందర్భంగా చర్చించామని వెంకటేశ్వర్లు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలను అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను జోడెండ్ల బండి లాగా కొనసాగించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

సజ్జల రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు



రమమత్‌నగర్: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని సోమవారం వైఎస్సార్ సీపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రఫుల్లా రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గౌస్‌ఖాన్



బంజారాహిల్స్: పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గౌస్‌ఖాన్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గౌస్‌ఖాన్ సోమవారం పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన సౌత్ జోన్ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణలో సమర్థుడిగా పేరున్న గౌస్‌ఖాన్‌ను కీలకమైన, రద్దీగా ఉండే పంజగుట్ట ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.

నవనీత శోభితుడైన విజయగణపతి



వెన్న అలంకణలో దర్శమిస్తున్న విజయగణపతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన శ్రీ విజయగణపతి స్వామిని నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వెన్నతో అలంకరించారు. సర్వాంగ సుందరంగా నవనీత అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి భారీ సంఖ్యలో విచ్చేశారు. ఇందులో భాగంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

మనువాద మాఫియా రాజకీయాలను ఓడించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో పాల్గొన్న నాయకులు

లిబర్టీ: మహర్ రెజిమెంట్ వీరుల పోరాట స్ఫూర్తితో మనువాద మాఫియా రాజకీయాలను ఓడించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాజానికి పిలుపునిచ్చారు. సోమవారం భీమా కోరేగావ్ మహర్ రెజిమెంట్ శౌర్య దివాస్ 206 విజయోత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన పార్టీ కార్యకర్తలు నిర్వహించిన ప్రదర్శనలో కృష్ణ స్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు, పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్‌కుమార్, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటికాల గణేష్, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బుంగా జయరాజు, నాయకులు సి.హెచ్.కరుణాకర్, ఎన్.రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

బోరబండలో ముమ్మర తనిఖీలు

రహమత్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి బోరబండ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. నెంబర్ ప్లేట్, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి, పిట్టీ కేసులు పెట్టి వాహనాలను తిరిగి అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ విజయ్ మాట్లాడుతూ... వాహనదారులు నెంబర్ ప్లేట్, లైసెన్స్, ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్, సెక్టార్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మళ్లీ ప్రజాపాలన

- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–7లోని ప్రజాపాలన కేంద్రం

బంజారాహిల్స్: రెండు రోజుల సెలవుల అనంతరం ప్రజాపాలన కేంద్రాలు తిరిగి మంగళవారం తెరుచుకోనున్నాయి. ప్రజలు తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో తమ సమస్యలతో కూడిన తమకు కావలసిన అభ్యర్థనలతో అభయహస్తం దరఖాస్తులను అందించవచ్చని అధికారులు తెలిపారు. భారీ సంఖ్యలో ప్రజలు కేంద్రాలకు విచ్చేస్తుండడంతో అన్ని కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేసినట్లు జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంత్ తెలిపారు. తమ సమస్యలను తెల్ల కాగితంపై రాసిచ్చినా సంబంధిత సిబ్బంది తీసుకుంటారని, అభయహస్తం దరఖాస్తుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, వీటిని పూర్తిగా ఉచితంగా కేంద్రాల వద్ద సిబ్బంది అందజేస్తారని తెలిపారు.

ప్రజాపాలన కేంద్రాలివే...

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 సీఎంటీసీ బిల్డింగ్‌లో ఎన్‌టీటీనగర్ బస్తీవాసులకు..
- బంజారాహిల్స్‌రోడ్డు నెంబర్–13 నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఉదయ్‌నగర్ బస్తీవాసులకు..
- ఎస్‌బీనగర్ కమ్యూనిటీహాల్‌లో శ్రీరామ్‌నగర్ బస్తీవాసులకు..
- ప్రేమ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో భోళానగర్ బస్తీవాసులకు..
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్–7 మీ–సేవా వార్డు కార్యాలయంలో సుఖ్‌దేవ్‌నగర్ బస్తీవాసులకు..
- ఇబ్రహీంనగర్ కమ్యూనిటీ హాల్‌లో గ్రీన్‌వ్యాలీ కాలనీవాసులకు..
- ప్రతాప్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో దోభీఘాట్ పంజగుట్ట వాసులకు..
- గౌరీశంకర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సింగాడబస్తీవాసులకు..
- జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయంలో గాయత్రీ హిల్స్ కాలనీవాసులకు..
- ఫిల్మ్‌నగర్ భగత్‌సింగ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఫిలింనగర్ స్వామి వివేకానంద బస్తీవాసులకు..
- జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో దుర్గాభవానీ నగర్ బస్తీవాసులకు..
- గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో వినాయకనగర్ బస్తీవాసులకు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 191 మంది మందుబాబుల పట్టివేత



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యాలు

బంజారాహిల్స్: నూతన సవత్సర వేడుకల సందర్భంగా అతిగా మద్యం సేవించి అర్ధరాత్రి వాహనాలు నడుపుతూ వెస్ట్ జోన్ పరిధిలో 191 మంది మందుబాబులు పట్టుబడ్డారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు పార్క్ హయత్ హోటల్, స్టడీ సర్కిల్ మధ్య నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 31 మంది పట్టుబడ్డారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డైమండ్ హౌస్, విజేత సూపర్ మార్కెట్‌ల వద్ద నిర్వహించిన తనిఖీల్లో మోతాదుకు మించి మద్యం సేవించి 59 వాహనదారులు పట్టుబడ్డారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 51 మంది, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 50 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వీరందరిపై కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానం ఉన్న వారిని అక్కడే ఉన్న లా అండ్ ఆర్డర్ పోలీసులతో ఉమ్మి, యూరిన్ టెస్టులు చేయించి డ్రగ్స్ ఆనవాళ్లను గుర్తించే ప్రయత్నం చేశారు. అయితే డ్రగ్స్ తీసుకున్నట్లుగా ఏ ఒక్క వాహనదారుడు పట్టుబడలేదు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 3లోని పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బోనా వెకెన్షియా స్థలంలో జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టడమేగాక వైన్స్ షాపుతో పాటు జనతాబార్ కొనసాగుతోంది. ఇందుకు కారకులైన ఉపేందర్ రెడ్డి అనే వ్యక్తిపై షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఈ స్థల కబ్జా, అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయినా అతను ఏమాత్రం తగ్గకుండా రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన వైన్స్‌షాపును అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులతో ఆదివారమే తిరిగి తెరిపించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ 18 టౌన్‌ప్లానింగ్ అధికారులకు రూ. 10 లక్షలు లంచం ఇచ్చి ఈ ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ అధికారికి తెలిసే రెండు నెలలుగా ఈ షెడ్ల నిర్మాణం జరిగిందని పలువరు ఆరోపిస్తున్నారు. దీనిపై షేక్‌పేట మండల తహసీల్దార్ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ. 7 కోట్ల విలువచేసే ఈ బోనా వెకెన్షియా (అన్‌క్లెయిమ్డ్ ప్రాపర్టీ) 2185 గజాలు ఉంది. స్టేటస్కో పాటించాలని కోర్టు చెప్పిన తర్వాత కూడా ఉపేందర్‌రెడ్డి ఇక్కడ దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టి చైతన్యరెడ్డి అనే మద్యం వ్యాపారికి జనతా బార్‌కు లీజుకు ఇచ్చారు. అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులు అడ్డదారులు తొక్కి సీజ్ చేసిన వైన్స్ షాపును నిబంధనలు ఉల్లంఘించి తెరిపించారు. కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోగా లక్షలాది రూపాయలు లంచాలు తీసుకుని జీహెచ్ఎంసీ అక్రమ నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా ఎక్సైజ్ పోలీసులు దర్జాగా మద్యం షాపునకు అనుమతిచ్చారు. ఈ వ్యవహారంపై ఆరా తీసిన ఉన్నతాధికారులు ఉపేందర్‌రెడ్డిపై చర్యలకు సిద్ధం అవుతున్నారు. ఈ మొత్తం ప్రాపర్టీని సీజ్ చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులు ఆలోచిస్తున్నారు.



ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్‌లో ఏర్పాటు చేసిన వైన్స్

కేటీఆర్‌కు శుభాకాంక్షలు



పంజగుట్ట: నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌ను సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం టీఆర్ఎస్ భవన్‌లో కలిసిన కేటీఆర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఇటీవల శాసనసభ ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యదపూర్వకంగా కలిసి బీసీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంపుదల చేయాలని, ఉప కులాల వారీగా రిజర్వేషన్లను అమలు చేయాలని, సంచార కులాలకు ప్రత్యేకంగా ఐదు శాతం రిజర్వేషన్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చాలని కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ రోహిణ్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలను అందించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్

కరాటేతో పరిపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు బ్లాక్ బెల్టులను పంపిణీ చేస్తున్న ఉప లోకాయుక్త నిరంజన్‌రావు

ఉప లోకాయుక్త నిరంజన్‌రావు

కాచిగూడ: కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులకు బ్లాక్ బెల్టులను ఉప లోకాయుక్త నిరంజన్‌రావు ప్రదానం చేశారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన 9 మందిలో బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్ విభాగంలో శ్యాంకుమార్, హంస, అమృత రెడ్డి, గణ సంతోషిణిరెడ్డి, బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ విభాగంలో నందిని, బ్లాక్ బెల్ట్ విభాగంలో వర్ధిని, మేధా, రిషిత, అవిఘ్న వెంకటరెడ్డి బెల్ట్ గ్రేడింగ్‌లు పొందారు. ముఖ్య అతిథిగా నిరంజన్‌రావు పాల్గొని మాట్లాడుతూ... యువతతో పాటు బాలికలు బ్లాక్‌బెల్ట్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కరాటే విద్య ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైనదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ముత్యంరెడ్డి, సీనియర్ అడ్వకేట్ అశోక్ కుమార్, డాక్టర్ కృష్ణారెడ్డి, కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఉమా మహేశ్వర్, డాక్టర్ వరుణ్య, మాస్టర్ నర్సింగ్‌రావు, కరీం తదితరులు పాల్గొన్నారు.

గౌతంరావుకు సత్కారం

కాచిగూడ: నూతన సంవత్సరం సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావును కలిసి అభినందించి, ఘనంగా సత్కరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని గౌతంరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీ విద్యుత్ సంస్థలకు ప్రతిష్టాత్మక అవార్డులు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా అత్యుత్తమ పని తీరు కనబరిచిన విద్యుత్ సంస్థలకు అందించే 'ఫాల్కన్ మీడియా–ఎనర్షియా ఫౌండేషన్' జాతీయ అవార్డులను ఏకంగా మూడింటిని ఏపీ విద్యుత్ సంస్థలు పొందాయి. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏపీ ట్రాన్స్‌కో)కు 'టాప్ స్టేట్ యుటిలిటీ ఫర్ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' అవార్డు లభించింది. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్ట్‌ల ప్రచారానికి సంబంధించి దేశంలోనే బెస్ట్ స్టేట్ టాప్ రెన్యూవబుల్ ఎనర్జీ నోడల్ ఏజెన్సీగా న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) అవార్డును కైవసం చేసుకుంది. రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్స్ (పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు బాధ్యత) లక్ష్యాన్ని చేరుకోవడంలోనూ ముందంజలో ఉన్న ఉత్తమ రాష్ట్రంగా ఏపీ విద్యుత్ సంస్థలను అవార్డు వరించింది. డిసెంబర్ 29న ముంబైలో ఈ అవార్డులను అందించారు.



సీఎం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

సాక్షి, అమరావతి/తిరుమల: ముఖ్యమంత్రి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తాడేపల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు సీఎస్ జవహర్‌రెడ్డితో పాటు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనాలు ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చావిడిమామిడిలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పండుగలా పింఛన్ల పంపిణీ

పెంచిన మొత్తంతో అవ్వాతాతల కళ్లలో వెల్లివిరిసిన ఆనందం

సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరంలోనూ ఏపీలో పింఛన్ల పంపిణీ పండుగలా మొదలైంది. తాజాగా పెంచిన మొత్తంతో కలిపి రూ.మూడు వేల చొప్పున ఈనెల పింఛన్ డబ్బులు అందుకున్న అవ్వాతాతల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పటివరకూ ప్రతినెలా ఇచ్చే రూ.2,750 పెన్షన్ మొత్తాన్ని ఈ జనవరి ఒకటి నుంచి రూ.మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని 8వ తేదీ వరకు మండలాల వారీగా ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి కొత్తగా మరో 1,17,161 మందికి పింఛన్లు మంజూరు చేసింది. దీంతో మొత్తంగా ఈ నెలలో 66.34 లక్షల మందికి రూ.1,968 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

ఆరోగ్య సురక్ష రెండో దశ

- రేపటి నుంచి నగరాలు, పట్టణాల్లో కార్యక్రమానికి శ్రీకారం
- ఆరు నెలల్లో 13,954 శిబిరాల నిర్వహణకు వైద్య శాఖ ప్రణాళిక

నేటి నుంచి గ్రామాల్లో వైద్య శిబిరాలు ప్రారంభం



సాక్షి, అమరావతి: ఏపీలో ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న ఆరోగ్య సురక్ష '(జేఏఎస్) రెండో దశ అమలుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. నేటి నుంచి గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుండగా వారానికి రెండు రోజుల చొప్పున మంగళ, శుక్రవారాల్లో జేఏఎస్‌ను నిర్వహిస్తారు. ఇక పట్టణాలు, నగరాల్లో రెండో దశ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. తొలిదశలో భాగంగా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో 50 రోజులపాటు జగనన్న సురక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. సొంత ఊళ్లలోనే 60 లక్షల మంది ప్రజలకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలందించింది. నిరంతరాయంగా కార్యక్రమాన్ని కొనసాగించడంలో భాగంగా రెండో దశను చేపట్టారు.

ఆరు నెలల్లో 13,954 శిబిరాలు

జేఏఎస్ రెండో దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలల్లో 13,954 సురక్ష శిబిరాలు నిర్వహించేలా వైద్య శాఖ ప్రణాళిక రూపొందించింది. గ్రామాల్లో 10,032, పట్టణాలు, నగరాల్లో 3,922 చొప్పున శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ నెలలో 3,583 శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో వారానికి ఒక గ్రామం చొప్పున, మునిసిపాలిటీల్లో వారానికి ఒక వార్డు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలను ఆరు నెలల్లో కవర్ చేసేలా శిబిరాలను నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, పారామెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఉంటారు. ప్రజలకు సొంత ఊళ్లలో స్పెషలిస్ట్ వైద్య సేవలందించేందుకు 543 జనరల్ మెడిసిన్, 645 గైనకాలజిస్ట్, 349 జనరల్ సర్జన్, 345 ఆర్థోపెడిక్స్, 378 మంది చొప్పున ఇతర స్పెషలిస్ట్ వైద్యులను, కంటి సమస్యల స్క్రీనింగ్ కోసం 562 మంది పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లను నియమించారు. వైద్య శిబిరాల్లో అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య పరీక్షల నిర్వహణకు ఏడు రకాల కిట్లు శిబిరాల్లో అందుబాటులో ఉంటాయి.

చేయి పట్టి నడిపిస్తూ..

వైద్య శిబిరాల ద్వారా సొంతూళ్లలో వైద్య సేవలు అందించడమే కాకుండా అనారోగ్య బాధితులను వైద్య పరంగా ప్రభుత్వం చేయి పట్టుకుని నడిపిస్తోంది. జేఏఎస్ శిబిరాల నుంచి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన రోగులను ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తారు. వీరు ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందడం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రయాణ చార్జీల కింద రూ.500 చొప్పున అందజేస్తోంది. రిఫరల్ రోగులను ఆస్పత్రులకు తరలించి అక్కడ ఉచితంగా అన్ని వైద్య సేవలు అందేలా సమన్వయం చేస్తారు. జీజీహెచ్‌లు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసుల కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఉంటాయి. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం వైద్య పరంగా అండగా నిలుస్తోంది. వీరికి ఉచిత కన్సల్టేషన్లతో పాటు కాలానుగుణంగా ఉచితంగా మందులు అందజేస్తోంది.

పేట్రేగిన టీడీపీ-జనసేన మూకలు.. మంత్రి రజిని కార్యాలయంపై రాళ్ల దాడి

గుంటూరులో అర్ధరాత్రి అరాచకం..

- న్యూఇయర్ వేడుకల ముసుగులో ర్యాలీ
- వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా నినాదాలు
- మంత్రి కొత్త ఆఫీసుపై రాళ్ల వర్షం
- అడ్డుకున్న పోలీసులపైనా దౌర్జన్యం.. సెక్యూరిటీ గార్డుపై దాడి



ఆదివారం అర్ధరాత్రి గుంటూరులోని చంద్రమౌళి నగర్‌లో టీడీపీ, జనసేన గూండాల రాళ్ల దాడిలో ధ్వంసమైన మంత్రి విడదల రజిని కార్యాలయం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఈస్ట్/సాక్షి, అమరావతి/సత్తెనపల్లి: టీడీపీ, జనసేన మూకలు గుంటూరులో విధ్వంసానికి తెరలేపాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని కొత్త కార్యాలయంపై ఆ మూకలు రాళ్ల దాడి చేశాయి. దీంతో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు చంద్రమౌళినగర్ మెయిన్‌రోడ్డులో మంత్రి రజిని పార్టీ నూతన కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తున్నారు. సోమవారం ఉదయం ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తెలుగుదేశం, జనసేన కార్యకర్తల ముసుగులో కొందరు గూండాలు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వచ్చారు. ముందుగా పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 12 గంటల తర్వాత కేక్ కటింగ్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా.. తెలుగుదేశం, జనసేన జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ మంత్రి కార్యాలయంపై రాళ్లు రువ్వారు. ఈ సంఘటనలో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. కార్యాలయం మొత్తం టీడీపీ రౌడీమూకలు విసిరిన రాళ్లతో నిండిపోయింది. అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యానికి దిగారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని ఆఫీసు సెక్యూరిటీ మాసారపు చిరంజీవి అడ్డుకోబోతే అతనిపైనా దాడిచేశారు. కార్యాలయం ప్రారంభానికి సంబంధించిన ఫ్లెక్సీలను టీడీపీ మూకలు చించివేశాయి. పోలీసులు 30 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సుమారు వంద మంది పాల్గొన్నట్లు పట్టాభిపురం పోలీసులు నిర్ధారించారు. మిగిలిన వారిపైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

పథకం ప్రకారమే దాడి..

ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఎందుకంటే.. మంత్రిని ఇటీవలే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో చంద్రమౌళినగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ఆమె ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, పశ్చిమ నియోజకవర్గం బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆమెకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రత్యర్థులు దాడికి దిగినట్లు తెలిసింది.

బీసీ మహిళపై టీడీపీ రౌడీయిజం : మంత్రి రజిని

ఈ ఘటనపై మంత్రి రజిని స్పందిస్తూ.. తన పార్టీ కార్యాలయంపై దాడి టీడీపీ గూండాల అధికార దాహానికి పరాకాష్ట అని మండిపడ్డారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఒక బీసీ మహిళ పోటీచేయడాన్ని చూసి తట్టుకోలేక టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారన్నారు. వారికి ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందని.. అందుకే ధ్వంస రచనకు తెరతీశారని ఆమె ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి జరిగిందన్నారు. వాహనాల ద్వారా బస్తాల్లో రాళ్లు తీసుకొచ్చి పార్టీ కార్యాలయంపై విసిరారని.. ఈ దాడి వెనుక ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. మంత్రి కార్యాలయంపైనే టీడీపీ రౌడీమూకలు దాడులకు పాల్పడ్డాయంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటో అర్థంచేసుకోవచ్చన్నారు.

నగర వార్తలు

ముదిరాజ్ సంఘాభివృద్ధికి కృషి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్

శంషాబాద్: ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు బొబ్బిలి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ పెద్దమ్మ తల్లి నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం స్థానికంగా ఆయన ఆవిష్కరించారు. ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నూతన సంవత్సరంలో అందరు బాగుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఎంను కలిసిన అజహరుద్దీన్



బంజారాహిల్స్: నూతన సంవత్సరం సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్ సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సెక్రటేరియట్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్కలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'బసవతారకం'లో కేన్సర్‌కు అధునాతన చికిత్స

- తెలుగు రాష్ట్రాలలో మొదటి సారిగా సెల్ థెరపీ చికిత్స



బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆస్పత్రి ఉన్నతాధికారులు

బంజారాహిల్స్ : ఉభయ తెలుగు రాష్ట్రాలలో మొదటి సారిగా కార్ టీ(సీఏఆర్ టీ) సెల్ థెరపీ చికిత్సను రోగులకు బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ అందుబాటులోనికి తీసుకొచ్చింది. ఈ థెరపీ తో ఎంతో ఆధునిక జెనిటిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీని ఉపయోగించి రోగి శరీరంలోని టి సెల్స్ కు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా దేనికీ లొంగని కేన్సర్ సెల్స్ పై పోరాటం జరిపేలా చేయడం తద్వారా లింఫోమా రకానికి చెందిన బ్లడ్ కేన్సర్ల రకంతో బాధపడుతున్న రోగుల జీవనాన్ని పెంచవచ్చు. సోమవారం హాస్పిటల్ జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ థెరపీ కేంద్రాన్ని చైర్మన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రత్యేక థెరపీని రోగులకు అందుబాటులోనికి తీసుకొని రావడంతో పాటూ 'స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూపు' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. రోగుల కోసం ఏర్పాటు చేసే ఈ సోషల్ గ్రూపు ద్వారా తమ పేషెంట్ కౌన్సిలర్లు, సోషల్ వర్క్ నిపుణులు , వైద్యులు నిరంతరం ట్రాన్స్ ప్లాంట్ సర్వైవర్స్ తో సంబంధాలు పెట్టుకొని అవసరం వచ్చిన ప్రతి సారి వారికి సరైన మార్గదర్శనం చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో 'కార్ టి సెల్ థెరపీ' అందించే మొదటి కేంద్రంగా బసవతారకం నిలిచిందన్నారు. గత నెల 27న హాస్పిటల్ లో మొట్ట మొదటి కార్ సెల్ థెరపీని రెసిస్టెంట్ లింఫోమాతో బాధడుతున్న రోగికి విజయవంతంగా అందించామన్నారు. హాస్పిటల్ సీఈఓ డాక్టర్ కూరపాటి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఆర్ఐతో జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఒప్పందం



మినరల్ ఎక్స్‌ప్లో రేషన్ కోసం ఒప్పందం చేసుకున్న దశ్యం

రామంతాపూర్ : కలకత్తాలో ప్రధాన కార్యాలయంలో ఉన్న జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రూ.99.73 కోట్ల భౌగోళిక పరిశోధన, ఖనిజాల అన్వేషణలో హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఎన్‌జీఆర్ఐతో ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ జనార్ధన్ ప్రసాద్, సీఎస్ఐఆర్ ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్‌కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 700 కిలో మీటర్ల మేర రాజస్థాన్ , మధ్యప్రదేశ్ అంతటా విస్తరించి ఉన్న డీప్ సిస్మిక్ రిఫ్లెక్షన్ సర్వే, మ్యాగ్నెట్ ఓ బెలూన్ సర్వేలు ఒప్పందంలో భాగంగా ఉందన్నారు. .ఈ ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు అమలు బాధ్యతను ఎంపీ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంతకే పాత్రో, ఎన్‌జీఆర్ఐ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ విశ్వజిత్ మండల్‌లకు అప్పగించామన్నారు.

కేలెండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో : భారత ఆహార సంస్థ, తెలంగాణ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో, సంస్థలో గుర్తింపు పొందిన యూనియన్ బీకేఎస్‌కే రూపొందించిన కేలెండర్–2024ను సంస్థ జనరల్ మేనేజర్ ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేంద్ర ప్రసాద్, విష్ణు, సతీష్ రెడ్డి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇది కార్మికుల పోరాట సంవత్సరం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న యూసఫ్, బాలరాజ్ తదితరులు

కాచిగూడ: దేశంలో కార్మిక వర్గం అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటోందని, 2024 సంవత్సరాన్ని కార్మికుల పోరాటాల సంవత్సరంగా ప్రకటిస్తున్నామని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. సోమవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పారిశ్రామిక ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పారిశ్రామిక అరాచకాలను సమర్థిస్తూ కార్మికుల సమస్యలకు చట్టపరమైన పరిష్కారానికి అన్ని మార్గాలను లాక్కుంటోందని అన్నారు. రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసి తీవ్ర నిర్బంధానికి గురిచేసిందని అన్నారు. సమ్మెలు, నిరసనలపై ఉక్కుపాదం మోపి, అణిచివేతలకు పాల్పడినందుకు కార్మికులు, ప్రజలు చిత్తుగా బీఆర్ఎస్‌ను ఓడించి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. కార్యక్రమంలో నేతలు సూర్యం, రెబ్బ రామారావు, పి.ప్రేమ్‌పావని, కె.రవిచంద్రన్, వి.రత్నాకర్ రావు, ఎస్వీ రమ, ఎస్ఎల్ పద్మ, రామా రాజేష్ కన్నా, వెంకన్న పాల్గొన్నారు.

కవిసమ్మేళనం.. పుస్తకావిష్కరణ



పాత్రికేయురాలు స్వప్నకు పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

పంజగుట్ట: మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కవిసమ్మేళనం, ప్రముఖ సాహితీ వేత్తలకు సన్మానాలు, పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ గౌరవాధ్యక్షులు డాక్టర్ వీడీ రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అరవా రవీంద్ర బాబు, అభినవ ఘంటసాల, సుస్వర సార్వభౌమ శరత్ చంద్రల సంగీతం, కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ సాహిత్య అకాడమీ మాజీ కులపతి, పద్మశ్రీ, ఆచార్య కొలకలూరి ఇనాక్, విశిష్ట అతిథులుగా కవి, విమర్శకులు, సీనియర్ పాత్రికేయులు బిక్కి కృష్ణ, సుప్రసిద్ధ సాహితీ వేత్త, రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, రిటైర్డ్ ఫారెస్టు ఆఫీసర్ ఎ.యల్.కృష్ణారెడ్డి హాజరయ్యారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశంను సాహిత్య సేవా వరిష్ఠ బిరుదుతో సత్కరించగా, పాత్రికేయురాలు స్వప్నను పాత్రికేయ శిరోమణి బిరుదుతో సత్కరించారు.

కనువిందు.. కూచిపూడి నృత్యం





మాదాపూర్: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం శిల్పారామంలోని ఆంఫి థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సెలవురోజు కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీదేవి మంగర శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు అలరించాయి. సాహిత్యరామ్ కుమార్ శిష్యబృందంచే అలరిపు, గణేశా, వసంత జతిస్వరం, నాట్యార్కౌత్వం, అర్ధనారీశ్వరం, అంశాలను ప్రాణ్యరామ్, ఆర్య, శైలగుప్త, రీష సహృద, మైరాసింగ్ కళాకారులు పాల్గొని ప్రదర్శించారు. మాధవి మారెళ్ళ పూడి తిల్లాన ఆర్ట్స్ అకాడమీ బృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. కళాకారులు అదితి, గంగ, రఘు, మానస తిరుపతి , మేధా వేమూరి, స్వేచ్ఛ తదితరులు పాల్గొన్నారు.

కోటకు పోటెత్తిన పర్యాటకులు





గోల్కొండ: చారిత్రక ప్రాంతమైన గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తారు. నూతన సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు సోమవారం వేలాది మంది పర్యాటకులకు గోల్కొండ కోట వేదికగా మారింది. కోటలోని నగీనాబాగ్, నాగదేవత పుట్ట పరిసరాలు, రాణిమహల్ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో పర్యాటకులు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి కేక్‌లు కట్ చేసుకొని నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే వేల సంఖ్యలో పర్యాటకులు కోటకు తరలివచ్చారు. బుకింగ్ కౌంటర్ వద్ద గంటన్నర సమయం కేవలం టికెట్ తీసుకోవడానికే పట్టిందంటే టికెట్ కౌంటర్ ముందు ఎంత మంది పర్యాటకులు బారులు తీరారో అర్థం చేసుకోవచ్చు. ఒకరినొకరు తోసుకుంటూ కోటలో ప్రవేశించిన పర్యాటకులు సెల్ఫీలు తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోటలోని క్లాపింగ్ పోర్టిపో, రాణిమహల్, ఆయుధాగారం తదితర ప్రాంతాలలో ఇసుక వేస్తే రాలనంత సంఖ్యలో పర్యాటకులు ఉన్నారు. తమ తమ వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి కోటకు వచ్చిన పర్యాటకులు కనీసం గంట సేపు అటూ ఇటూ వాహనాల్లో తిరిగారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 2-1-2024

గెలుపు దారి

ప్రకృతి ఇచ్చిన ప్రేమ కానుక





● రిన్‌జింగ్

పెద్ద నగరాలలో పెద్ద ఉద్యోగం చేస్తున్నప్పటికీ రిన్‌జింగ్ భూటియా మనసులో ఏదో లోటు ఉండేది. విశాలమైన ప్రకృతి ప్రపంచంలో పుట్టి పెరిగిన రిన్‌జింగ్ రణగొణ ధ్వనులకు దూరంగా తన మూలాలను వెదుక్కుంటూ సిక్కిం వెళ్లింది. హిమాలయాలలోని అరుదైన మొక్కలతో తయారు చేసే స్కిన్‌కేర్ ప్రాడక్ట్స్‌కు సంబంధించిన 'అగాపి సిక్కిం' స్టార్టప్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించింది. సొంత కాళ్ల మీద నిలబడడానికి పునరావాస కేంద్రాల్లోని మహిళల కోసం ఉచిత వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.

సిక్కింలోని అద్భుతమైన ప్రకృతి అందాల మధ్య పుట్టి పెరిగిన రిన్‌జింగ్ వృత్తిరీత్యా ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కత్తాలాంటి మహానగరాల్లో గడిపింది. ఆర్థిక సమస్యలు లేనప్పటికీ ఏదో లోటుగా అనిపించేది. ప్రకృతి మధ్య తాను గడిపిన కాలాన్ని గుర్తు చేసుకునేది. మరో ఆలోచన లేకుండా ఉద్యోగానికి రాజీనామా చేసి సిక్కిం బాట పట్టింది.

ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనే రిన్‌జింగ్ చిరకాల కల అక్కడ రెక్కలు విప్పుకుంది.

'ఉద్యోగ జీవితానికి సంబంధించి ఏ లోటు లేకపోయినప్పటికీ పెద్ద నగరాలలో కాలుష్యం, ఇరుకు ప్రదేశాలలో నివసించాల్సి రావడంతో బాగా విసుగెత్తిపోయాను. నా బిడ్డ పచ్చని ప్రకృతి ప్రపంచంలో పెరగాలనుకున్నాను. అందుకే వెనక్కి వచ్చేశాను' అంటుంది రిన్‌జింగ్.

ఉద్యోగం లేదు కాబట్టి బోలెడంత ఖాళీ సమయాన్ని చర్మ సంరక్షణకు సంబంధించిన పరిశోధనకు కేటాయించింది. ప్రకృతిలోని ఎన్నో వనమూలికల గురించి లోతుగా అధ్యయనం చేసింది. హిమాలయాలలో లభించే అరుదైన మొక్కలతో హ్యాండ్ క్రాఫ్టెడ్ స్కిన్‌కేర్ ప్రాడక్ట్స్‌కు సంబంధించిన 'అగాపి సిక్కిం' అనే అంకుర సంస్థను ఆరంభించింది. 'అగాపి' అనేది గ్రీకు పదం. దీని అర్థం... ప్రేమ.

సిక్కింలోని అనేక ప్రాంతాలలో చర్మవ్యాధులకు ఔషధంగా తమ చుట్టుపక్కల ఉండే మొక్కలను ఉపయోగించడం అనేది తరతరాలుగా జరుగుతోంది. ఈ సంప్రదాయమే తనకొక దారి చూపింది. చర్మవ్యాధులను తగ్గించే ఎన్నో ఔషధాల వాడకం పరంపరగా వస్తున్నప్పటికీ వాటి గురించి స్కిన్‌కేర్ ఇండస్ట్రీకి తెలియదు.

బిజినెస్ మోడల్‌ను డిజైనింగ్ చేసుకున్న తరువాత కబీ అనే ప్రాంతంలో తొలిసారిగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించింది రిన్‌జింగ్. ఇరవైమందికి పైగా మహిళలు హాజరయ్యారు. ఈ ఉత్సాహంతో మరిన్ని ప్రాంతాలలో మరిన్ని ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించింది. 'మా వర్క్‌షాప్‌లో శిక్షణ తీసుకున్న పది మందికి పైగా మహిళలు సొంత ప్రాజెక్ట్‌లు మొదలు పెట్టడం సంతోషంగా అనిపించింది. ఏదో సాధించాలనే పట్టుదల వారిలో కనిపించింది. వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాను' అంటుంది రిన్‌జింగ్. మాదక ద్రవ్యాలు, మద్యవ్యసనంతో శిథిలం అవుతున్న వారికి ఆ వ్యసనాల నుంచి బయటకు తీసుకువచ్చే సాధనంగా వర్క్‌షాప్‌లను ఉపయోగించుకుంటోంది రిన్‌జింగ్.

పునరావాస కేంద్రాల్లో కూడా వర్క్‌షాప్‌లు నిర్వహించి వారిలో ఆర్థికస్థైర్యాన్ని నింపింది. మాస్కులు, షాంపులు, స్క్రబ్‌లు, ఫేషియల్ ఆయిల్... మొదలైనవి ఎన్నో ఉత్పత్తి చేస్తుంది అగాపి సిక్కిం.

స్థానిక రకాల కలబంద, జనపనార... మొదలైన వాటిని తమ ఉత్పత్తులకు ముడిసరుకుగా ఉపయోగించుకుంటోంది. మొదట సిక్కిం చుట్టుపక్కల నగరాలలో ప్రాడక్ట్స్‌ను విక్రయించేవారు. ఆ తరువాత బెంగళూరు, కోల్‌కతాతో పాటు దేశంలోని ఎన్నో ప్రాంతాలకు మార్కెట్ విస్తరించింది.

'అగాపి' చెప్పుకోదగిన బ్రాండ్‌గా ఎదిగినప్పటికీ 'ఇక చాలు' అనుకోవడం లేదు రిన్‌జింగ్. స్కిన్ కేర్ సైన్స్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు తన పరిజ్ఞానాన్ని విస్తృతం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. ఇంగ్లాండ్‌లోని 'ఫార్ములా బొటానికా'కు సంబంధించి ఆన్‌లైన్ కోర్సులు చేస్తోంది.



● వర్క్‌షాప్ నిర్వహిస్తూ...

ప్రాచీన ఔషధాలపై కొత్త వెలుగు

ప్రాచీన కాలం నుంచి వాడుకలో ఉన్న సంప్రదాయ ఔషధాలు వెలుగు చూసేలా, ప్రపంచానికి తెలిసేలా కృషి చేస్తోంది రిన్‌జింగ్. తాను కంపెనీ స్థాపించడమే కాదు ఇతరులు కూడా స్థాపించేలా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది. 'ఇక్కడ అడుగు పెట్టడానికి ముందు ఎన్నో ప్రశ్నలు ఉండేవి. ఇప్పుడు వాటికి సమాధానం దొరికింది. అగాపి విజయం నాకు ఎంతో ఉత్సాహం ఇచ్చింది' అంటుంది రిన్‌జింగ్ భూటియా.



నేడు ప్రపంచ అంతర్ముఖ దినోత్సవం

అన్నీ మనసులోనే ఉంచుకుంటున్నారా?

అంతర్ముఖుల శక్తి వారి నిశ్శబ్దంలోనే ఉంటుంది. కాని అదే వారి బలహీనత కూడా కావచ్చు. అంతర్ముఖత్వం వల్ల కచ్చితంగా చెప్పాల్సినవి చెప్పకపోవచ్చు. మనసులో ఏముందో ఎదుటివారికి తెలియకపోవడం వల్ల అనుకోని సమస్యలు రావచ్చు. అంతర్ముఖులుగా ఉన్న స్త్రీలు తమ కుటుంబ, ఉద్యోగ, సామాజిక జీవనంలో ఎలా మెలగాలో తెలుసుకుందాం.

కొందరు అన్నింటికీ స్పందిస్తారు. కొందరు మౌనంగా ఉంటారు. కొందరిని చూసి ఇతరులు 'వాళ్ల మనసులో ఏమీ దాచుకోరు' అంటారు. మరికొందరిని చూసి 'వీళ్ల మనసులో ఏముందో తెలుసుకోలేము' అంటారు. బహిర్ముఖులదే (ఎక్స్‌ట్రావర్ట్స్) ఈ లోకం అని ఎక్కువ మంది విశ్వాసం. ఎందుకంటే తప్పో ఒప్పో ఏదో ఒకటి మాట్లాడి నలుగురి దృష్టిని ఆకర్షించేవాళ్లే గెలుపు సాధిస్తారని ఎక్కువమంది అభిప్రాయం. అలా కాకుండా కేవలం తమ పని ఏదో తాము చేసుకుంటూ అవసరమైతే తప్ప తమ అభిప్రాయాలను వెల్లడించని అంతర్ముఖులు (ఇంట్రోవర్ట్స్) సాధించే విజయాలు తక్కువ కాదు. ఇవాళ (జనవరి 2) ప్రపంచ అంతర్ముఖుల దినోత్సవం.

మీరు అంతర్ముఖులా?

ఎలా తెలుస్తుంది. ఈ ప్రశ్నలకు 'అవును'/'కాదు'లలో ఏది చెప్పగలరో చూడండి.

1. మీరు గుంపులో ఉండటానికి ఇష్టపడరా?
2. దాడీలు, పుకార్లు కాకుండా మీకు ఇష్టమైన అంశం గురించే మాట్లాడటానికి ఇష్టపడతారా?
3. మీ చిన్నప్పుడు బంధువులొచ్చినా, ఫంక్షన్ల సమయంలో ఎక్కువగా మీరెక్కడున్నారో తెలియనట్టు మసలేవారా?
4. అప్పుడప్పుడు ఒంటరిగా మీ ఆలోచనల్లో మీరుండాలనిపిస్తుందా?
5. మీకు తక్కువగా, మృదువుగా మాట్లాడే మనిషి అనే పేరుందా?

వీటి జవాబులు 'అవును' అయితే మీరు ఇంట్రావర్ట్ కిందే లెక్క. అయితే మానసిక నిపుణుల ప్రకారం ఎవరూ పూర్తిగా అంతర్ముఖత్వంతో, పూర్తిగా బహిర్ముఖత్వంతో ఉండరు. ఇరు స్వభావాలూ అందరిలో ఉంటాయి. అయితే ఒకటి ఎక్కువ పాళ్లల్లో ఉంటుంది. అంతర్ముఖత్వం ఎక్కువ పాళ్లల్లో ఉంటే మీరు అంతర్ముఖుల కిందే లెక్క.

ఇవీ ప్లస్ పాయింట్స్

అంతర్ముఖులు తమ లోపలి నుంచి తాము శక్తిని పొందుతారు. వీరు ఎప్పుడూ తమ మనోభావాలను, ఆలోచనలను గమనించుకుంటూ ఉంటారు. నడిచి వచ్చిన దారిని బేరీజు వేసుకుని సరి చేసుకుంటూ ఉంటారు. ఒక పని మీద లక్ష్యం ఉంటుంది. చాలామటుకు నిరుపయోగమైన పనుల్లో కాలం వృథా చేయరు.

మైనస్ పాయింట్స్

ఏ పనైనా సమర్థంగా చేయగలిగే శక్తి, నైపుణ్యం, ప్రతిభా ఉన్నా అది చేతలతో మాత్రమే చూపుతారు. మాటల వల్ల తెలియచేసి ముందుగా అవకాశం దొరకబుచ్చుకోరు. ఒకరిని పొగడటం, ఒకరితో పొగడ్త వినడం వీరికి దాదాపుగా రాదు. గుంపులను ఇష్టపడరు. వీరి నిశ్శబ్దాన్ని ఎదుటివారు పొగరుగా, నిర్లక్ష్యంగా భావించవచ్చు. నలుగురినీ తమ మాటలతో ఆకర్షించే ఎక్స్‌ట్రావర్ట్స్‌ను చూసి, వీరు అలా ఉండకపోవడం లోపమేమో అని బాధపడవచ్చు.

స్త్రీలు ఇంట్రోవర్ట్స్ అయినప్పుడు

ప్రపంచంలో బహిర్ముఖులు ఎంతమందో అంతర్ముఖులు అంత మంది ఉంటారు. అమ్మాయిలు తమ బాల్యంలో ఇంట్రోవర్ట్‌లుగా ఉంటే వీరికి తక్కువమంది స్నేహితులయ్యే అవకాశం ఉంది. తల్లితో, తోబుట్టువులతో తప్ప ఎక్కువమందితో మాట్లాడకపోవచ్చు. కాలేజీలో ఇలాంటి వారు కాలేజీలో ఉన్నారా లేరా అన్నట్టుగా ఉంటారు. ఉద్యోగాల్లో వీరు చెప్పిన పని చేసుకునిపోయే వారవుతారు. గృహిణిగా ఎక్కువ మౌనంతో, తక్కువ మాటలతో సంసారాన్ని నిర్వహిస్తారు. అయితే వీటివల్ల ఏ నష్టమూ లేకపోయినా అనేక విషయాలు వీరికి నచ్చనప్పుడు మౌనాన్ని ఆశ్రయిస్తారు. వారు ఎందుకు మౌనాన్ని ఆశ్రయించారో ఎదుటివారికి తెలియక సతమతమయ్యే స్థితి ఉంటుంది. కుటుంబ పరంగా, వృత్తిగతంగా, పిల్లల భవిష్యత్తు విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు వీరి నిర్ణయం బాగా ఆలస్యమయ్యి లేదా వెంటనే తేలక చిక్కులు రావచ్చు.

ఏం చేయాలి?

సుసాన్ కెయిన్ అనే అమెరికన్ రచయిత్రి 'క్వైట్: పవర్ ఆఫ్ ఇంట్రావర్ట్' అనే పుస్తకం రాసింది. అంతర్ముఖుల మౌనంలోనే వారి శక్తి ఉంటుంది. అదే సమయంలో భర్తతో/పిల్లలతో/ ఆఫీసు పరివారంతో కచ్చితమైన అభిప్రాయాలు వెల్లడి చేయాల్సి వచ్చినప్పుడు తప్పక వెల్లడి చేయాలి. ఇంట్లో కాసేపు ఒంటరిగా ఉండాలనిపించినప్పుడు 'అలక/కోపం' అనే భావన ఇతరులకు కలగకుండా 'కాసేపు పుస్తకం చదువుకుంటాను' అని చెప్పి ఏదో ఒక పుస్తకం పట్టుకుని గదిలో మీ ఆలోచనల్లో మీరు నిమగ్నం కావచ్చు. కుటుంబ సభ్యులు అందరూ కూడినప్పుడు మీరు తక్కువ మాట్లాడినా పూర్తి సమయం వారి సమక్షంలో ఉండేలా చూసుకోవాలి.

● ముగ్గు-ముచ్చట






బొడ్డు ఝాన్సీ
చౌటుప్పల్, యాదాద్రి, భువనగిరి జిల్లా
17 చుక్కలు
మధ్య చుక్క, 8 వచ్చేవరకు



పి. హారతి
సూళ్ళూరుపేట, తిరుపతి జిల్లా
13 చుక్కలు
3 వరుసలు, 3 వచ్చేవరకు



సాగుబడి

పూర్వాషాడ కార్తె: జనవరి 10 వరకు
ఉత్తరాషాడ కార్తె: 11 నుంచి



● పిజెటిఎస్ఎయులో అగ్రిహబ్ ఆధ్వర్యంలో సౌర ఫలకాల కింద కూరగాయ పంటల ప్రయోగాత్మక సాగు

ఆవిష్కర్తలకు ఆత్మీయ దిక్సూచి!

- అర్బన్, గ్రామీణ ఆవిష్కర్తలకు దిక్సూచిగా నిలుస్తున్న అగ్రిహబ్ ఫౌండేషన్
- స్టార్టప్‌ల ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలో పరీక్షించి, వాటి ప్రయోజకత్వాన్ని నిర్ధారించే ఏర్పాటు
- ఆవిష్కర్తలు పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకోవటానికి కూడా అగ్రిహబ్ తోడ్పడుతోంది..

వ్యవసాయం రైతులకు గిట్టుబాటు కావాలంటే పనిసౌలభ్యంతో పాటు ఉత్పత్తి ఖర్చులు తగ్గించే యాంత్రీకరణ అత్యవసరం. ఆవిష్కరణలను సాంకేతికంగా, ఆర్థికంగా ప్రోత్సహించినప్పుడే వినూత్న యంత్రాలు రైతులకు అందుబాటులోకి వస్తాయి. అందుకు ఇంక్యుబేషన్ కేంద్రాలు దోహదం చేస్తాయి. అటువంటి కేంద్రాల్లో విలక్షణమైనది హైదరాబాద్ పిజెటిఎస్ఎయు ఆవరణలో కొలువుదీరిన అగ్రిహబ్ ఫౌండేషన్. టెక్నీషియన్ల నుంచి గ్రామీణుల వరకు ఎవరైనా అగ్రిహబ్ సేవలను అందుకోవచ్చు.

అగ్రిహబ్.. వ్యవసాయం, ఆహార సంబంధమైన అనుబంధ రంగాల్లో ఇటు సాంకేతిక నిపుణుల ఆవిష్కరణలకు, అటు గ్రామీణ ఆవిష్కర్తలకు మార్గదర్శిగా నిలుస్తున్న సంస్థ. రెండు అంచెల వ్యవస్థగా పనిచేస్తున్న తొలి అగ్రి ఇంక్యుబేటర్ కావటం దీని ప్రత్యేకత. అంతేకాదు, అగ్రిటెక్ స్టార్టప్‌ల ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలో పరీక్షించి, వాటి యోగ్యతను నిర్ధారించే విలక్షణ వేదిక అగ్రిహబ్. పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకోవటంలోనూ ఆవిష్కర్తలకు చేదోడుగా నిలుస్తోంది. అర్హులైన ఆవిష్కర్తలకు నాబార్డు గ్రాంట్‌కు సిఫారసు చేస్తోంది. కొన్ని స్టార్టప్‌ల ఆవిష్కరణల్లో ఈక్విటీ ఫండింగ్ సమకూర్చుతోంది.

ఆలోచనతో వస్తే చాలు..

సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు వ్యవసాయం, ఆహారోత్పత్తులకు సంబంధించి వినూత్న ఆలోచనతో వస్తే.. ఆ ఆలోచనను ఆచరణాత్మక ఆవిష్కరణగా తీర్చిదిద్దటానికి ఇంక్యుబేషన్ సేవలందిస్తున్నామని అగ్రిహబ్ ఫౌండేషన్ సీఈవో, డైరెక్టర్ విజయ్ నడిమింటి 'సాక్షి సాగుబడి'తో మాట్లాడుతూ చెప్పారు. ఆవిష్కరణలపై మేధోహక్కులకు పేటెంట్ హక్కులు పొందటానికి కూడా అగ్రిహబ్ తోడ్పడుతుంది. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన వారైనా ఈ సేవలు అందుకోవచ్చు. ఇప్పటి వరకు 350కి పైగా స్టార్టప్‌లకు అగ్రిహబ్ సేవలందించింది. 825 డిజైన్ థింకర్స్‌కు తోడ్పాటునందించింది. 25 స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం నెరపింది. 8 స్టార్టప్‌లు రూపొందించిన డ్రోన్లు, రోబోలు వంటి సాంకేతికతలను క్షేత్రస్థాయిలో వాలిడేట్ చేసింది. గ్రాంట్లు పొందటానికి నలుగురు ఆవిష్కర్తలకు తోడ్పడింది. 8 స్టార్టప్‌లకు ఈక్విటీ ఫండింగ్ అందించింది అగ్రిహబ్.



● అగ్రిహబ్ సీఈవో విజయ్

ప్రయోగాత్మకంగా సోలార్ సేద్యం!

రైతుల వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఉపకరించే అగ్రిటెక్ స్టార్టప్‌ల సాంకేతికతలను పొలాల్లో వినియోగించి, వాటి ప్రయోజకత్వాన్ని ధృవీకరించటం అగ్రిహబ్ ప్రత్యేకత. ఇప్పటికి 8 సాంకేతికతలను వాలిడేట్ చేశారు. ఈ క్రమంలో.. అగ్రి ఫొటో ఓల్టాయిక్ (ఎపివి) సిస్టం వాలిడేషన్ ప్రక్రియ అగ్రిహబ్‌లో గత రబీ కాలం నుంచి కొనసాగుతోంది. పొలాల్లో పంటల సాగుతో పాటే ఏకకాలంలో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసే ఈ పద్ధతిని అగ్రివోల్టాయిక్స్ లేదా సోలార్ సేద్యంగా చెప్పుకోవచ్చు. సౌర కాంతిని పంటల సాగుతో పాటు విద్యుత్తు ఉత్పత్తికి కూడా వాడుకోవటం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందడానికి ఆస్కారం ఉంది. అయితే, సాధారణ సోలార్ ఫలకాల నీడ కింద పంటలు పెరగవు. అందుకే వాటిని బంజరు భూముల్లోనో, కాలువల మీదనో పెడుతున్నారు. పంట పొలాల్లో కూడా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవాలంటే సౌర ఫలకాలు ఎండను కిందికి ప్రసరింపజేసేలా పారదర్శకమైనవై ఉండాలి. ఇటువంటి వినూత్న ఫలకాలనే రూపొందించింది బెంగళూరుకు చెందిన స్టార్టప్ సంస్థ రెన్‌బ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్. ఈ ఫలకాలను వినియోగించి అగ్రిహబ్ ద్వారా పిజెటిఎస్ఎయులోని వాటర్ టెక్నాలజీ సెంటర్ డైరెక్టర్ డా. అవిల్ కుమార్ పర్యవేక్షణలో గత ఏడాది (2022-23) రబీ కాలం నుంచి పంటలను ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. క్యాబేజి, బ్రోకలి, కాలిఫ్లవర్, క్యారట్, చెట్టుచిక్కుడు, వేరుశనగ, మిరప వంటి సుమారు 15 రకాల పంటలను 65 వాట్ల సామర్థ్యం గల 40 సోలార్ ప్యానళ్ల కింద 300 చ.మీ. విస్తీర్ణంలో గత నవంబర్ నుంచి పలు పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటికి రబీ, ఖరీఫ్ పంటలు సాగు చేశారు. మళ్లీ రబీ పంటలు ఇటీవలే వేశారు. 'రెన్‌బ్యాక్ సోలార్ ప్యానల్స్ నుంచి ప్రసరించే సూర్యరశ్మిలో 70% వరకు నేల మీద పంటలపై పడుతోంది. సాధారణ సోలార్ ప్యానళ్ల కన్నా ఈ ప్యానళ్ల ద్వారా 10-12% అదనంగా విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఈ ప్యానళ్ల కింద సాగైన క్యారట్ పంట దిగుబడి ఏమీ తగ్గలేదు. వేరుశనగ వంటి పంటల్లో కొంచెం తగ్గింది. నీటి వినియోగంలో మార్పు లేదు. అయితే, మరికొన్ని పంటకాలాలు పండించిన తర్వాత ఏయే పంటలకు ఈ సోలార్ సేద్యం అనుకూలమో తెలుస్తుంది' అన్నారు డా. అవిల్ కుమార్(99513 35111).

పేటెంట్లకూ తోడ్పడుతున్నాం!

ఎంటర్‌ప్రెన్యూర్లు, శాస్త్రవేత్తల అగ్రిటెక్ స్టార్టప్‌లతో పాటు రైతులు, గ్రామీణుల ఆవిష్కరణలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తున్న ఏకైక ఇంక్యుబేషన్ సంస్థ అగ్రిహబ్ ఒక్కటే. సాంకేతిక ఆవిష్కరణలతో పాటు రైతుల వంగడాలకు కూడా పేటెంట్లు పొందేందుకు మేం తోడ్పడుతున్నాం. ఇన్నోవేటర్ల తరఫున ఇప్పటికి మొత్తం 13 పేటెంట్లకు దరఖాస్తు చేశాం.

– డా. కల్పనా శాస్త్రి, మేనేజింగ్ డైరెక్టర్, అగ్రిహబ్ ఫౌండేషన్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్





● డ్రోన్



● అగ్రిబోట్

గ్రామీణులకు ప్రత్యేకం..

గ్రామీణ ఆవిష్కర్తలకు ఇంక్యుబేషన్ సేవలందించటం కోసం జగిత్యాల, వరంగల్, వికారాబాద్‌లలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో అగ్రిహబ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లోని గ్రామీణ యువత, రైతులు, ఎఫ్‌పిఒలు, కోఆపరేటివ్‌ల నిర్వాహకులు తమ కలలను అగ్రిహబ్ తోడ్పాటుతో సాకారం చేసుకోవటానికి ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని అగ్రిహబ్ ఎండీ డా. కల్పనా శాస్త్రి తెలిపారు.

ceo@ag-hub.co
040 - 23014515

- విత్తనోత్పత్తి కోసం బీటీ హైబ్రిడ్ పత్తి పండిస్తున్న రైతు
- మిచాంగ్ తుపానుకు పడిపోయి.. తిరిగి నిలదొక్కుకుంది!
- మొక్కకు వంద కాయలు.. మూడెకరాల్లో 30 క్వింటాళ్ల పత్తి దిగుబడి, రూ. 7 లక్షల నికరాదాయం

విరగ్గాసిన సేంద్రియ పత్తి!

రసాయన మందులేమీ వాడకుండా సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో బీటీ హైబ్రిడ్ సీడ్ పత్తిని సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు రైతు ఏకుల లక్ష్మీనారాయణ. వ్యవసాయమే జీవనంగా బతుకుబండిని నడిపిస్తున్న లక్ష్మీనారాయణ తనకు కౌలుకు ఇచ్చిన భూ యజమాని కోటగిరి చైతన్య సూచనల మేరకు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో బీటీ హైబ్రిడ్ విత్తన పత్తిని రెండేళ్లుగా సమర్థవంతంగా చేస్తూ విశేషమైన దిగుబడులతో పాటు అధిక నికరాదాయం పొందుతున్నారు.

లక్ష్మీనారాయణది ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట. శివారు గ్రామమైన సీతారామపురంలో కోటగిరి చైతన్య మామిడి తోటకు పక్కనే ఉన్న మూడెకరాల ఎర్ర నేలను కౌలుకు తీసుకొని విత్తన పత్తిని రెండేళ్లుగా సాగు చేస్తున్నారు. ఒక ఎకరానికి డ్రిప్ వేశారు. రెండెకరాలకు నీటిని పారగడుతున్నారు. 120 రోజుల దశలో ఉన్న పత్తి మొక్కలన్నీ ఆరోగ్యంగా ఎదుగుతూ ఇంకా కొత్త చిగుర్లు వేస్తున్నాయి. మొక్కకు 90 నుంచి 110 వరకు కాయలతో చూపరులను ఆశ్చర్యపరుస్తున్నాయి. తనకు దిగుబడి 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున మూడెకరాలకు రూ.60 వేలకు కౌలుకు తీసుకొని విత్తన పత్తిని సాగు చేస్తున్నారు.

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న చైతన్య కరోనా కాలంలో ఇంటి దగ్గర ఉన్న కాలంలో సేంద్రియ సాగులో మెళకువలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు. ఇప్పుడు బెంగళూరు తిరిగి వెళ్లినా అక్కడి నుంచే లక్ష్మీనారాయణకు సూచనలిస్తూ పత్తి సాగు చేయిస్తున్నారు. ఆవు పేడతో జీవామృతం, అనేక రకాల జీవన ఎరువులు కలిపి మగ్గబెట్టి ప్రత్యేకంగా రూపొందించిన ఎన్‌రిచ్డ్ కంపోస్టును మూడెకరాల్లో దుక్కి 3 టన్నులు వేశారు. పత్తి విత్తిన 20 రోజులకు మరో 3 టన్నుల కంపోస్టును మొక్కల మొదళ్ల వద్ద వేశారు. లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలతో సమీకృత చీడపీడల యాజమాన్య మెళకువలు పూర్తిగా పాటిస్తున్నారు. పంచగవ్య, పుల్లటి మజ్జిగతో పాటు అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తదితర కషాయాలను విడతల వారీగా లక్ష్మీనారాయణ సొంతంగా తయారు చేసుకుంటూ ఐదు రోజులకోసారి ఏదో ఒకటి అవసరాన్ని బట్టి పిచికారీ చేస్తున్నారు. దీంతో పత్తి మొక్కలు విత్తి 120 రోజులు అయినప్పటికీ ఇంకా బలంగా ఎదుగుతున్నాయి. అంతేగాకుండా ఒక్కొక్క చెట్టుకు కాయలు కూడా అధిక సంఖ్యలో వచ్చాయి.




● పత్తి పంటను ఇటీవల పరిశీలిస్తున్న దేవేంద్ర శర్మ

3 ఎకరాల్లో విత్తన పత్తి సాగు: రూ. 7 లక్షల నికరాదాయం!

3 ఎకరాల పొలంలో విత్తన పత్తి క్రాసింగ్ కోసం అరెకరంలో పోతు (మగ) మొక్కల్ని పెంచుతున్నాను. అంటే.. నికరంగా 2.5 ఎకరాల్లోనే పత్తి పంట ఉన్నట్లు లెక్క. చెట్టుకు సగటున 90-100 కాయలున్నాయి. మొదటి విడత పత్తి తీశాం. మరో మూడుసార్లు తీస్తాం. ఎకరానికి 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకుంటున్నాం. కనీసం 30 క్వింటాళ్ల సీడ్ పత్తి వస్తుందనుకున్నా.. 18 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, 12 క్వింటాళ్ల దూది వస్తుంది. విత్తనాలు క్వింటా రూ. 53,000, దూది క్వింటా రూ. 14,000కు అమ్ముతా. మొత్తం మీద రూ. 4.5 లక్షల ఖర్చులు పోగా నికరాదాయం రూ. 7 లక్షలకు తగ్గదు. తుపాను దెబ్బకు కొన్ని కాయలు పాడవ్వకపోతే మరో రూ. లక్ష అదనంగా వచ్చి ఉండేది.

– ఏకుల లక్ష్మీనారాయణ (95509 84667), అన్నేరావుపేట, రెడ్డిగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా





● మిచాంగ్ తుపాను గాలులకు నేలకొరిగిన లక్ష్మీనారాయణ పత్తి పంట (ఫైల్)

నేలకొరిగినా తిప్పకుంది!

డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన మిచాంగ్ తుపానుకు మూడెకరాల్లోని పత్తి పంటంతా నేల వాలింది. దీంతో రైతు లక్ష్మీనారాయణ తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. ఏదైతే అది అవుతుందని.. పడిపోయిన మొక్కలను కూలీలతో లేపి నించోబెట్టి మొదళ్లలో మట్టిని వేయించారు. ఆ తర్వాత రెండు రోజులకే తోటంతా ఆశ్చర్యకరంగా నిలదొక్కుకుంది. వానపాములు నేలను గుల్లగా ఉంచటం, వేరు వ్యవస్థ బలంగా, లోతుగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని రైతు చెప్పారు. ఎంతో ఆరోగ్యంగా పెరుగుతున్న ఈ పంటను ఇటీవల పరిశీలించిన ప్రసిద్ధ వ్యవసాయ నిపుణులు దేవేంద్ర శర్మ, డా. జీవీ రామాంజనేయులు, పాలాది మోహనయ్య తదితరులు లక్ష్మీనారాయణ కృషిని ప్రశంసించారు. ఇతర రైతులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు.

– ఉమ్మా రవీంద్ర కుమార్ రెడ్డి, సాక్షి, నూజివీడు



ఆంక్షల ఫలితం... బిగ్‌బాష్ లీగ్‌కు ముజీబ్ దూరం

జాతీయ జట్టుకు తొలి ప్రాధాన్యత ఇవ్వకుండా ఫ్రాంచైజీ టి20 లీగ్‌లవైపు మొగ్గుచూపుతున్న తమ దేశ క్రికెటర్లు ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, ఫజల్‌హక్ ఫరూఖీలపై గతవారం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ఆంక్షలు విధించింది. ఇవి అమల్లోకి రావడంతో ఆస్ట్రేలియాలో ప్రస్తుతం జరుగుతున్న బిగ్‌బాష్ టి20 లీగ్‌లో మంగళవారం మెల్‌బోర్న్ స్టార్స్‌తో మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడాల్సిన ముజీబ్‌ను ఆ జట్టు తప్పించింది. ఈ సీజన్‌లో రెనెగేడ్స్ తరఫున ఆడిన ఏకైక మ్యాచ్‌లో ముజీబ్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.



విజయంతో ఒసాకా పునరాగమనం

జపాన్ టెన్నిస్ స్టార్, నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత నయోమి ఒసాకా విజయంతో పునరాగమనం చేసింది. 2022 సెప్టెంబర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ ఒసాకా గత ఏడాది జూలైలో పాపకు జన్మనిచ్చింది. 15 నెలల విరామం తర్వాత సోమవారం మొదలైన బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీలో ఒసాకా బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో ఒసాకా 6-3, 7-6 (11/9)తో తమారా కోర్పాట్చ్ (జర్మనీ)పై విజయం సాధించింది.


పవన్

మళ్లీ ఓడిన టైటాన్స్

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 18-54 పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్ చేతిలో భారీ ఓటమి చవిచూసింది. ఈ లీగ్‌లో టైటాన్స్ జట్టుకిది ఎనిమిదో పరాజయం కావడం గమనార్హం. టైటాన్స్ జట్టు కెప్టెన్ పవన్ సెహ్రావత్ ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలమయ్యాడు. పవన్ కేవలం రెండు పాయింట్లు మాత్రమే సాధించాడు. మొత్తం 14 సార్లు రెయిడింగ్‌కు వెళ్లిన పవన్ ఒకసారి సఫలమై, మరోసారి బోనస్ పాయింట్ రాబట్టాడు. తొమ్మిదిసార్లు పాయింట్ సాధించకుండానే తిరిగి వచ్చాడు. టైటాన్స్ జట్టు మరో ప్లేయర్ సందీప్ ఐదు పాయింట్లు గెలిచాడు. మరోవైపు పుణేరి పల్టన్ తరఫున మోహిత్ గోయట్, అస్లమ్ ముస్తఫా చెలరేగిపోయారు. మోహిత్ 13 పాయింట్లు, అస్లమ్ 8 పాయింట్లు స్కోరు చేశారు. గౌరవ్ ఖత్రీ (6), అభినేశ్ (5), మొహమ్మద్ రెజా (5) కూడా రాణించారు. మరో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ 48-41తో యూపీ యోధాస్‌పై గెలుపొందింది. యూపీ యోధాస్ కెప్టెన్ ప్రదీప్ నర్వాల్ 21 పాయింట్లతో అదరగొట్టినా తన జట్టును గెలిపించలేకపోయాడు.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	8	7	1	0	36
గుజరాత్ జెయింట్స్	9	6	3	0	33
జైపూర్ పింక్ పాంథర్స్	8	4	2	2	28
పట్నా పైరేట్స్	9	5	4	0	27
యు ముంబా	7	5	2	0	26
హరియాణా స్టీలర్స్	8	5	3	0	26
దబంగ్ ఢిల్లీ	8	4	3	1	25
బెంగళూరు బుల్స్	10	4	6	0	25
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	10	3	6	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

వన్డేలకు వార్నర్ గుడ్‌బై

ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ వార్నర్ వన్డే ఫార్మాట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. బ్యాటింగ్‌లో మెరుపులు, నోటితో తూటాలు పేల్చే అతను పలు వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచాడు. అతని ఖాతాలో సెంచరీలున్నట్లే కెరీర్‌లో సస్పెన్షన్‌లు, బాల్ టాంపరింగ్ మరకలూ ఉన్నాయి. ఇప్పుడా ఆట, దూకుడు ఇక మీదట టి20లకే పరిమితం కానున్నాయి.

- ఫామ్‌లో ఉంటే 'చాంపియన్స్' బరిలోకి
- ఇకపై టి20లకే 'డాషింగ్ బ్యాటర్' మెరుపులు



సిడ్నీ: డేవిడ్ వార్నర్ అంటే విజయవంతమైన ఓపెనరే కాదు... వివాదాస్పద క్రికెటర్ కూడా! బ్యాట్‌తో బాదడం ఎంత బాగా తెలుసో... 'సై అంటే సై' అని నోటికి పని చెప్పడం కూడా తెలిసినోడు. విధ్వంసకర బ్యాటర్‌గా ఎలా గుర్తుండిపోతాడో అంతే స్థాయిలో తెంపరితనం ఉన్న వ్యక్తిగానూ ముద్ర వేసుకున్నాడు. ఇక మన తెలుగు ప్రేక్షకులకైతే సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఇప్పుడు లేడు)తో బాగా కనెక్టయ్యాడు. తెలుగు హీరోల మేనరిజాన్ని, పాటలకు నప్పే స్టెప్పులతో సోషల్ మీడియాలో వినోదం పంచిన ఈ ఆస్ట్రేలియన్ తాజాగా వన్డే క్రికెట్‌కు సైతం వీడ్కోలు పలికేశాడు. పాకిస్తాన్‌తో స్వదేశంలో ఆఖరి టెస్టు ఆడేందుకు సిద్ధమవుతున్న వేళ వన్డేలపై నిర్ణయాన్ని ప్రకటించాడు. సిడ్నీలో 3 నుంచి జరిగే మూడో టెస్టు అనంతరం అతను కేవలం అంతర్జాతీయ క్రికెట్లో టి20 ఫార్మాట్‌లోనే కొనసాగుతాడు. సోమవారం మీడియా సమావేశంలో 37 ఏళ్ల వార్నర్ మాట్లాడుతూ 'భారత్‌లో జరిగిన ప్రపంచకప్ సమయంలోనే రిటైర్మెంట్ గురించి చెప్పాను. విశ్వవిజేత జట్టు సభ్యుడిగా ఎంతో సంతృప్తికరమైన వన్డే కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నాను. దీనివల్ల నేను ఫ్రాంచైజీ టి20 లీగ్‌ను మరింత శ్రద్ధపెట్టి ఆడేందుకు వీలవుతుంది. ఈ ఫార్మాట్‌లో అంతర్జాతీయ కెరీర్‌నూ కొనసాగిస్తాను.


ఫ్యామిలీతో...

అయితే 2025లో చాంపియన్స్ ట్రోఫీ నాటికి ఫామ్‌లో ఉంటే, జట్టుకు అవసరమనిపిస్తే అందుబాటులో ఉంటాను' అని అన్నాడు.

సఫారీతో అరంగేట్రం

దక్షిణాఫ్రికాతో 2009 జనవరిలో జరిగిన టి20 మ్యాచ్‌తో 22 ఏళ్ల వార్నర్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అదే నెల అదే ప్రత్యర్థితోనే తొలి వన్డే కూడా ఆడాడు. 15 ఏళ్ల కెరీర్‌లో 99 టి20 మ్యాచ్‌ల్లో 2894 పరుగులు చేశాడు. ఒక సెంచరీతోపాటు 24 ఫిఫ్టీలు అతని ఖాతాలో ఉన్నాయి. 161 వన్డేలాడిన వార్నర్ 45.30 సగటుతో 6932 పరుగులు సాధించాడు. ఇందులో 22 సెంచరీలు, 33 అర్ధసెంచరీలున్నాయి. 111 టెస్టుల్లో 44.58 సగటుతో 8695 పరుగులు చేశాడు. 26 శతకాలు, 36 అర్ధశతకాలు బాదాడు.

ఇవీ విజయాలు

➡ మరకలు పక్కనబెట్టి కేవలం క్రికెట్‌నే పరిగణిస్తే మాత్రం వార్నర్ పరిపూర్ణ సాఫల్య క్రికెటర్ అని చెప్పొచ్చు. ఆస్ట్రేలియా సాధించిన 2015, 2023 వన్డే ప్రపంచకప్‌లలో అతను కీలకపాత్ర పోషించాడు. 2021 టి20 వరల్డ్‌కప్ విజయంలో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. 2023 ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ విజేత జట్టు సభ్యుడిగా ఉన్నాడు.

ఇవీ వివాదాలు

➡ 2013 చాంపియన్స్ ట్రోఫీ సమయంలో జో రూట్‌తో వాగ్వాదానికి దిగడంతో క్రికెట్ ఆస్ట్రేలియా అతనిపై రెండు టెస్టుల నిషేధం విధించింది. దీంతో అతను ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్ని ఆడలేకపోయాడు.

➡ కేప్‌టౌన్ టెస్టులో బాల్ టాంపరింగ్ ఉదంతం వార్నర్ కెరీర్‌కే మాయని మచ్చ. దీంతో అతనితో పాటు, స్మిత్ (అప్పటి కెప్టెన్) ఏడాది పాటు నిషేధానికి గురయ్యారు. ఇవి చాలవన్నట్లు అదుపులేని నోటి దురుసుతనంతో జీవితకాలం సారథ్యం చేపట్టకుండా శిక్షకు గురయ్యాడు.



విజయంతో ప్రారంభించాలని...

- నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల జట్టు చివరి వన్డే
- ఇప్పటికే సిరీస్ కోల్పోయిన హర్మన్‌ప్రీత్ బృందం
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్-18లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: కొత్త ఏడాదిని విజయంతో ప్రారంభించాలనే లక్ష్యంతో... నేడు ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగే చివరిదైన మూడో వన్డేలో భారత జట్టు బరిలోకి దిగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో ఓటమి పాలై సిరీస్‌ను కోల్పోయింది. ఫలితంగా ఆస్ట్రేలియాపై తొలిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని ఆశించిన భారత జట్టుకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇక చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి ఊరట చెందాలని భారత బృందం భావిస్తోంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టుల్లో విశేషంగా రాణించి అద్భుత విజయాలు అందుకున్న భారత జట్టు వన్డే ఫార్మాట్‌కు వచ్చేసరికి తడబడింది. సమష్టి ప్రదర్శన కొరవడటంతో ఈ ప్రభావం మ్యాచ్ తుది ఫలితంపై పడింది. భారత్ తరఫున బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో ఒకరిద్దరే రాణిస్తుండటం ప్రతికూలంగా మారింది. తొలి వన్డేలో భారత జట్టు భారీ స్కోరు చేసినా బౌలర్ల వైఫల్యం దెబ్బతీసింది. రెండో వన్డేలో రిచా ఘోష్ ఒంటరి పోరాటంతో విజయానికి చేరువైన భారత్ చివర్లో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఆఖరికి మూడు పరుగుల తేడాతో ఓడిపోయింది. అంతేకాకుండా రెండో మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు ఏకంగా ఏడు క్యాచ్‌లు జారవిడిచారు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు మ్యాచ్‌ల్లోనూ విఫలమైంది. తొలి మ్యాచ్‌లో 9 పరుగులు చేసిన హర్మన్ రెండో మ్యాచ్‌లో 5 పరుగులతో సరిపెట్టుకుంది. చివరిసారి 2007లో స్వదేశంలో ఆస్ట్రేలియాపై వన్డే మ్యాచ్‌లో గెలిచిన భారత్ ఆ తర్వాత వరుసగా తొమ్మిది వన్డేల్లో ఓటమి చవిచూసింది. స్వదేశంలో ఆసీస్ చేతిలో పరాజయపరంపరకు తెర దించాలంటే చివరి వన్డేలో భారత జట్టు విశేషంగా రాణించాల్సి ఉంటుంది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, యసిక్త భాటియాలతోపాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా బ్యాటింగ్‌లో మెరిపిస్తే భారత్ భారీ స్కోరు చేసే అవకాశముంటుంది. బౌలింగ్‌లో రేణుక సింగ్‌తోపాటు స్పిన్నర్లు కూడా తమ బాధ్యతను నిర్వర్తించడంతో టీమిండియా విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. చివరి బంతి వరకు ఓటమిని అంగీకరించని తత్వం ఆస్ట్రేలియా క్రికెటర్ల సొంతం. అందుకే రెండు వన్డేల్లోనూ ఆ జట్టు ఒత్తిడికిలోనైన సందర్భాల్లో తడబడకుండా సంయమనంతో ఆడి కోలుకున్నారు. ఫోబి లిచ్‌ఫీల్డ్, తాలియా మెక్‌గ్రాత్, యాష్లే గార్డ్‌నర్, ఎలీస్ పెరీ, కెప్టెన్ అలీసా హీలీ, అనాబెల్ సదర్లాండ్ మరోసారి రాణిస్తే ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం సాధ్యమే.

సస్పెన్షన్‌ను పట్టించుకోం... కమిటీని గుర్తించం!

డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ సంజయ్ సింగ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఇంత జరిగినా కూడా... భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) కొత్త అధ్యక్షుడు సంజయ్ సింగ్ తన వైఖరి మార్చుకోవడం లేదు. కేంద్ర క్రీడాశాఖ విధించిన సస్పెన్షన్‌ను పట్టించుకోమని, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నియమించిన అడ్‌హక్ కమిటీని కూడా గుర్తించబోమని ధిక్కారపు ధోరణిని ప్రదర్శించారు. త్వరలోనే జాతీయ జూనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించి తీరుతామని పేర్కొన్నారు. 'మేం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికయ్యాం. రిటర్నింగ్ అధికారి దీన్ని ధ్రువీకరిస్తూ సంతకం చేశారు. అలాంటి కార్యవర్గాన్ని ఎందుకు విస్మరిస్తారు. అడ్‌హక్ కమిటీతో మాకు సంబంధం లేదు. మా సమాఖ్యను మేమే నడిపించుకుంటాం త్వరలోనే ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పోటీల నిర్వహణపై నిర్ణయం కూడా తీసుకుంటాం' అని సంజయ్ వెల్లడించారు. నియమావళిని అతిక్రమించలేదని ఇదివరకే క్రీడాశాఖకు సంజాయిషీ ఇచ్చామని, వారి స్పందన కోసం ఎదురు చూస్తున్నామన్నారు.

సినిమా


ఎన్టీఆర్

గ్లింప్స్‌కి వేళాయె

ఎన్టీఆర్ 'దేవర' సినిమా అప్‌డేట్ కోసం ఎప్పటి నుంచో ఆత్రుతగా ఎదురు చూస్తున్న అభిమానులకు ఓ గుడ్ న్యూస్. వారం రోజుల్లో ఫ్యాన్స్ నిరీక్షణకు ఫుల్‌స్టాప్ పడనుంది. ఈ నెల 8న 'దేవర' సినిమా పార్ట్ 1 గ్లింప్స్‌ని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ పవర్‌ఫుల్ లుక్‌ని విడుదల చేశారు నిర్మాతలు. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్-దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తయింది. రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' తొలి భాగం గ్లింప్స్‌ను ఈ నెల 8న రిలీజ్ చేయనున్నాం. సినిమాని ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.


రవితేజ

థ్రిల్లింగ్ ఈగల్

రవితేజ హీరోగా, కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. కాగా నూతన సంవత్సరం కానుకగా ఈ మూవీ నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఈగల్'. రవితేజని పవర్‌ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు కార్తీక్. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ''2024 ఉషోదయం మీకు ఆశీర్వాదాలు, విజయాలతో పాటు మరపురాని జ్ఞాపకాలను ఇస్తుంది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు'' అంటూ రవితేజ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: దేవ్ జాంద్.

పోలీస్ భీమా


గోపీచంద్

గోపీచంద్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'భీమా'. ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ కథానాయికలుగా నటిస్తున్నారు. కేకే రాధా మోహన్ నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ సినిమా నుంచి ఇంటెన్స్ పోస్టర్‌ని విడుదల చేసింది యూనిట్. ఖాకీ దుస్తుల్లో చేతిలో సంకెళ్లు పట్టుకొని సీరియస్ లుక్‌లో ఉన్నారు గోపీచంద్. ''యునిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'భీమా' రూపొందుతోంది. ఈ సినిమాలో గోపీచంద్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్ర పోషిస్తున్నారు. సాంకేతికంగా, నిర్మాణ విలువల పరంగా ఈ సినిమాని భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె. గౌడ, సంగీతం: రవి బస్రూర్.

చీకటి యుగంలోకి...


మమ్ముట్టి

కొత్త సంవత్సరం సందర్భంగా మలయాళ స్టార్ మమ్ముట్టి సరికొత్త లుక్‌లో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. మమ్ముట్టి లీడ్ రోల్‌లో 'భ్రమయుగం' అనే చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలోని మమ్ముట్టి డిఫరెంట్ లుక్ విడుదలైంది. హారర్ థ్రిల్లర్ జోనర్‌లో కేరళలోని కొన్ని వందల ఏళ్ల క్రితం నాటి ఘటనల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ పతాకాలపై రామచంద్ర చక్రవర్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేరళలోని చీకటి యుగాల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి క్రిస్టో జేవియర్ సంగీతదర్శకుడు. కాగా ఈ చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన నైట్ షిఫ్ట్ స్టూడియోస్ సంగీతప్రపంచలోకి అడుగుపెడుతూ 'నైట్ షిఫ్ట్ రికార్డ్స్'ని ఆరంభించింది. ''ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్లో ప్రతిధ్వనించే విభిన్నమైన సౌండ్ ట్రాక్‌ల సేకరణను నిర్వహించడం మా 'నైట్ షిఫ్ట్ రికార్డ్స్' లక్ష్యం. మొదటగా ఈ మ్యూజిక్ లేబుల్ నుంచి 'భ్రమయుగం' సౌండ్ ట్రాక్‌ను రిలీజ్ చేస్తాం'' అన్నారు రామచంద్ర చక్రవర్తి.

నాట్య కళాకారిణి గీతాంజలి


అంజలి

అంజలి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకుడు. ఈ చిత్రంతో మలయాళ నటుడు రాహుల్ మాధవ్ తెలుగుకి పరిచయం అవుతున్నారు. కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్‌లపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి అంజలి స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పాడుబడ్డ భవంతిలో నాట్య కళాకారిణి లుక్‌లో అంజలి కనిపిస్తున్నారు. ''గీతాంజలి'కి సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' రూపొందుతోంది. ఆ సినిమా ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే సీక్వెల్ ఆరంభం అవుతుంది. ఇప్పటివరకు వచ్చిన హారర్ కామెడీ చిత్రాలన్నీ ఒక ఎత్తయితే ఈ చిత్రం వాటిని మించేలా ఉంటుంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. శ్రీనివాస్ రెడ్డి, 'సత్యం' రాజేశ్, 'షకలక' శంకర్, సత్య, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, కెమెరా: సుజాత సిద్ధార్థ్.


రకుల్


రకుల్, జాకీ

ఫిబ్రవరిలో పెళ్లి?

జాకీ భగ్నానీ, రకుల్ ప్రీత్ సింగ్ ఫిబ్రవరిలో ఏడడుగులు వేయనున్నారనే వార్త గుప్పుమంది. హీరోయిన్ రకుల్, హీరో-నిర్మాత జాకీ దాదాపు రెండు మూడేళ్లుగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. ఈ ప్రేమను పెళ్లి వరకూ తీసుకెళ్లాలని ఈ ఇద్దరూ నిర్ణయించుకున్నారట. ఫిబ్రవరి 22న పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారని సమాచారం. గోవాలో డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లాన్ చేస్తున్నారట. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో రకుల్, జాకీల పెళ్లి జరగనుందని భోగట్టా. సోమవారం ఈ పెళ్లి వార్త వైరల్‌గా మారినప్పటికీ రకుల్, జాకీ నుంచి ఎలాంటి స్పందన లేదు.


హర్ష

ఓ ఉపాధ్యాయుడి కథ

హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన తారాగణంగా కల్యాణ్ సంతోష్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సుందరం మాస్టర్'. ఆర్.టి. టీమ్ వర్క్స్, గోల్డెన్ మీడియా బ్యానర్స్‌పై రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఈ చిత్రం అటెండెన్స్ ప్రోమోను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ- ''సుందరం అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి చుట్టూ నడిచే కథ ఇది. సోషల్ స్టడీస్ బోధించే సుందరం మిర్యాలమెట్ట అనే మారుమూల పల్లెలో ఇంగ్లిష్ టీచర్‌గా వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. అక్కడికి అన్ని వయసులవారు ఇంగ్లిష్ నేర్చుకోవటానికి విద్యార్థులుగా వస్తారు. వారికి సుందరం ఇంగ్లిష్ ఎలా బోధించాడన్నది ఆసక్తిగా సాగుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: దీపక్ ఎరెగడ.

యువతరం ఆలోచనలతో...


కార్తీక్, విరాజ్, రుహానీ, సుహాస్

సుహాస్, విరాజ్ అశ్విన్, రుహానీ శర్మ, కార్తీక్ రత్నం ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'శ్రీరంగ నీతులు'. ప్రవీణ్ కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రం ప్రమోషనల్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది యూనిట్. ఇందులో భాగంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రవీణ్ కుమార్ వీఎస్ఎస్ మాట్లాడుతూ- ''నేటి తరం ఆలోచనలు, భావోద్వేగాలు ఎలా ఉంటున్నాయి? అనేది ఈ చిత్రంలో మూడు పాత్రల ద్వారా చూపిస్తున్నాం. కొత్తదనంతో పాటు పూర్తి వాణిజ్య అంశాలతో రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 5న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు వెంకటేశ్వరరావు బల్మూరి. ఈ చిత్రానికి కెమెరా: టీజో టామీ, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.

సాక్షి బిజినెస్

మంగళవారం
2-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
32	11
72,271	21,742

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	15,011	▼	84
డోజోన్స్	37,699	▼	21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,773	▲	10
డాక్స్	16,752	▲	50
షాంఘై	2,975	▲	20
నికాయ్	33,644	▼	50

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,352
బంగారం (99.5 స్వచ్ఛత)	63,098
వెండి (కేజీ)	73,705

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.68	83.92
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	105.43	107.96
€	యూరో	ఒకటికి	90.99	93.99
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	57.65	59.05
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	56.01	58.37
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.77	23.55
¥	చైనా యువాన్	పదింటికి	10.60	12.68

చైనాకు దీటైన పోటీదారుగా ఎదగాలి

మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా



న్యూఢిల్లీ: సరఫరా వ్యవస్థలో చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కొనగలిగే నమ్మకమైన పోటీదారుగా భారత్ ఎదగడం ప్రపంచానికి ఎంతో అవసరమని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. 2024లో ఇందుకు చక్కని అవకాశాలు ఉన్నాయని, దేశంలోకి పెట్టుబడులు అసాధారణ స్థాయిలో వెల్లువెత్తగలవని నూతన సంవత్సర సందేశంలో ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ ఉవ్వెత్తున ఎగుస్తుందనే సంకేతాలే అన్ని వైపుల నుంచి లభిస్తున్నాయని మహీంద్రా పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి బాటలో పురోగమించాలంటే విప్లవాత్మకమైన ఆవిష్కరణలు చేయగలిగే సత్తాను సాధించడం కీలకంగా ఉండగలదని ఆయన చెప్పారు.

97 శాతం రూ. 2,000 నోట్లు తిరిగొచ్చాయ్: ఆర్‌బీఐ



ముంబై: రూ. 2,000 నోట్లకు సంబంధించి దాదాపు 97.38 శాతం నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయని రిజర్వ్ బ్యాంక్ సోమవారం వెల్లడించింది. ప్రజల దగ్గర ఇంకా రూ. 9,330 కోట్ల విలువ చేసే నోట్లు ఉన్నాయని వివరించింది. డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) అనంతరం 2016 నవంబర్‌లో ప్రవేశపెట్టిన రూ. 2,000 కరెన్సీ నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
1-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	579-00
వరంగల్	581-00
రిటైల్ ధర	6.40

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.64 లక్షల కోట్లు

డిసెంబర్‌లో 10 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు డిసెంబర్‌లో రూ.1.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022 ఇదే నెలతో పోల్చితే ఈ విలువ 10 శాతం అధికం. ఏప్రిల్–డిసెంబర్ 2023 మధ్య జీఎస్‌టీ వసూళ్లు 12 శాతం పెరిగి రూ.14.97 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో వసూళ్లు సగటున 12 శాతం వృద్ధితో రూ.1.66 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్ నెలల్లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి. జూలై వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు. ఆగస్టు వసూళ్లు రూ. 1.59 లక్షల కోట్లు కాగా, సెప్టెంబర్‌లో రూ. 1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ రాబడి నమోదయ్యింది. ఇక అక్టోబర్ విషయానికి వస్తే. వసూళ్లు భారీగా రూ.1.72 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2017 జూలైలో ప్రారంభం తర్వాత ఇవి రెండవ భారీ స్థాయి వసూళ్లు (2023 ఏప్రిల్ తర్వాత). నవంబర్‌లో వసూళ్లు రూ.1.67 లక్షల కోట్లు. ఎకానమీ క్రియాశీలత, పన్నుల ఎగవేతలను అడ్డుకునేందుకు కేంద్రం చర్యలు, వసూళ్ల వ్యవస్థలో సామర్థ్యం పెంపు, పండుగల డిమాండ్ జీఎస్‌టీ భారీ వసూళ్లకు కారణమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రానున్న నెలల్లో సైతం ఇదే ధోరణి కొనసాగుతుందన్న విశ్వాసాన్ని అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

అంకెలు కోట్లలో...

మొత్తం ఆదాయం	రూ.1,64,882
ఇందులో సీజీఎస్‌టీ	రూ.30,443
ఎస్‌జీఎస్‌టీ	రూ.37,935
ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ	రూ. 84,255
సెస్	రూ.12,249

కోటక్ మహీంద్రా బ్యాంక్ చీఫ్‌గా వాశ్వాని బాధ్యతలు



న్యూఢిల్లీ: కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎండీ, సీఈవోగా అశోక్ వాశ్వాని సోమవారం (జనవరి 1న) బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రకటించింది. వ్యవస్థాపక డైరెక్టర్ అయిన ఉదయ్ కోటక్ 2023 సెప్టెంబర్ 1 నుంచి తప్పుకోగా, దీపక్ గుప్తా మధ్యంతర ఎండీ, సీఈవోగా సేవలు అందించారు. ఇప్పుడు ఆయన నుంచి బ్యాంక్ ఎండీ, సీఈవో బాధ్యతలను వాశ్వాని స్వీకరించారు. వాశ్వాని నియామక ప్రతిపాదనకు ఆర్‌బీఐ గతేడాది అక్టోబర్‌లో ఆమోదం తెలియజేయడం గమనార్హం. ఉదయ్ కోటక్ మాదిరే వాశ్వాని సైతం సిడెన్‌హమ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనమిక్స్ పూర్వ విద్యార్థి.

ప్యాసింజర్ వాహన విక్రయాల రికార్డు

2023లో 41.08 లక్షల అమ్మకాలు



న్యూఢిల్లీ: ఆటో అమ్మకాలు డిసెంబర్‌లో పరిశ్రమ వర్గాల అంచనాలను అందుకోలేనప్పటికీ, 2023లో దేశవ్యాప్తంగా రికార్డు సృష్టించాయి. ప్యాసింజర్ వాహన విక్రయాలు 8.3 శాతం వృద్ధితో రికార్డు స్థాయిలో 41.08 లక్షలుగా నమోదయ్యాయి. మొత్తం ప్యాసింజర్ వాహన విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 42% నుంచి 49 శాతానికి పెరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023లో మారుతీ సుజుకీ 31% వృద్ధితో 20.66 లక్షల వాహనాలు విక్రయించింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా విక్రయాలు 9% పెరిగి 7.65 లక్షలకు చేరాయి. టాటా మోటార్స్ 5.53 లక్షల వాహనాలు విక్రయించింది. టయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 46% వృద్ధితో 2.33 లక్షల వాహనాలకు పెరిగాయి.

ఆటో రంగానికి పీఎల్ఐ పొడిగింపు

ఆటో రంగానికి పీఎల్ఐ పథకాన్ని కేంద్రం ఏడాది పొడిగించింది. 2023–24 ఏడాది నుంచి వరుసగా ఐదేళ్ల కాలానికి వర్తించనున్నట్లు పేర్కొంది. ప్రోత్సాహకాలు 2028 మార్చి31 తదుపరి వర్తించవని స్పష్టం చేసింది.

కంపెనీ	డిసెంబర్ 2023	డిసెంబర్ 2022	(%ల్లో)
మారుతీ సుజుకీ	1,37,551	1,39,347	(-)1
హ్యుందాయ్ మోటార్స్	56,450	57,852	(-)2
టాటా మోటార్స్	76,138	72,997	(+)4
ఎంఅండ్ఎం	60,188	56,677	(+)6
హోండా కార్స్	7,902	7,062	(+)12
ఎంజీ మోటార్స్	4,400	3,899	(+)13
టయోటా కిర్లోస్కర్	21,372	17,818	(+)20
బజాజ్ ఆటో	3,26,806	2,81,514	(+)16
టీవీఎస్ మోటార్స్	3,01,898	2,42,012	(+)25
రాయల్ ఎన్‌ఫీల్డ్	63,387	68,400	(-)7
వోల్వో ఐషర్	8,026	7,221	(+)11
ఎస్కార్ట్స్	4,536	5,573	(-)19
మహీంద్రా ట్రాక్టర్స్	19,138	23,243	(-)18

ప్యాకేజ్డ్ ఉత్పత్తులపై తయారీ తేదీ ముద్రణ తప్పనిసరి

అమల్లోకి కొత్త నిబంధన



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ ఉత్పత్తులు అన్నింటిపై 'తయారీ తేదీ'ని, 'యూనిట్ విక్రయ ధర'ను తప్పనిసరిగా ముద్రించాలన్న నిబంధన జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ తెలిపారు. ఇలాంటి ఉత్పత్తులను వేర్వేరు పరిమాణాల్లో విక్రయిస్తారు కాబట్టి 'యూనిట్ విక్రయ ధర' ఎంతనేది వినియోగదారులకు తెలియాల్సిన అవసరం ఉందని, తద్వారా వారు కొనుగోలు విషయంలో తగు నిర్ణయం తీసుకోవడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్యాకేజ్డ్ ఉత్పత్తులపై తయారీ తేదీని లేదా దిగుమతి చేసుకున్న తేదీని లేదా ప్యాక్ చేసిన తేదీని ముద్రించేందుకు కంపెనీలకు వెసులుబాటు ఉండేది. దాన్ని ప్రస్తుతం మార్చారు. తయారీ తేదీని ముద్రించడం వల్ల సదరు ఉత్పత్తి ఎన్నాళ్ల క్రితం తయారైనదీ వినియోగదారులకు స్పష్టంగా తెలిసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే యూనిట్ ధరను ముద్రించడం వల్ల గ్రాముల లెక్కన ఖరీదు ఎంత ఉంటోందో తెలుసుకోవచ్చు. ఉదాహరణకు 2.5 కేజీల గోధుమ పిండి ప్యాకెట్‌పై గరిష్ఠ చిల్లర ధరతో (ఎంఆర్‌పీ) పాటు కేజీ (యూనిట్) ధర ఎంత అనేది కూడా ముద్రించాల్సి ఉంటుంది. ఒకవేళ కేజీ కన్నా తక్కువ పరిమాణం ఉంటే ఎంఆర్‌పీతో పాటు గ్రాముకి ఇంతని ముద్రించాలి.

కొత్త ఏడాది తొలి రోజు
సరికొత్త రికార్డులు తాకి.. వెనక్కి



- ఇంట్రాడేలో జీవితకాల గరిష్టం
- రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- స్వల్ప లాభాల ముగింపు

ముంబై: కొత్త ఏడాది తొలి ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీల రికార్డుల జైత్రయాత్ర కొనసాగింది. ఇంధన, సర్వీసెస్, టెలికం షేర్లు రాణించడంతో సోమవారం ఇంట్రాడేలో సెన్సెక్స్, నిఫ్టీ కొత్త సరికొత్త గరిష్టాలకు చేరుకున్నాయి. అయితే లాభాల స్వీకరణతో తదుపరి వెనక్కి వచ్చాయి. ఉదయం స్వల్ప నష్టంతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 322 పాయింట్లు పెరిగి 72,562 వద్ద, నిఫ్టీ 103 పాయింట్లు బలపడి 21,834 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఆటో, బ్యాంకులు, కన్జూమర్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 32 పాయింట్లు పెరిగి 72,271 వద్ద, నిఫ్టీ 11 పాయింట్ల లాభంతో 21,742 వద్ద నిలిచాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.73%, 0.54% చొప్పున రాణించాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఆసియా, యూరప్ మార్కెట్లు పనిచేయలేదు. అమెరికా మార్కెట్లకూ సెలవు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఆరు పైసలు పతనమై 83.22 వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిసెంబర్‌లో ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగకపోవడంతో ఆటో షేర్లు నష్టపోయాయి.
- ఎన్‌పీఏ పోర్ట్‌ఫోలియో విక్రయంలో భాగంగా జేసీ ఫ్లవర్స్ ఏఆర్‌సీ నుంచి రూ.150 కోట్లు అందుకున్నట్లు ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇవ్వడంతో యస్ బ్యాంక్ షేరు ఐదున్నర శాతం పెరిగి రూ. 22.64 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 7% లాభపడి రూ.22.99 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- దక్షిణ మధ్య రైల్వే నుంచి రూ.121 కోట్ల ఆర్డర్ దక్కించుకోవడంతో రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా షేరు 4.50% లాభపడి రూ.353 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 10% ఎగసి రూ.371 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీపీఎస్సీ- ఏపీలో 21 అసిస్టెంట్ ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో.. ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 21
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(సివిల్/మెకానికల్/కెమికల్/ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.01.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**19.02.2024
» **రాతపరీక్ష తేది:** ఏప్రిల్/మే 2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్, ముంబైలో 291 పోస్టులు

ముంబైలోని ఆదాయపు పన్ను శాఖ, ముంబై రీజియన్‌లో.. వివిధ పోస్టుల కోసం ప్రతిభావంతులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 291
» **పోస్టుల వివరాలు:** ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్(ఐటీఐ)-14, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2 (స్టెనో)-18, టాక్స్ అసిస్టెంట్(టీఏ)-119, మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)-137, క్యాంటీన్ అటెండెంట్ (సీఏ)-03.
» **క్రీడలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, అట్యా-పాట్యా, బ్యాడ్మింటన్, బాల్-బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, నెట్ బాల్, పోలో, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, బ్రిడ్జ్, క్యారమ్, చెస్, క్రికెట్, సైక్లింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, పన్నెండో తరగతి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత క్రీడలో ప్రతిభావంతులై ఉండాలి.
» **వయసు:**01.01.2023 నాటికి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్‌కు 18 నుంచి 30 ఏళ్లు, స్టెనోగ్రాఫర్‌కు 18 నుంచి 27 ఏళ్లు, టాక్స్ అసిస్టెంట్‌కు 18 నుంచి 27 ఏళ్లు, మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు 18 నుంచి 25 ఏళ్లు, క్యాంటీన్ అటెండెంట్‌కు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు క్యాంటీన్ అటెండెంట్/ఎంటీఎస్‌లకు రూ.18,000 నుంచి రూ.56,900, స్టెనోగ్రాఫర్/ట్యాక్స్ అసిస్టెంట్‌కు రూ.25,500 నుంచి రూ.81,100, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్‌కు రూ.44,900 నుంచి రూ.1,42,400.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**19.01.2024
» **వెబ్‌సైట్:** www.incometaxmumbai.gov.in

కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) పీజీ-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)పీజీ-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు పలు ఇతర యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లో పీజీలో ప్రవేశాలు లభిస్తాయి.

» **కోర్సుల వివరాలు:** ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎఫ్ఏ, ఎంపీఏ, ఎంబీఏ, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్, ఎంఎడ్, ఎంఎల్ఐఎస్సీ, ఎంపీఈడీ, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంకాం తదితరాలు.
» **అర్హత:** డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు సీయూఈటీ రాసుకోవచ్చు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. మరికొన్ని కోర్సులకు డిగ్రీలో సంబంధిత కోర్సు చదివినవారై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
» **ఆన్‌లైన్ పరీక్ష:** పరీక్ష కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. మొత్తం 75 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి ఒక గంట 45 నిమిషాలు. మూడు షిఫ్టుల్లో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ భాషల్లో(లాంగ్వేజ్, ఎంటెక్ హయ్యర్ సైన్సెస్, ఆచార్య పేపర్లు తప్ప) ఉంటాయి. ఇందులో 75 ప్రశ్నలు వస్తాయి. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు, తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.


ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.01.2024
» **దరఖాస్తు ఫీజు చెల్లింపుకు చివరితేది:** 25.01.2024.
» **దరఖాస్తు సవరణ:** 27.01.2024 నుంచి 29.01.2024 వరకు
» **పరీక్ష కేంద్రం సమాచారం వెల్లడి:** 04.03.2024
» **అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ ప్రారంభం:** 07.03.2024
» **పరీక్ష తేదీలు:** 11.03.2024 నుంచి 28.03.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://pgcuet.samarth.ac.in

పరిశోధన సంస్థలో.. ఆఫీసర్ కొలువు

» సీఎస్ఐఆర్‌లో 444 పోస్ట్‌ల భర్తీకి ప్రకటన
» కంబైన్డ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ పరీక్ష ద్వారా ఎంపిక
» పే లెవల్ 7, 8 లతో ప్రారంభ వేతన శ్రేణి
» డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం

బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్కారీ కొలువుల నోటిఫికేషన్. గ్రూప్-బి గెజిటెడ్ హోదాలో కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునే చక్కటి అవకాశం! దేశంలోనే అత్యున్నతమైన పరిశోధన సంస్థ.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్).. మొత్తం 444 అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం కంబైన్డ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఏఎస్ఈ)-2023ను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. సీఎస్ఐఆర్-సీఏఎస్ఈ నోటిఫికేషన్ వివరాలు, పోస్ట్‌లు, ఎంపిక విధానం తదితర వివరాలు..



సీఎస్ఐఆర్-సీఏఎస్ఈ 2023

మొత్తం 444 పోస్ట్‌లు

సీఎస్ఐఆర్-సీఏఎస్ఈ తాజా నోటిఫికేషన్ ద్వారా.. మొత్తం 444 సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఇందులో సెక్షన్ ఆఫీసర్(జనరల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేజ్)-76 పోస్టులు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(జనరల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేజ్) - 368 పోస్టులు ఉన్నాయి. సీఎస్ఐఆర్.. సైన్స్ పరిశోధనల్లో మేటి సంస్థ. ఈ సంస్థ పరిపాలన విభాగాల్లో సెక్షన్ ఆఫీసర్స్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష సీఏఎస్ఈ.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024,జనవరి 12 నాటికి 33 ఏళ్లు (ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు) ఉండాలి.

వేతనం

- సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లు.. గ్రూప్-బి గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ర్యాంక్ ఉద్యోగాలు. ఈ పోస్ట్‌లకు ప్రారంభ వేతన శ్రేణి పే లెవల్ 7, 8 లలో ఉంటుంది.
- సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు పే లెవల్ 8(రూ.47,600-రూ.1,51,000); అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు పే లెవల్ 7(రూ.44,900-రూ.1,42,400)తో ప్రారంభ వేతనం అందుతుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్. రాత పరీక్ష రెండు పోస్ట్‌లకు కామన్‌గా ఉంటుంది. ఆ తర్వాత దశలో సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌ల అభ్యర్థులకు మాత్రం 100 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌ల అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ ఉండదు. వీరికి 100 మార్కులకు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.

సీఏఎస్ఈ రాత పరీక్ష

- సీఏఎస్ఈ రాత పరీక్షను మూడు పేపర్లుగా 500 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్ 1లో జనరల్ అవేర్‌నెస్(100 ప్రశ్నలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(50 ప్రశ్నలు) 150 మార్కులకు; పేపర్ 2లో జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ అండ్ మెంటల్ ఎబిలిటీ 200 మార్కులకు; పేపర్ 3లో ఇంగ్లిష్/ హిందీ డిస్క్రిప్టివ్ పేపర్ 150 మార్కులకు ఉంటాయి.
- పేపర్-1, పేపర్-2లలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కులు తగ్గిస్తారు.
- పేపర్-3ని డిస్క్రిప్టివ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇంగ్లిష్ లేదా హిందీలో ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, అప్లికేషన్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది.
- పేపర్-1, 2లలో సాధించిన మార్కుల ఆధారంగా పేపర్-3కి ఎంపిక చేస్తారు.
- సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు సంబంధించి మూడు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు సంబంధించి పేపర్-1, పేపర్-2లలో చూపిన ప్రతిభ ఆధారంగా పేపర్-3కి, అదే విధంగా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌ను అర్హత పరీక్షగానే పేర్కొన్నారు. మూడు పేపర్లలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

జేఎస్ స్థాయికి చేరుకునే అవకాశం

సీఏఎస్ఈలో ప్రతిభ చూపి సెక్షన్ ఆఫీసర్స్‌గా నియమితులైన వారు భవిష్యత్తులో అండర్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్, జాయింట్ సెక్రటరీ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. అదే విధంగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌కు ఎంపికైన వారు డైరెక్టర్ స్థాయి వరకు చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జనవరి 12
- **పేపర్-1, 2 పరీక్ష:** 2024 ఫిబ్రవరిలో.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://csir.cbtexamportal.in/,›csir.res.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ అవేర్‌నెస్

భారత చరిత్ర, జాతీయోద్యమం, భారత రాజ్యాంగం, పాలిటీ, గవర్నెన్స్, సోషల్ జస్టిస్, జాతీయ/అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్

యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, ప్రిపొజిషన్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సినానిమ్స్, యాంటానిమ్స్, సెంటెన్స్ కరెక్షన్, కామన్ ఎర్రర్స్, పంక్చుయేషన్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్ తదితర బేసిక్ గ్రామర్ అంశాలతోపాటు కాంప్రహెన్షన్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను చదవడం, వాటిలో వాక్య నిర్మాణాన్ని అవగాహన చేసుకోవడం, గ్రామర్ యూసేజ్‌లపై దృష్టి సారించడం వంటివి చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. సిరీస్(నంబర్/ఆల్ఫాన్యుమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్-డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి.

అర్థమెటిక్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్,లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలపై ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా,త్రికోణమితి,అల్జీబ్రా,జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్,టైం అండ్ వర్క్,టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ సైన్స్

- ఈ విభాగానికి సంబంధించి ఆరు నుంచి పదో తరగతి వరకు సైన్స్ పాఠ్య పుస్తకాల్లోని అంశాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా వ్యాధులు-చికిత్స, ఔషధాలు, ప్లాంట్ అనాటమీ, మార్ఫాలజీ, యానిమల్ కింగ్ డమ్ తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- ఆర్థిక, సామాజిక అభివృద్ధి అంశాలు, పర్యావరణ సమస్యలు, జీవ వైవిధ్యం, పర్యావరణ మార్పు తదితర అంశాలకు సంబంధించి అవగాహన ఏర్పరచుకోవాలి. వీటితోపాటు.. ఎథిక్స్, ఇంటెగ్రిటీ, ఆప్టిట్యూడ్, డెసిషన్ మేకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను పెంచుకోవాలి. అదే విధంగా మేనేజ్‌మెంట్ సిద్ధాంతాలు, కార్యాచరణ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

డిస్క్రిప్టివ్ టెస్ట్ ఇలా

డిస్క్రిప్టివ్ టెస్ట్‌కు సంబంధించి రెండు ఎస్సేలు, ఒక ప్రెసిస్ రైటింగ్, ఒక లెటర్ రైటింగ్/అప్లికేషన్ రైటింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం అభ్యర్థులు ఎస్‌బీఐ, ఐబీపీఎస్ పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా దిన పత్రికల్లో ఎడిటోరియల్స్ చదవాలి. ఫలితంగా సమకాలీన అంశాలకు సంబంధించిన వ్యాసాలపై పట్టు సాధించొచ్చు.

కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్

ఈ పరీక్షలో రాణించేందుకు.. వర్డ్ ప్రాసెసింగ్, స్ప్రెడ్ షీట్స్ జనరేషన్, స్లైడ్స్ జనరేషన్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా కీ బోర్డ్ షాట్ కట్స్, బేసిక్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన అంశాలు తెలుసుకోవాలి.

క్లుప్తంగా...

యాదాద్రీశుడి సన్నిధిలో వికాస్‌రాజ్



రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదగిరిగుట్ట: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆచార్యులు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ ప్రతిష్టా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. వికాస్‌రాజ్‌కు ఆచార్యులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఎయిర్‌పోర్టు సిటీ సైడ్ ప్రాంతంలో సెల్ఫ్ చెక్‌ఇన్

సులభతర ప్రయాణం కోసం ఏర్పాటు



శంషాబాద్: విమాన ప్రయాణికుల సేవలను మరింత సులభతరం చేసేందుకు జీఎంఆర్ సంస్థ మరో అడుగు వేసింది. ప్రయాణికులు స్వీయ తనిఖీలను పూర్తి చేసుకోడానికి వీలుగా ఎయిర్‌పోర్టులో సిటీ సైడ్ ఏరియా (కారు పార్కింగ్) సమీపంలో 'సెల్ఫ్ చెక్ ఇన్' ఏర్పాటు చేసింది. దీంతో టెర్మినల్ ఏరియాలో గణనీయంగా ఉండే రద్దీని తగ్గించడంతో పాటు చెక్ ఇన్ ప్రక్రియ మరింత సులభంగా మారనుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్టుల ఈడీ సౌత్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి ఎస్‌జీకే కిశోర్ తెలిపారు. సోమవారం నుంచి దీన్ని అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు మరో 32 పరీక్ష కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షల కోసం మరో 32 కేంద్రాలను ఏర్పాటు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈసారి ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య దాదాపు 30 వేలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం 1,480 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈసారి వాటి సంఖ్య 1,512కు చేరనుంది. రంగారెడ్డి సహా పలు జిల్లాల్లో విద్యార్థులు పెరగడంతో ఆయా జిల్లాల్లో అదనపు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏడాది ఇంటర్‌లో మొత్తంగా 10,59,233 విద్యార్థులకుగాను ఇప్పటివరకు 9,77,040 విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. ఈ నెల 3తో పెనాల్టీతో పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ముగియనుంది.

అయోధ్యలో ప్రతిష్టించే రామ్ లల్లా శిల్పం ఖరారు

- కర్ణాటకకు చెందిన అరుణ్ యోగి రాజ్ చెక్కిన విగ్రహం ఎంపిక
- బీజేపీ దిగ్గజ నేత బీఎస్ యడియూరప్ప వెల్లడి

మైసూరు: అయోధ్య భవ్య రామమందిరంలో ప్రతిష్టించే విగ్రహ ఎంపిక కార్యక్రమం పూర్తయిందని సమాచారం. కర్ణాటకకు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన రామ్‌లల్లా విగ్రహాన్ని ఆలయ పెద్దలు ఎంపిక చేసినట్లు రాష్ట్రానికి చెందిన బీజేపీ దిగ్గజ నేత, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప సోమవారం వెల్లడించారు. రాష్ట్రంలోని రామ భక్తులకు, కర్ణాటక వాసులకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. అయోధ్యలో ఈ నెల 22న విగ్రహ ప్రతిష్టాపన ప్రధాని మోదీ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు సాగుతున్న విషయం తెలిసిందే. హనుమంతుడు జన్మించిన కిష్కింధ ప్రాంతం రాష్ట్రంలోనే ఉందని చెప్పారు. తను చెక్కిన విగ్రహం ప్రతిష్టాపనకు ఎంపిక కావడంపై శిల్పి అరుణ్ యోగిరాజ్ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నారు. బాల రాముడి విగ్రహానికి రూపకల్పన చేసేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అరుణ్ యోగిరాజ్ సహా ముగ్గురు ప్రముఖ శిల్పులకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. కేదార్‌నాథ్‌లో నెలకొల్పిన ఆది శంకరాచార్య విగ్రహాన్ని, ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఏర్పాటు చేసిన సుభాష్ చంద్ర బోస్ గతంలో అరుణ్ యోగిరాజ్ రూపొందించినవే కావడం విశేషం.

'రామభక్తులకే పిలుపు'

అయోధ్య: భవ్య రామాలయం ప్రారంభ కార్యక్రమానికి శ్రీరాముని భక్తులకు మాత్రమే ఆహ్వానాలు అందజేసినట్లు శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ చెప్పారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదంటూ శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సత్యేంద్ర దాస్ స్పందించారు. 'రామ భక్తులకే ఆహ్వానాలు పంపాం. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవు' అని ఆయన స్పష్టం చేశారు.

కేరళ నాయర్లూ... రాజస్తాన్ గుజ్జర్లూ చుట్టాలే!

తేల్చిన జన్యుక్రమ విశ్లేషణ.. సీసీఎంబీ పరిశోధనతో వివాదానికి స్వస్తి

దక్షిణాది రాష్ట్రమైన కేరళలోని నాయర్లు... వాయవ్య దిశలో ఉన్న రాజస్తాన్, దాని పొరుగునే ఉన్న పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాలకు చెందిన గుజ్జర్లు చుట్టాలేనట! ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) తాజా అధ్యయనంలో వెల్లడించింది. నాయర్లతోపాటు కేరళకే చెందిన థియ్యాలు, ఎళవ తెగల ప్రజలు కూడా ఒకప్పుడు దేశ వాయవ్య ప్రాంతానికి చెందిన వారని జన్యుక్రమాల ఆధారంగా నిర్ధారించింది. – సాక్షి, హైదరాబాద్



వలసలపై భిన్న వాదనలు...

భారతదేశ నైరుతి ప్రాంతం.. అంటే కేరళ, కర్ణాటక, తమిళనాడు దక్షిణ భాగాలు జీవవైవిధ్యానికే కాదు.. జన్యువైవిధ్యానికి కూడా పెట్టింది పేరు. వేల సంవత్సరాలుగా ఎక్కడెక్కడి నుంచో ప్రజలు ఇక్కడకు వలస వచ్చి స్థిరపడ్డారని చరిత్రకారులు చెబుతుంటారు. యూదులు, పార్శీలు, రోమన్ కేథలిక్కులు కొన్ని ఉదాహరణలు మాత్రమే. అయితే ఈ ప్రాంతంలోనే ఉన్నప్పటికీ నాయర్లు, థియ్యాలు, ఎళవ తెగల వారు ఎక్కడి నుంచి వలస వచ్చారన్న విషయంపై భిన్నాభిప్రాయాలు ఉండేవి. చరిత్రకారుల అంచనాల ప్రకారం వారంతా గంగా తీరంలోని అహిఛాత్ర (ఇనుప రాతి యుగం) ప్రాంతం నుంచి వలస వచ్చిన వారని చారిత్రక, లిఖిత దస్తావేజుల సాయంతో వాదిస్తున్నారు. మరోవైపు ఈ వాదనతో మరికొందరు విభేదించేవారు. వారంతా ఇండో–సిథియన్ వర్గం వారని, దేశ వాయవ్య ప్రాంతం నుంచి వలస వచ్చారని పేర్కొనేవారు.

డీఎన్‌ఏ సేకరణతో...

ఈ నేపథ్యంలో నాయర్లు సహా ఇతరుల వలస ఎలా సాగింది? వారు ఏ ప్రాంతానికి చెందిన వారై ఉండవచ్చో నిర్ధారించేందుకు సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త కుమారస్వామి తంగరాజ్ నేతృత్వంలోని బృందం ప్రయత్నించింది. నాయర్లు, థియ్యాలు, ఎళవ తెగల వంటి భూస్వామ్య, యుద్ధవీరుల తెగలకు చెందిన 213 మంది జన్యుక్రమాలను సేకరించింది. అటు తల్లివైపు నుంచి మాత్రమే అందే మైటోకాండ్రియల్ డీఎన్‌ఏ గుర్తులు, ఇటు జన్యుక్రమం మొత్తమ్మీద ఉండే ఆటోసోమల్ గుర్తులను (మన మునుపటి తరాల గురించి తెలిపేవి. సెక్స్ క్రోమోజోములు మినహా మిగిలిన 22 క్రోమోజోముల్లో ఈ మార్పులు ఉంటాయి. వారసత్వంతోపాటు జన్యుపరమైన సంబంధాలు, నిర్దిష్ట వ్యాధులు సోకేందుకు ఉన్న అవకాశాల గురించి ఈ మార్పులు సూచిస్తాయి) విశ్లేషించింది. వాటిని యూరేసియా ప్రాంతంలోని పురాతన, ప్రస్తుత తెగల జన్యుక్రమాలతో తంగరాజ్ బృందం పోల్చిచూసింది. కేరళలోని నాయర్లు, థియ్యాలు, ఎళవలతోపాటు కర్ణాటకలోని బంట్స్ (ఐశ్వర్యారాయ్ బంట్ తెగకు చెందిన మహిళే), హొయసళ సామాజిక వర్గ ప్రజలు కూడా జన్యుపరంగా దేశ వాయవ్య ప్రాంత ప్రజలతో దగ్గరి సంబంధాలు కలిగి ఉన్నారని ఈ పరిశోధన ద్వారా స్పష్టమైంది. ఈ పరిశోధన వివరాలు జీనోమ్ బయాలజీ అండ్ ఎవల్యూషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

వారి మధ్య ఎక్కువ జన్యుసంబంధాలు..

నాయర్లు, థియ్యా, ఎళవ తెగల ప్రజలకు దేశ వాయవ్య ప్రాంతంలోని కాంభోజ్, గుజ్జర్ తెగల ప్రజలకు మధ్య జన్యుసంబంధాలు ఎక్కువగా ఉన్నట్లు ఈ పరిశోధన స్పష్టం చేసింది. అంతేకాకుండా వారిలో ఇరాన్ ప్రాంత జన్యు వారసత్వం కూడా ఇతరుల కంటే ఎక్కువగా ఉంది. తల్లివైపు నుంచి అందిన జన్యు సమాచారాన్ని విశ్లేషిస్తే పశ్చిమ యూరేసియా ప్రాంత వారసత్వం కనిపిస్తోంది. దీన్నిబట్టి మహిళల నేతృత్వంలో జరిగిన వలసలో వారు భాగమై ఉంటారని చెప్పవచ్చు.
– డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, శాస్త్రవేత్త

గోదావరి తీరం మీదుగా...

భారతదేశ దక్షిణ, పశ్చిమ తీర ప్రాంతంలోని వాయవ్య ప్రాంతం నుంచి గోదావరి తీరం ద్వారా కర్ణాటకకు ఆ తరువాత అక్కడి నుంచి మరింత దక్షిణంగా కేరళకు నాయర్లు, ఇతర వర్గాల ప్రజలు వలస వచ్చినట్లు ఈ పరిశోధన ద్వారా తేలింది.
– సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి

100% ఆక్యుపెన్సీ దాటిన 'వందేభారత్'

- విశాఖ–సికింద్రాబాద్, సికింద్రాబాద్–తిరుపతి రైళ్లకు భారీ డిమాండ్
- న్యూఇయర్, సంక్రాంతి నేపథ్యంలో పెరిగిన రద్దీ



సాక్షి, హైదరాబాద్: కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన వందేభారత్ రైళ్లు అత్యధిక ఆక్యుపెన్సీతో పరుగులు తీస్తున్నాయి. దక్షిణమధ్య రైల్వేలో గతేడాది ప్రవేశపెట్టిన నాలుగు రైళ్లలో ఆక్యుపెన్సీ వంద శాతం దాటింది. ఈ రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రయాణికుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది.

సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్‌లో 134% ఆక్యుపెన్సీ..

సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను గతేడాది జనవరిలో ప్రవేశపెట్టారు. 16 కోచ్‌లతో ఈ రైలు ప్రారంభమైంది. మొదటి నుంచి ఈ రైలు 100 శాతం ఆక్యుపెన్సీతో స్థిరంగా నడుస్తోంది. గత డిసెంబర్‌లో ఈ ట్రైన్‌లో ప్రయాణికుల నుంచి అనూహ్యమైన డిమాండ్ ఏర్పడింది. సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో 134 శాతం ఆక్యుపెన్సీ నమోదు కావడం విశేషం. ఇక విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే వందేభారత్‌లో ఇది ఏకంగా 143 శాతానికి చేరుకుంది. సంవత్సరాంతం కావడంతో రెండు వైపుల నుంచి ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో చాలా మంది వెయిటింగ్ జాబితాలో నిరీక్షించవలసి వచ్చింది. గత డిసెంబర్ ఆఖరు వారంలో వరుస సెలవులు రావడంతో ఎక్కువ మంది రాకపోకలు సాగించారు. సంక్రాంతి వరకు కూడా ప్రయాణికుల రద్దీ ఇలాగే ఉండవచ్చని అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్‌లో...

గతేడాది ఏప్రిల్లో సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మొదట 8 కోచ్‌లతో ప్రారంభించారు. ఈ ట్రైన్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి 100 శాతం ఆక్యుపెన్సీతోనే నడుస్తోంది. ప్రయాణికుల నుంచి అనూహ్యమైన స్పందన లభించడంతో గతేడాది మే 17 నుంచి 16 కోచ్‌లకు పెంచారు. గత డిసెంబర్‌లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు 114 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. అలాగే తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే వందేభారత్‌లో 105 శాతానికి ఆక్యుపెన్సీ చేరుకోవడం గమనార్హం. మరోవైపు గత సెప్టెంబర్‌లో 8 బోగీలతో ప్రవేశపెట్టిన కాచిగూడ–యశ్వంత్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో డిసెంబర్‌లో ఆక్యుపెన్సీ 107 శాతానికి చేరింది. తిరుగుదిశలో యశ్వంత్‌పూర్ నుంచి కాచిగూడ వరకు 110 శాతం వరకు నమోదైంది. అలాగే దక్షిణమధ్య రైల్వే పరిధిలోని విజయవాడ–ఎంజీఆర్ చెన్నై–వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సైతం గత డిసెంబర్‌లో 126 శాతం ఆక్యుపెన్సీ నమోదవగా చెన్నై నుంచి విజయవాడకు వచ్చే ట్రైన్‌లో ఇది 119 శాతం వరకు ఉంది. గత సెప్టెంబర్‌లో 8 కోచ్‌లతో ఈ ట్రైన్‌ను ప్రవేశపెట్టారు. ఈ ట్రైన్ తిరుపతి మీదుగా రాకపోకలు సాగిస్తోంది.

ఆకట్టుకుంటున్న సదుపాయాలు...

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏర్పాటు చేసిన సదుపాయాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. తక్కువ సమయంలోనే గమ్యస్థానానికి చేరుకొనే విధంగా రైళ్లను నడుపుతుండటంతో ఎక్కువ మంది వందేభారత్ వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ ట్రైన్‌లో ఏసీ చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో అన్ని రకాలసదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జీపీఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఆటోమేటిక్ స్లైడింగ్ డోర్లు, రిక్లైనింగ్ సీట్లు, అన్ని కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలు, డిఫ్యూజ్డ్ ఎల్ఈడీ లైటింగ్, చార్జింగ్ పాయింట్లు వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయి. ప్రయాణికులకు పూర్తిగా సురక్షితమైన, మెరుగైన ప్రయాణ సౌకర్యం లభిస్తుంది.

కష్టాల్లో చైనా ఆర్థిక వ్యవస్థ

నూతన సంవత్సర సందేశంలో జిన్‌పింగ్ ఒప్పుకోలు

బీజింగ్: దేశం ఆర్థికంగా గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటోందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా అంగీకరించారు. ఆదివారం ఆయన నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలనుద్దేశించి టీవీలో మాట్లాడారు. వ్యాపార సంస్థలు ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయని, ఉద్యోగాలు దొరకని మంది కనీస అవసరాలు కూడా తీరక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇవన్నీ తన దృష్టిలో ఉన్నాయంటూ జిన్‌పింగ్..దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు,వేగవంతం చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అదేసమయంలో, చైనా ప్రధాన భూభాగంతో తైవాన్ విలీనంపై వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఉత్పాదకరంగం గత ఆరు నెలల్లోనే కనిష్టానికి చేరుకున్నట్లు ప్రభుత్వం అంతముందు విడుదల చేసిన గణాంకాల్లో తెలిపింది. 2013 నుంచి డిసెంబర్ 31వ తేదీన ప్రజలకు సందేశం ఇచ్చే సంప్రదాయం కొనసాగిస్తున్న జిన్‌పింగ్ మొట్టమొదటిసారిగా దేశ ఆర్థిక పరిస్థితి బాగోలేదని స్వయంగా తెలపడం గమనార్హం.

బైడెన్, జిన్‌పింగ్ న్యూ ఇయర్ శుభాకాంక్షలు

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పాటై 45 ఏళ్లు అయిన సందర్భంగా ఈ మేరకు సోమవారం ఇరువురు నేతలు సందేశాలు పంపుకున్నారు. నవంబర్‌లో శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అపెక్ శిఖరాగ్రం సందర్భంగా తీసుకున్న నిర్ణయాల అమలుకు చర్యలు తీసుకోవాల్సిందిగా జిన్‌పింగ్ తన సందేశంలో బైడెన్‌ను కోరారు. అమెరికా, చైనాల మధ్య దౌత్యసంబంధాలు ఏర్పాటు కావడం ద్వైపాక్షిక, అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో మైలురాయిగా మిగిలిపోయిందన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలను బాధ్యతయుతంగా కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నట్లు బైడెన్ తన సందేశంలో తెలిపారు.

కొత్త ఏడాదికి కిక్కేకిక్కు

- డిసెంబర్ 30న రికార్డు స్థాయిలో రూ. 312 కోట్ల విలువైన లిక్కర్ విక్రయం
- కేవలం మూడురోజుల్లో అమ్మకాలు రూ.620 కోట్ల దాకా



సాక్షి, హైదరాబాద్: కొత్త ఏడాదికి లిక్కర్ కిక్కు బాగానే ఎక్కింది. కొత్త సంవత్సర వేడుకల ప్రారంభమయ్యే రోజుతోపాటు రెండు రోజుల ముందు నుంచీ ఏకంగా రూ.620 కోట్ల విలువైన మద్యం డిపోల నుంచి వైన్‌షాపులకు చేరింది. డిసెంబర్ 31న ఆదివారం సెలవుదినం అయినా, మద్యం డిపోలు తెరచి ఉంచగా, రూ.127 కోట్ల విలువైన మద్యం షాపులకు చేరింది. డిసెంబర్ 30న రూ.313 కోట్లు, డిసెంబర్ 29న రూ.180 కోట్ల మద్యం డిపోల నుంచి వెళ్లిందని ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి. అయితే, కొత్తగా ప్రారంభమైన షాపుల్లో అమ్మకాల కోసం ఈ నెల మొదట్లోనే పెద్ద ఎత్తున లిక్కర్ చేరిందని, ఈ నేపథ్యంలో కొంత తగ్గుదల కనిపిస్తుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే డిసెంబర్ 31న కొంత తగ్గినా, 30న రూ.59 కోట్లు, 29న రూ.21 కోట్ల మేర ఎక్కువ అమ్ముడయిందని చెబుతున్నారు. ఇక, కొత్త సంవత్సరం వేడుకల్లో భాగంగా ఒక్క డిసెంబర్ 31నే 6లక్షల కేసుల లిక్కర్, 6.5లక్షల కేసుల బీర్లు వైన్‌షాపుల నుంచి అమ్ముడుపోయి ఉంటాయని, అంతకంటే ముందు రెండు రోజులు, జనవరి 1న కూడా ఇదే స్థాయిలో లిక్కర్ అమ్ముడవుతుందని అంటున్నారు.

ఈ డిసెంబర్‌లో రూ.4,274 కోట్లు

ఇక, గత ఏడాది డిసెంబర్ నెల మద్యం అమ్మకాలను పరిశీలిస్తే అంతకుముందు ఏడాది కంటే 27 శాతం పెరిగాయి.

- 2022 డిసెంబర్‌లో రూ.3,377 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగ్గా, 2023 డిసెంబర్‌లో అది రూ.4,274 కోట్లకు చేరింది.
- లిక్కర్ కేసులు 2022 డిసెంబర్‌లో 32.50లక్షలు అమ్ముడుపోగా, 2023లో 43.40లక్షలు అమ్ముడయ్యాయి.
- బీర్లు 2022 డిసెంబర్‌లో 39.56 లక్షల కేసులు అమ్ముడవగా, 2023 డిసెంబర్‌లో 46.10లక్షల కేసులు అమ్ముడయినట్టు ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి.
- 2022 డిసెంబర్‌తో పోలిస్తే 2023 డిసెంబర్‌లో లిక్కర్ అమ్మకాలు 33 శాతం, బీర్లు 16 శాతం పెరగడం గమనార్హం.

గత మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా డిపోల్లో జరిగిన మద్యం విక్రయ వివరాలు

2023లో ఇలా....

తేదీ	లిక్కర్ కేసులు	బీర్ కేసులు	విలువ (రూ.కోట్లలో)
డిసెంబర్ 31	1.17	1.28	127
డిసెంబర్ 30	2.96	2.91	313
డిసెంబర్ 29	1.64	1.94	180

2022లో ఇలా....

తేదీ	లిక్కర్ కేసులు	బీర్ కేసులు	విలువ (రూ.కోట్లలో)
డిసెంబర్ 31	2.18	1.28	216
డిసెంబర్ 30	2.71	0.61	254
డిసెంబర్ 29	1.53	1.12	159

(నోట్: లిక్కర్, బీర్ కేసులు లక్షల్లో)

శ్రీవారి సేవలో ప్రముఖులు





శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, తిరుమలలో గతేడాది డిసెంబర్ 23వ తేదీన ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి పర్వదినాలు సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. తిరుమల శ్రీవారిని వైకుంఠ ద్వారం గుండా ఆదివారం అర్ధరాత్రి వరకు 64,665 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.34 కోట్లు కానుకలుగా సమర్పించారు.



ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నుమాయిష్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్ కా నిషాన్ నుమాయిష్

- నుమాయిష్‌కు మరింత గుర్తింపు తెచ్చేందుకు కృషి
- నాంపల్లి ఎగ్జిబిషన్ ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కా నిషాన్ నుమాయిష్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. హైదరాబాద్ అంటే చార్మినార్, ట్యాంక్‌బండ్ తరువాత గుర్తొచ్చేది నాంపల్లి నుమాయిష్ అని అన్నారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 83వ నుమాయిష్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతి ఏటా నుమాయిష్ ప్రాధాన్యత, గుర్తింపు తగ్గకుండా నిర్వహిస్తున్న సొసైటీని అభినందించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వ్యాపారవేత్తలందరూ నుమాయిష్‌లో పాలుపంచుకుంటున్నారని, ఎన్నో కళలకు సంబంధించిన వస్తువులు సైతం ఇక్కడ ప్రదర్శించడం అభినందనీయమన్నారు. సామాజిక బాధ్యతతో విద్యా సంస్థలను నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ స్ఫూర్తిదాయకమని, సొసైటీతోపాటు విద్యాసంస్థలకు కూడా ప్రభుత్వం నుంచి పూర్తి తోడ్పాటు అందిస్తామన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఎగ్జిబిషన్ కమిటీలో మహిళల ప్రాతినిధ్యం అభినందనీయమని, పారిశ్రామికరంగంలో మహిళలకు మరింత ప్రోత్సాహం కల్పించాలని సీఎం ఆకాంక్షించారు.

అన్నిరంగాల్లో మార్పు తీసుకొస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకున్నారని, నుమాయిష్‌తోపాటు అన్ని రంగాల్లో మార్పు తీసుకొచ్చి చూపిస్తామని మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్న నుమాయిష్ రాష్ట్రానికే గర్వకారణంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఐపీఎస్ అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీజీపీ రవి గుప్తా


తెలంగాణ పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శం: డీజీపీ

ఘనంగా ఐపీఎస్ అధికారుల న్యూ ఇయర్ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అధికారుల మెస్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. డీజీపీ రవి గుప్తా ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, తెలంగాణ పోలీసు వ్యవస్థ దేశానికే ఆదర్శమని, భవిష్యత్తులోనూ అదే స్థాయిలో పనిచేసి రాష్ట్ర ప్రజల భద్రతను కాపాడతామని అన్నారు. కొత్త ఏడాదిలోనూ నిబద్ధతతో పనిచేసి దేశంలోనే మేటి పోలీస్ వ్యవస్థగా మన తెలంగాణ పోలీసుల కీర్తి పెంచాలని అధికారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోడ్డు భద్రత అథారిటీ చైర్మన్ అంజనీ కుమార్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి గోవింద్‌సింగ్, అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్ జైన్, మహేశ్ భగవత్, శిఖాగోయల్, విజయ్‌కుమార్, సందీప్ శాండిల్యా, అనిల్‌కుమార్, అభిలాషబిస్త్, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్ చౌహాన్, ఐజీలు రమేశ్‌రెడ్డి, సుధీర్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వప్రసాద్, తరుణ్‌జోషి, ఏఆర్ శ్రీనివాస్‌తోపాటు ఇతర ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. డీజీపీ రవిగుప్తా.. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలను వేర్వేరుగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రూ.2.91 కోట్ల విలువైన బంగారం పట్టివేత

- మూడు వేర్వేరు కేసుల్లో 4.59 కిలోల బంగారం స్వాధీనం
- నలుగురిని అరెస్ట్ చేసిన కస్టమ్స్ అధికారులు



సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో భారీ మొత్తంలో బంగారం పట్టుబడింది. మూడు వేర్వేరు కేసులలో రూ.2.91 కోట్ల విలువైన 4.59 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు హైదరాబాద్ కస్టమ్స్ విభాగం జాయింట్ కమిషనర్ వివేకానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 30న దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రయాణికురాలు లోదుస్తుల్లో దాచి బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కస్టమ్స్ అధికారులు తనిఖీ చేసి 1,632 గ్రాముల బరువు ఉన్న 14 గోల్డ్ బార్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,03,63,200 ఉంటుందని తెలిపారు. అదే విధంగా డిసెంబర్ 31న ఓ ప్రయాణికుడిని తనిఖీ చేయగా 1,100 గ్రాముల బంగారం, మరో ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి 1,865.2 గ్రాముల బంగారం పట్టుబడింది. మొత్తం కలిపి 4.59 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.